www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
గురువారం 17, జూలై, 2025 | పేజీలు :12

# బనకచర్ల ఊసేలేని సీఎంల భేటీ

## 4 అంశాలపైనే ప్రధానంగా చర్చ
## నీటి వాటాలపై ఇంజినీర్లు, అధికారులతో కమిటీ
## ఆ తర్వాతే సీఎంల స్థాయిలో చర్చిస్తాం



ఢిల్లీ వేదికగా శ్రమశక్తి భవన్‌లో తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశం బనకచర్ల ప్రస్తావన రాకుండానే ముగిసింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో జరిగిన చర్చల్లో కృష్ణా, గోదావరి జలాల వినియోగంపై ఉన్న సమస్యల పరిష్కారానికి రెండు రాష్ట్రాల అధికారులు, ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. నీటి వివాదాలే అజెండాగా గంటన్నరపాటు ఇరు రాష్ట్రాల సీఎంలు, అధికారులు చర్చలు జరిపారు. సమావేశం అనంతరం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

**బనకచర్ల ప్రతిపాదనే రాలేదు**

ఈ సమావేశంలో ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు గురించి ప్రతిపాదనే చేయలేదని.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఏపీ ప్రభుత్వం తమ అజెండాలో బనకచర్ల ప్రాజెక్టు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు... ఇక తెలంగాణ తరుపున ఆపాలన్న చర్చే ఉండదు కదా అన్నారు. పైగా ఇది అపెక్స్ కమిటీ భేటీ కాదని రేవంత్ స్పష్టం చేశారు. ఈ భేటీలో ప్రధానంగా 4 అంశాలు ప్రస్తావనకు వచ్చినట్టు రేవంత్ తెలిపారు.

1) గోదావరి, కృష్ణా నదుల నీటి వాటాల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకున్న సమస్యలపై ఇంజినీర్లు, అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించారు. కమిటీలోని సభ్యులు నీటి సమస్యలను గుర్తించి వాటిపై చర్చించిన అనంతరం..సీఎంల స్థాయిలో మరోసారి చర్చిస్తామని రేవంత్ చెప్పారు.

2) కృష్ణానదిలో ఏపీ, తెలంగాణ నీటి వాటాల విషయంలో టెలిమెట్రో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

3) శ్రీశైలం ప్రాజెక్ట్ కు కొంత డ్యామేజ్ జరిగింది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కేంద్రం ఏపీకి సూచించగా.. అందుకు వారు అంగీకరించారు.

4) విభజన చట్టం ప్రకారం గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు, కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డులు ఏపీలో ఒకటి, తెలంగాణలో ఒకటి ఉండాలని ఉంది. ఇదే ప్రతిపాదనను ఇప్పుడు అమలు చేయాలని కోరామని సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో అన్నారు.

**ఏపీకి నదులను దారాదత్తం చేసిన కేసీఆర్**

ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణ హక్కులను ఆంధ్రాకు దారాధత్తం చేశారని ఆరోపించారు. వాటిని పరిష్కరించడానికి మేం ప్రయత్నిస్తున్నామని.. సమస్యలను ఎలా పరిష్కరించాలో మాకు తెలుసు.. కానీ బీఆర్ఎస్ నేతలకు వివాదాలు సృష్టించడమే కావాలని రేవంత్ విమర్శించారు. విభజన చట్టంలో చాలా అంశాలను పొందుపరిచినా అవిఅమలు కాలేదు. ఇప్పుడు వాటి గురించి మేం ప్రయత్నాలు చేస్తున్నామని రేవంత్ తెలిపారు.

**జల వివాదాలపై సానుకూల చర్చలు**

ఢిల్లీ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా నెలకొన్న జల వివాదాలపై చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఈ సమావేశం అనంతరం రామానాయుడు



మీడియాతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి పాల్గొన్న ఈ భేటీని ఇరు రాష్ట్రాల సంబంధాల్లో ఒక కీలక ఘట్టంగా అభివర్ణించారు.

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు కొనసాగాయని తెలిపారు. కృష్ణా నది నిర్వహణ బోర్డు అమరావతిలో, గోదావరి నది నిర్వహణ బోర్డు హైదరాబాద్‌లోనే కొనసాగాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు సమర్పించిన ప్రతిపాదనల్లోని సాంకేతిక అంశాలపై కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జల సమస్యల పరిష్కారానికి ఒక శుభ పరిణామంగా భావిస్తున్నామని అన్నారు. ఇరు రాష్ట్రాల రైతులకు, ప్రజలకు లబ్ధి చేకూర్చే ఒప్పందానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. ఇక, బనకచర్ల ప్రాజెక్టుపై సోమవారం లోపు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

**రూ.10 వేల కోట్లను కేటాయించండి**

ఢిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం సాయంత్రం జలశక్తి శాఖతో సమావేశం అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ఆమెతో చర్చించారు. అమరావతి నిర్మాణానికి రెండో విడత నిధులతో సీఎం చంద్రబాబు కీలక విజ్ఞప్తి చేశారు. రెండో విడత నిధులను గ్రాంటుగా విడుదల చేయాలని అభ్యర్థించారు. సాస్కి కింద అదనంగా రూ.10 వేల కోట్లను కేటాయించాలని కోరారు. అలాగే రెవెన్యూ లోటు భర్తీకి 16వ ఆర్థిక సంఘానికి ఇచ్చిన వినతిని అంగీకరించాలని కూడా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం విభజించి పదేళ్లు దాటినా.. ఇప్పటికీ ఆర్థికలోటును ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణానికి సహకరిస్తున్నందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.





# మేమొస్తే మీ పరిస్థితి ఏంటీ?

## చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ ఘాటు రియాక్షన్
## మూడేళ్లలో కూటమి ప్రభుత్వం కూలిపోతుంది
## చంద్రబాబూ..తప్పుడు సంప్రదాయాలకు స్వస్తి పలుకు

మరో మూడేళ్లలో కూటమి ప్రభుత్వం కూలిపోతుందని.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వస్తుందని ప్రజలకు తెలిసిపోయిందని మాజీ సీఎం వైఎస్ జగన్ వెల్లడించారు. అందుకే రాష్ట్రంలో ఏ సమస్య వచ్చిన ప్రజలు తన దగ్గరకు వస్తున్నారన్నారు. ప్రజలు తన వద్దకు తరలివస్తుండడం చూసి చంద్రబాబు తట్టుకోలేక అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని విమర్శించారు. చంద్రబాబు వేసిన తప్పుడు విత్తనం రేపు విషవృక్షంలా అవుతుందని వైఎస్ జగన్ హెచ్చరించారు. నేను చెప్పినా... రేపు మావాళ్ళు వినే పరిస్థితి ఉండదన్నారు. చంద్రబాబు ఇప్పుడైనా మేలుకో...తప్పు తెలుసుకో... తప్పుడు సాంప్రదాయాలు సరిదిద్దుకో...అంటూ మాజీ సీఎం జగన్ మాట్లాడారు.

రాష్ట్రంలో డీఐజీ మాఫియా డాన్.. కూటమి ప్రభుత్వంలో పరిస్థిది ఇలా తయారైందని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. పోలీసులే డబ్బులు వసూలు చేసి ఎమ్మెల్యేలకు ఇస్తున్నారన్నారు. పోలీసులు వసూలు చేసే సొమ్ములో పెదబాబుకు, చినబాబుకు వాటా వెళుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో నీచపనులు చేయలేక ఐపీఎస్ అధికారి సిద్దార్ద్ కౌశల్ వెళ్లిపోయారన్నారు.మా ప్రభుత్వంలో అధికారులు తలెత్తుకుని పని చేసేవారన్నారు. కూటమి ప్రభుత్వంలో డీజీ స్థాయి అధికారులను కూడా వేధిస్తున్నారన్నారు. సీనియర్ పోలీస్ అధికారులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. అనేక మంది సిన్సియర్ అధికారులకు పోస్టింగ్ లు ఇవ్వకుండా తమ కక్ష తీర్చుకుంటున్నారన్నారు. ఏడాది పూర్తయినా వందల మంది పోలీసులు వీఆర్ లో ఉన్నారన్నారు. నలుగురు నాన్ క్యాడర్ ఎస్పీలు, కమాండెంట్ స్థాయి అధికారి ఒకరు, 22మంది అడిషనల్ ఎస్పీలు, 55మంది డీఎస్పీలకు నేటికీ పోస్టింగ్ ఇవ్వలేదన్నారు. మరో ఆరుగురు డీఎస్పీలు, ముగ్గురు అడిషనల్ కమాండెంట్లు, ఇద్దరు అడిషనల్ కమాండెంట్లు ఇంకా హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టింగ్ చేస్తున్నారన్నారు. 8 మంది డీఎస్పీలు సస్పెండ్ అయ్యారన్నారు. 80 నుంచి 100 మంది ఇన్స్పెక్టర్లు, వందల మంది కానిస్టేబుళ్లు వీఆర్ లో ఉన్నారని జగన్ ధ్వజమెత్తారు.

పోలీస్ వేధింపులతో చనిపోయిన ఓ వ్యక్తిని బెట్టింగ్ ల వల్ల చనిపోయారని కేసు పెట్టడాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వంలో మామిడి ధరలు రూ.23 పడిపోవడాన్ని ఆయన విమర్శించారు. మే నెలలో తెరవవలసిన ప్రాసెసింగ్ యూనిట్లను జూన్ నెల మధ్యలో తెరవడం, పంట ఒకేసారి చేతికి రావడం, సప్లై ఎక్కువవడం వంటి మానవతప్పిద కారణాలతో మామిడి రైతులను రోడ్డున పడేశారన్నారు. సీఎం చంద్రబాబుకు సంబంధించిన దళారి వ్యవస్థ, పరిశ్రమలకు మేలు చేయడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు.

**కూటమి ప్రభుత్వం కుతంత్రాలకు బలైన వారిని పరామర్శించడం తప్పా?**

మామిడి రైతుల నిరసనకు సంఘీభావం తెలపాలని ప్రజాప్రతినిధిగా వెళ్లడం తప్పా అని వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు. 2000 మందికి నోటీసులివ్వడం ఎక్కడా చూడలేదన్నారు. పెట్రోల్ బంకులకు కూడా నోటీసులివ్వడం చరిత్రలో జరగలేదన్నారు. ప్రభుత్వ కుట్రలను ఛేదించి ప్రజలు స్వచ్ఛందంగా నిరసలో పాల్గొనడం జరిగిందన్నారు. 5 కేసులు, 20 మంది అరెస్ట్ లు చేసి అడుగడుగునా అడ్డుపడ్డా బంగారుపాళ్యం నిరసనకు జనం వేలాదిగా స్వంతంత్రంగా తరలివచ్చారన్నారు. రాష్ట్రంలో ఉన్న ఒకే ఒక్క ప్రతిపక్షం వైఎస్ఆర్సీపీ అన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా పోరాడే పార్టీ వైసీపీ అన్నారు. ఏపీలో రైతులకు, విద్యార్థులకు, మహిళలకు, నిరుద్యోగులకు, ఉద్యోగస్తులకు ఎవరికి కష్టం వచ్చినా వారి తరపున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు.

**బాలకృష్ణ, పవన్ కల్యాణ్ సినిమాల్లో దారుణమైన డైలాగులు**

సినిమా డైలాగ్స్‌ను పోస్టర్లుగా పెడితే ఇద్దర్ని రిమాండుకు పంపారన్నారు. ఇబ్బందిగా అనిపిస్తే సెన్సార్ బోర్డు ఎందుకు పర్మిషన్ ఇస్తుందని ప్రశ్నించారు. బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ సినిమాల్లో పెద్దపెద్ద దారుణమైన డైలాగులు ఉంటాయన్నారు. కష్టంగా అనిపిస్తే సినిమాలు తీయడం ఆపేయాలన్నారు.

# పవనే దిక్కంటున్న రాయుడు కుటుంబం



**శ్రీకాళహస్తి:**

జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ బహిష్కృత నేత వినూత కోట మాజీ కారు డ్రైవర్ శ్రీనివాసులు (రాయుడు) హత్య అనంతర పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. 2017లో విడుదలైన పవన్ కళ్యాణ్ కాటమరాయుడు సినిమా తర్వాతనే డ్రైవర్ శ్రీనివాసులు రాయుడుగా పేరు మార్చుకుని అదే పేరుతో పాపులర్ అయ్యాడు. అప్పుడు ఆ అబ్బాయి వయసు సుమారు 15 సంవత్సరాలు. పవన్ కళ్యాణ్‌ను ఇలా దేవుడిలా ఆరాధించి అనుసరించే యువత రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల మంది ఉంటారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసం పాలెం రాయుడు స్వగ్రామం. ఆయన సొంత మామ కె.సుబ్రమణ్యం గత పదేళ్లుగా వైఎస్ఆర్సీపీ తరపున గ్రామ సర్పంచ్. అయినా సరే నేను జనసేనాని పవన్ కళ్యాణ్ ఫ్యాన్‌ని అని అందరికీ చెప్పుకుంటూ కాలరెగరేసుకుని తిరిగేవాడు.

2018లో మాజీ జనసేన వీర మహిళ వినుత రాజకీయాల్లోకి వచ్చారు. ఆమె దగ్గర చేరితే పవన్ కళ్యాణ్ ను నేరుగా చూడొచ్చనే ఒకే ఆలోచన ఆశయమై డ్రైవింగ్ రాకపోయినా నేర్చుకుని మరీ ఆమె దగ్గర డ్రైవర్ అయ్యాడు. తాను జనసేన సభ్యత్వం తీసుకోవడమే కాకుండా.. తన స్నేహితులు, సన్నిహితులను కూడా 200మందిని జనసేనలో చేర్పించేంత అభిమానం కాటమరాయుడంటే ఈ రాయుడికి. వినుత దంపుతల కు దగ్గరై వారికి కెమెరామెన్, సోషల్ మీడియా, డ్రైవర్, కుకింగ్ ఇలా ఇంట్లో మనిషిలా కలిసిపోయి అన్ని పనులు చేస్తూ గడిపాడు. జీతం గురించి ఆశించకుండా అంకితభావంతో పని చేశాడు. శ్రీరంగనాథ రేణిగుంట ఐటీఐ కాలేజీలో చదివిన అతనికి బయటికెళ్తే బోలెడు అవకాశాలు కానీ ఆ దిశగా ప్రయత్నం చేయనంత అభిమానం పవన్ కళ్యాణ్ అంటే. అతని ఆశయం నెరవేరేలా మిగతా 2లో..



# మిస్టరీ వీడని విద్యార్థిని వైష్ణవి హత్యా కేసు

## ప్రియుడు లోకేశ్ పాత్ర లేదన్న డీఐజీ కోయ ప్రవీణ్
## వైష్ణవిది హత్యా? పరువు హత్యా?.... అంటూ కొత్త మలుపు తీసుకున్న కేసు...
## కేసు విచారణ నిగ్గు తేల్చే పనిలో పోలీసులు ....

**నాగరాజు, పీటీఎన్ :**

కడప జిల్లా గండికోటలో ఇంటర్ విద్యార్థిని హత్య మిస్టరీ గండికోట రహస్యాన్ని తలిపిస్తోంది. హత్య వెలుగులోకి వచ్చి గంటలు గడచినా మిస్టరీ ఇంకా వీడలేదు. వివరాల్లోకి వెళ్తే... ప్రొద్దుటూరులోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న వైష్ణవి (17) సోమవారం కాలేజీకి వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరి మంగళవారం విగతజీవిగా కనిపిచింది. వైష్ణవి సోమవారం ఉదయం 8గంటలకు తన ప్రియుడు లోకేశ్తో బైక్పై గండికోటకు బయలుదేరింది. వీరు మధ్యలో పాలకోవ సెంటర్ వద్ద ఆగి కోవా తీసుకుని గండికోట టోల్ గేట్కు చేరుకున్నట్లు సీసీ పుటేజీల్లో రికార్డు అయ్యింది. అక్కడ 2 గంటల పాటు తిరిగి 10:47 నిమిషాలకు బైక్పై లోకేశ్ ఒక్కడే బయలుదేరినట్లు సీసీ పుటేజీలో రికార్డయ్యింది.

ఇలోగా వైష్ణవి కాలేజీకి రాలేదని యాజమాన్యం ఫోన్ చేసి చెప్పిందని, తాము కాలేజీకి వెళ్లి ఆరా తీస్తే వైష్ణవి గండికోటకు వెళుతున్నానని తన స్నేహితులకు చెప్పినట్లు తెలిసిందని మృతురాలి సోదరుడు సురేంద్ర పోలీసులకు చెప్పాడు. దీంతో తాము గండికోటకు వెళ్లి గాలించగా.. మంగళవారం ఉదయం తన సోదరి మృతదేహం కనిపించిందని చెప్పాడు. సమమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు లోకేష్ని అదుపులోకి తీసుకుని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని చెప్పారు. కానీ లోకేష్ విచారణ చేపట్టిన తరువాత... విద్యార్థిని మృతదేహం లభ్యమవ్వడం, అక్కడ లభించిన అధారాల అధారంగా పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టారు. ఈ విచారణ మిగతా 2లో..



# జగన్‌కు మంత్రి నాదెండ్ల సవాల్

## మాజీ సీఎం అవగాహన, బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు
## రైతుల కోసం మీరు చేసింది ఏంటో చర్చకు సిద్ధమా
## పర్యటనల పేరుతో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారు
## కూటమి ప్రభుత్వం మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. కానూరు సివిల్ సప్లై భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జగన్ అవగాహన, బాధ్యత లేకుండా మాట్లాడుతూ అబద్ధాల ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. "రైతుల కోసం మీరు ఏం చేశారో చర్చకు సిద్ధమా?" అని ఆయన జగన్‌కు సవాల్ విసిరారు. జగన్ ప్రజల తీర్పును అర్థం చేసుకోవాలని, ప్రజలు ఐదేళ్లకు ఒకసారి అధికారం ఇస్తారని జగన్ మరిచిపోయారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గుంతలు కూడా పూడ్చలేకపోయిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మద్యపాన నిషేధం, అమ్మ ఒడి వంటి హామీలను జగన్ ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు.

జగన్ పాలనలో రైతులకు రూ.1674 కోట్ల ధాన్యం బకాయిలు ఎగ్గొట్టారని, గోదావరి జిల్లాలో క్రాఫ్ హాలిడే ప్రకటించి రైతులకు నరకం చూపించారని మంత్రి ఆరోపించారు. కూటమి మిగతా 2లో..

# జగన్‌కు మంత్రి నాదెండ్ల సవాల్

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రూ.12,857 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసిందని, ఇందులో రూ.12,000 కోట్లు 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. కొంత ఆలస్యంతో రూ.1,000 కోట్లు 40 రోజుల్లో జమ చేశామన్నారు. జగన్ ఈ విషయంలో అవగాహన పెంచుకోవాలని, గూగుల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమాచారం ద్వారా వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. జగన్ బెంగళూరు నుంచి పనిచేస్తూ, నెలకు ఒకసారి రాష్ట్రానికి వచ్చి పర్యటనల పేరుతో అలజడి సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. చిత్తూరు జిల్లా పర్యటనలో రాజకీయ లబ్ధి కోసం సమాజంలో చీలిక తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జగన్ పాలన ప్రజలకు నచ్చకే 11 సీట్లకు పరిమితమయ్యారని, ప్రజలు కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ ఇచ్చారని గుర్తు చేశారు.

పవిత్రమైన పంటను రోడ్డుపై వేసి ట్రాక్టర్లతో తొక్కించడం దారుణమని, అమరావతి, పోలవరం వంటి ఇరిగేషన్ ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం ఎంత చేస్తుందో ప్రజలు చూస్తారని మంత్రి అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కాపాడటం, మంచి పాలన, సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. “అద్భుతమైన పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తోందని, ప్రజలు అధికారం ఇచ్చింది బటన్లు నొక్కడానికి కాదని మంత్రి స్పష్టం చేశారు. దీపం2 పథకం కింద ప్రతి నాలుగు నెలలకు ఒకసారి, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామన్నారు. ఈ పథకాన్ని 2024 అక్టోబర్ 31న దీపావళి రోజున సీఎం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించారు. మొదటి విడతలో 97 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించగా, దీనికి రూ.846 కోట్లు ఖర్చు చేశామన్నారు. రెండో విడతలో 91.10 లక్షల మందికి రూ.712 కోట్లతో గ్యాస్ సిలిండర్లు అందించినట్లు తెలిపారు.

# పవనే దిక్కంటున్న రాయుడు కుటుంబం

**మొదటిపేజీ తరువాయి**

పవన్ కళ్యాణ్ ను మాత్రమే కాకుండా కొణిదెల సోదరులందరిని కలిసిన ఫోటోలు కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

తల్లిని తన తండ్రే పెట్రోల్ పోసి చంపేస్తే, రాయుడు మేనమామ, అమ్మమ్మలే అన్నీ తామై శ్రీనివాసులు సహా తన సోదరి కీర్తిని పెంచి పెద్ద చేశారు. ఆమె భర్త తిరుపతిలో ఓ సాధారణ ఆటో డ్రైవర్. వినుత అక్క అని, తోబుట్టువు కీర్తి తన చెల్లి అని అందరికీ చెప్పుకునేవాడు. రాఖీ పండుగ వచ్చినా ముందు వినుతతోనే రాఖీ కట్టించుకుని తర్వాత కీర్తితో కట్టించుకునేంతటి ఆప్యాయానురాగాలు రాయుడు పెంచుకుంటూ పెరిగాడు. అది మరింత పెరిగి తన చేతిపై జనసేన చిహ్నంతో పాటు వినూత అక్క అని కూడా పచ్చబొట్టుగా పొడిపించుకున్నాడు. చివరికి ఆ పచ్చబొట్టు ఆధారం వల్లే తన శవాన్ని పోలీసులు గుర్తించారు.

టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ తో ఆధిపత్య పోరు వల్ల ఎమ్మెల్యే జనసేన వీరమహిళ వినుతకు స్పైగా శ్రీనివాసులును ఉపయోగించుకుని వారి వ్యక్తిగత వీడియోలను తన ప్రత్యర్థులకు చేరవేశాడనే అనుమానంతో శ్రీనివాసులును చంపినట్లు ఎఫ్ఐఆర్ లో నిందితులు అంగీకరించారు. రాయుడు మరణం గురించి కాసేపు పక్కన పెడితే ..హత్య అనంతరం ఆ కుటుంబానికి జరిగిన అన్యాయంపై పవన్ కళ్యాణే న్యాయం చేయాలని రాయుడు కుటుంబం కోరుతోంది. చనిపోయిన జనసేన కార్యకర్త రాయుడు కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత జనసేన పార్టీపై ఉన్నప్పటికీ కనీస స్పందన ఇంతవరకూ లేదు. రాయుడు కుటుంబాన్ని ఆదుకోవడంపై ఎటువంటి ప్రకటనా జనసేన కార్యాలయం నుంచి రాలేదు. నిజంగా ఆంబోతుల కొట్లాటలో లేగదూడలు నలిగిపోయిన చందంగా రాయుడు ఇలా దుర్మరణం చెందడం విపరీతమైన అభిమానం పెంచుకునే నేటి యువతకు ఓ గుణపాఠం. ఈ మొత్తం వ్యవహారంలో రాయుడు వంటి యువతను ఆందోళన కలిగించే అంశం. దేశంలో ఎక్కడెక్కడో ఏ చిన్న అమానుష, అవాంఛనీయ సంఘటన జరిగినా స్పందించే పవన్ కళ్యాణ్ దీనిపై ఏ ప్రకటన చేయకపోవడానికి కారణాలేంటి? అతని కోసమే అభిమానంతో పని చేసిన యువకుడి కుటుంబాన్ని ఆదుకోవాలని రాయుడు కుటుంబం సహా జనసేన పార్టీ కార్యకర్తలు కూడా కోరుతున్నారు. రాజకీయనాయకులు, రాజకీయ పార్టీలకు భిన్నం అనేలా చనిపోయిన రాయుడు చెల్లి కీర్తి కోరిన విధంగా స్పందించి సాయం చేయాల్సిన బాధ్యతను నెరవేరుస్తారా? మౌనం పాటిస్తారా?

# మిస్టరీ వీడని విద్యార్థిని వైష్ణవి హత్య కేసు



**మొదటిపేజీ తరువాయి**

అనంతరం హత్యపై పలు రకాల కొత్త కోణాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తుంది.

**విద్యార్థిని హత్యలో ప్రియుడు లోకేశ్ పాత్ర లేదన్న డీఐజీ కోయ ప్రవీణ్ :**

కడప జిల్లా జమ్మలమడుగు మండలం గండికోటలో విద్యార్థిని హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోండగా బుధవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి డిఐజీ కోయ ప్రవీణ్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. విద్యార్థిని హత్యలో ప్రియుడు లోకేశ్ పాత్ర లేదని డీఐజీ కోయ ప్రవీణ్ చెప్పడం సంచలనంగా మారింది. “అమ్మాయిపై ఎలాంటి లైంగిక దాడి జరగలేదని, విద్యార్థిని హత్య కేసుకు సంబంధించి బుధవారం ఉదయం కొన్ని కచ్చితమైన ఆధారాలు లభించాయని చెప్పారు. వాటి గురించి ఇప్పుడే చెప్పలేమని, ఇవాళ రాత్రిలోపు జిల్లా ఎస్పీ కేసును ఛేదిస్తారని డీఐజీ ప్రవీణ్ చెప్పారు.

**హత్యా? పరువు హత్యా.?**

రెండవ రోజు పోలీసు విచారణ అనంతరం కేసు కొత్త మలుపు తిరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోమవారం ఉదయం 10:28 నిమిషాల వరకు వైష్ణవి, లోకేశ్ కలిసే ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే సోమవారం ఉదయమే వైష్ణవిని హత్య చేసి ఉంటే శరీరం డీకంపోజ్ అయ్యేదని, మృతదేహం చూస్తే రాత్రి చంపినట్లు ఉందని పోలీసులు గుర్తించారు. నిర్జన ప్రాంతంలో బాలిక బంధువులు మృతదేహం ఉందని గుర్తించడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీంతో నిజంగా ఇది హత్యా లేక పరువు హత్యా అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో హత్యా? పరువు హత్యా? అనేది మరికొన్ని గంటల్లో వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి.

**ఆడపిల్ల ఎవరికైనా ఆడపిల్లే...లోకేశ్ తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్ష వేసినా సమ్మతమే : వైష్ణవి హత్య.. అనుమానితుడి తల్లి దస్తగిరమ్మ..... :**

గండికోటలో ఇంటర్ విద్యార్థిని వైష్ణవి హత్యకు గురైన విషయం తెలిసిందే. అనుమానితుడు లోకేశ్ తల్లి దస్తగిరమ్మ మీడియాతో మాట్లాడారు. తన కొడుకు ఆమెను ప్రేమించిన విషయం తమకు తెలియదన్నారు. విషయం తెలిసి పాప తరఫువాళ్లు తమ పిల్లాడిని కొట్టారని తెలియగా తాము కూడా మందలించామన్నారు. లోకేశ్ గండికోటకు వెళ్లిన విషయం తెలియదని, ఆడపిల్ల ఎవరికైనా ఆడపిల్లేనని లోకేశ్ తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్ష వేసినా తాము సమ్మతిస్తామన్నారు.

**మా అమ్మాయిని మేమే చంపుకుంటామా?' విద్యార్థిని వైష్ణవి తల్లి :**

గండికోటలో ఇంటర్ విద్యార్థిని అన్ననే హత్య చేశారనే వస్తున్న వార్తలపై ఆమె తల్లి స్పందించారు. తన కొడుకు సురేంద్ర చంపాడని జరుగుతున్న ప్రచారాలు అవాస్తవమని ఆమె ఖండించారు. 'కాలేజీకి రాలేదు గండికోటకు వెళ్లిందని స్నేహితులు చెప్పడంతో బాలికను పిలుచుకొని వచ్చేందుకు సురేంద్ర అక్కడికి వెళ్లాడు. అన్న ఎక్కడైనా చెల్లెలిని చంపుతాడా. లోకేశే మా అమ్మాయిని చంపాడు. వాడిని ఎన్‌కౌంటర్ చేయాలి' అని తెలిపారు.

# మళ్లీ తెరపైకి పర్మిట్ రూములు!

- ఆదాయ మార్గాల కోసం.. అబ్కారీ శాఖ వెతుకులాట.
- మందుబాబులకు మంచి రోజులు.. పోలీస్ శాఖకు గడ్డు రోజులు.



**తూర్పుగోదావరి జిల్లా:**

ఆదాయ మార్గాల కోసం ఆబ్కారీ శాఖ వెతుకులాట మొదలుపెట్టింది. దీనిలో భాగంగా మద్యం షాపులు వద్ద పర్మిట్ రూములకు అనుమతించాలని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు విశ్వసనీయ సమాచారం. గతేడాది మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తులను పిలవగా వాటి నుంచి 28. 849 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది అయితే వచ్చే సంవత్సరం వరకు ప్రస్తుతం ఉన్న మద్యం షాపులకు అనుమతి ఉన్నందున ఆ ఏడాది దరఖాస్తులు ఫీజు ప్రభుత్వానికి వచ్చే అవకాశం లేదు దీంతో ఆ శాఖ ఆదాయం మార్గాల కోసం కోసం వెతుకులాట మొదలుపెట్టింది దీనిలో భాగంగా వచ్చే సెప్టెంబర్ నుంచి మద్యం షాపుల వద్ద పర్మిట్ రూములు అనుమతిస్తే కొంత ఆదాయం ఉంటుందని ఎక్సైజ్ శాఖ తమ నివేదికలో పేర్కొంది 2014 సమయంలో కూడా మద్యం షాపుల వద్ద పర్మిట్ రూములకు అనుమతి ఉండేది మున్సిపల్ స్థాయిలో ఐదు లక్షలు కార్పొరేషన్ స్థాయిలో 7.5 లక్షలు వసూలు చేసేవారు. అయితే ఈసారి మద్యం పాలసీలో పర్మిట్ రూములు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ క్యాబినెట్ సబ్ కమిటీ దీనికి ఒప్పుకోలేదు ఎందుకంటే ఇప్పటికే దరఖాస్తులు ఫీజు ద్వారా ఆదాయం సమకూరింది కాబట్టి, అనుమతి ఇవ్వలేమని ఫైల్ను వెనక్కిపంపింది అయితే ఈసారి దరఖాస్తు ఫీజులు వచ్చే అవకాశాలు లేనందువల్ల పర్మిట్ రూములకు అనుమతిచ్చే అవకాశం మెండుగా ఉంది. ఇదిలా ఉండగా జిల్లాలో ఇప్పటికే మద్యం షాపుల వద్ద అనధికారకంగా పర్మిట్ రూములు నడుస్తున్నాయి. కొవ్వూరు లో ఉన్న మూడు మద్యం షాపులో వెనకాల భారీ షెడ్లను ఏర్పాటు చేసి మందుబాబులకు అవకాశం కల్పిస్తున్నారు. ఇక అధికారికంగా పర్మిట్ రూములకు అనుమతిస్తే మందుబాబులకు గుడ్ న్యూస్ రాను పోలీస్ శాఖకు గడ్డు రోజులుగాను మారే అవకాశం కనిపిస్తోంది అదెలగంటారా ఇప్పటికే అనధికార పర్మిట్ రూముల వద్ద మందుబాబులు ఘర్షణకు దిగి లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తున్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో పోలీసు సైరన్ వింటేనే పారిపోయే మందుబాబులు ఈసారి ఈ అనధికార పర్మిట్ రూముల్లో మందులో జోగుతూ అది కాస్త ఎక్కువైతే తమలో తాము గొడవలు పడుతూ ఎదుటి వారితో కూడా ఘర్షణకు దిగుతూ నాన్న బీభత్సం సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారికంగా పర్మిట్ రూములకు అనుమతి లభిస్తే పోలీస్ శాఖకు ఈ విషయం కత్తి మీద సాములా తయారయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే చర్యలు తీసుకుందాం అంటే అదికాస్తా అనుమతి రూములాయే.. మరోవైపు దుకాణ యజమానులు మేము ప్రభుత్వానికి సొమ్ములు చెల్లిస్తున్నాం.. మీకేంటి బాధ.. అని చెప్పే అవకాశం ఉంది. మద్యం షాపుల్లో అధిక భాగం అధికార పార్టీకి చెందిన వారే ఉండటం పోలీసులకు మరింత తలనొప్పిగా మారింది. దీంతో వారి పరిస్థితి కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్న చందాన తయారయ్యే పరిస్థితులు కానవస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజులు పోలీస్ శాఖ కు తలనొప్పిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మంగళగిరి నియోజకర్గ అభివృద్ధిపై మంత్రి లోకేశ్ సమీక్ష



మంగళగిరి నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న మరో 2వేల మందికి ఆగస్టు నెలలో శాశ్వత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రి ఈ రోజు ఉండవల్లి నివాసంలో అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... గతంలో 3వేల మందికి సుమారు వెయ్యి కోట్ల విలువైన ఇళ్ల పట్టాలు అందజేశామని, ఆగస్టులో మరో 2వేల పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదల కోసం కొత్తగా టిడ్కో గృహ సముదాయాల స్థలసేకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంగళగిరిలోని ప్రస్తుత టిడ్కో సముదాయం వద్ద పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంటీఎంసీ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సమీకృత అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో సీఎస్ఆర్, ప్రభుత్వ నిధులతో నిర్మించ తలపెట్టిన 31 కమ్యూనిటీ హాళ్లు, 26 పార్కులు, శ్మశానాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద నివారణకు మహానాడు కాలనీ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులతో పాటే సమాంతరంగా సుందరమైన పార్కును కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. మంగళగిరి శివాలయం పక్కన అధునాతన సౌకర్యాలతో నిర్మించిన మోడల్ లైబ్రరీ పనులు తుదిదశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నిడమర్రు మోడల్ పునర్నిర్మాణ పనులను సెప్టెంబర్ లోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ బృహత్ ప్రణాళిక వేగవంతంగా పూర్తిచేసి త్వరలో పనులు ప్రారంభించాలని సూచించారు.

మంగళగిరిలో స్మార్ట్ స్ట్రీట్ బజార్, నిడమర్రు రోడ్డులో 350 షాపులతో అధునాతన కూరగాయలు, పూలు, పండ్ల మార్కెట్, పోలకంపాడు వద్ద రూ.2కోట్లతో చేపల మార్కెట్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి కూడా సందర్శకులు వస్తున్నందున మంగళగిరి ఎకో పార్కును ఎడ్వంచర్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో గుంతలు లేని రోడ్ల అభివృద్ధి, ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్, నూరు శాతం వీధిలైట్లపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు, నియోజకవర్గ పరిధిలో చెరువుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి లోకేశ్ చర్చించారు. ఈ సమావేశంలో మంగళగిరితాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హలీమ్ బాషా, ఎండోమెంట్స్ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎంటీఎంసీ ఎస్ఈ శ్రీనివాస రావు, డిప్యూటీ సిటీ ప్లానర్ అశోక్, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞాతంలో మిథున్ రెడ్డి



మద్యం కుంభకోణం కేసులో ఏ4 నిందితుడుగా ఉన్న, వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై సిట్ అధికారులు మంగళవారం సాయంత్రం లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో, విదేశాలకు వెళ్లకుండా అడ్డుకునేందుకు ఈ ఎల్‌వోసీ ఇచ్చారు. అయితే తన పిటిషన్‌ను కొట్టేసే అవకాశముందని ముందే గ్రహించిన మిథున్‌రెడ్డి ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నారో తెలుసుకునేందుకు సిట్ అన్ని వైపుల నుంచీ నిఘా పెట్టింది. ఈ కుంభకోణంలో తన ప్రమేయం, పేరు సిట్ దర్యాప్తులో బయటపడిందని తెలియగానే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం మార్చి నెలలో ఏపీ హైకోర్టుకు వెళ్లారు. అప్పటికి ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చలేదు. దీంతో న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టేసింది. తనను అరెస్టు చేస్తారేమోననే భయంతో మిథున్‌రెడ్డి అప్పట్లో కొన్నాళ్ల పాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన న్యాయవాదులతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టులో విచారణ కొనసాగినంత కాలం అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వటంతో అజ్ఞాతం వీడి బయటకొచ్చారు. ఇప్పుడు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మిథున్‌రెడ్డి ముందుస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో, ఆయన్ను సిట్ అధికారులు వెంటనే అరెస్టు చేస్తారా? లేదా సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లి అక్కడ ఏదో తేలేంత వరకూ వేచిచూస్తారా? అనే దానిపై ఆసక్తి నెలకొంది. అయితే సిట్ అధికారులు మాత్రం గత కొన్నాళ్లుగా మిథున్‌రెడ్డి కదలికలపై నిఘా పెట్టారు. దీంతో ఆయన ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఆయన ఎక్కడ దాక్కున్నారో తెలుసుకునేందుకు బృందాల్ని ఏర్పాటు చేశారు.

# టాలీవుడ్‌లో విషాదం.. రవితేజ తండ్రి కన్నుమూత



టాలీవుడ్ లో రెండు రోజుల క్రితం విలక్షణ నటుడు కోటాశ్రీనివాసరావు మరణం వార్త మర్చిపోకముందే మరో విషాదకర సంఘటన జరిగింది. హీరో రవితేజ తండ్రి రాజగోపాల్ రాజు కన్నుమూశారు. కొంత కాలంగా వయోభారం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న రాజగోపాల్ రాజు హైదరాబాద్ లోని రవితేజ నివాసంలో మరణించారు. రాజగోపాల్ రాజుకు ముగ్గురు కుమారులు. హీరో రవితేజ పెద్ద కుమారుడు. రెండో కుమారుడు భరత్. ఆయన 2017లో కారు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మరో కుమారుడు రఘు నటుడిగా పలు సినిమాల్లో కనిపించారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటలో జన్మించిన రాజగోపాల్ రాజు ఫార్మాసిస్ట్‌గా పనిచేసేవారు. ఉద్యోగరీత్యా ఉత్తర భారతదేశంలోనే ఎక్కువకాలం పనిచేశారు. టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు రాకముందు రవితేజ కూడా జైపూర్, ఢిల్లీ, ముంబయిల్లో ఉన్నారు. రవితేజ తండ్రి మరణంపై టాలీవుడ్ లోని పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

రవితేజ తండ్రి రాజగోపాల్ రాజు మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. రవితేజ తండ్రి రాజగోపాల్ రాజు గారు కన్నుమూశారని తెలిసి చింతించానన్నారు. రాజగోపాల్ రాజు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. రవితేజ గారికి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను" అంటూ సంతాప సందేశం వెలువరించారు.

# జనసేనలో కొలిక్కి రాని చర్చలు

- సొసైటీ అభ్యర్థుల కోసం
- కొనసాగుతున్న వెతుకులాట..
- వైసిపిపార్టీ కి చెందినవారితో రాయబారాలు, బేరసారాలు..
- పాలంగిలో వీడని ముడి.. ముడుపులతో బేరసారాలు..



**త్రినాథ రావు ఉండ్రాజవరం:**

ఉండ్రాజవరం మండలంలో జనసేనకు కేటాయించిన మూడు సొసైటీ అధ్యక్ష పదవుల్లో పాలంగి సొసైటీ ఎవరికీ ఇవ్వాలనే దానిపై రోజుల తరబడి చర్చలు జరుగుతున్న ఎవరు అభ్యర్థి అనేది సస్పెన్స్‌గానే ఉంది. మండలంలో మొత్తం పది సొసైటీలు ఉన్నాయి. జనసేన కు 3,టిడిపి కి 7 సొసైటీలు కూటమి నేతృత్వంలో పంపకాలు జరిగాయి. తాడిపర్రు, పాలంగి, సత్యవాడ సొసైటీలు జనసేనకు, ఉండ్రాజవరం, వేలివెన్ను, కాల్దారి, వడ్లూరు, సూర్యారావుపాలెం, మోర్త, చివటం టిడిపికి కేటాయించారు. ఐదు సొసైటీల కోసం జనసైనికులు తీవ్రంగా ప్రయత్నం చేశారు. చివరకు మూడు సొసైటీ లు దక్కించుకున్నారు. ఐదు సొసైటీ లు కావాలని పోరాడారు కానీ సరైన అభ్యర్థులు లేరనే విషయాన్ని విస్మరించారనే చెప్పాలి.

టిడిపి కంచుకోటగా ఉన్న ఓ గ్రామంలో సొసైటీ ఎలాగైనా దక్కించుకోవాలని జనసేన మండలపరిషత్ సభ్యుడొకరు చేసిన ప్రయత్నం విఫలమయ్యింది. గతంలో వైసిపి కి చెందిన సామాజిక వర్గానికి చెందిన నేతను జనసేన లోకి తెచ్చి అధ్యక్షుణ్ణి చెయ్యాలని చేసిన ఆరాటపోరాటాలు అతను నో చెప్పడంతో జనసేన టీసీ ప్రయత్నాలు బెడిసి కొట్టయ్. మొత్తం నా కనుసన్నలోనే జరుగుతాయి, నేను చెప్పినవారికే అధ్యక్ష పదవి వస్తుందని ముందునుండి చేస్తున్న ప్రచారం బెడిసి కొట్టడంతో ఎలాగైనా పట్టు నిలుపుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు పార్టీ ప్రతిష్ట కు మచ్చగా మారే పరిస్థితి ముందు ముందు చూడాల్సి వస్తుందేమో. పాలంగి సొసైటీ అధ్యక్ష పదవి నేను చెప్పిన వారికే ఇవ్వాలని జనసేన టీసీ పెద్ద యుద్ధమే చేస్తున్నాడు. అందుకు అమాత్యుల మిత్రుడుగా పేరొంది అధికారం చెలాయిస్తున్న నేతతో, అమాత్యుల వ్యక్తి గత సహాయకుడిగా ఉన్న వారి సమీప బంధువు ద్వారా తీవ్రంగా లాభియింగ్ చేస్తున్నట్లు సమాచారం. గతంలో వైసిపి విజయం కోసం కృషి చేసి, ప్రస్తుతం ఎలాగైనా సొసైటీ అధ్యక్ష పదవి పొందాలని ప్రయత్నం చేస్తున్న వ్యక్తికోసం టీసీ చెయ్యని ప్రయత్నం లేదు, పోరాడని ప్రదేశం లేదు. బుధవారం నాటికీ 10 సొసైటీ అధ్యక్ష పదవుల్లో 9 మంది అధ్యక్షులు, కమిటీలు కారరైనా పాలంగి జనసేన అభ్యర్థి ఎవరినేది తెలలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే పాలంగి సొసైటీ అధ్యక్ష పదవి కోసం భారీగా ముడుపులు సమర్పణ జరుగుతుందనే ప్రచారం సావరం గ్రామంలో వీధి వీధి కోడై కూస్తోంది.

# ఆత్మకూరులో మెగా జాబ్ మేళా




**నెల్లూరు:**

మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువత బంగారు భవిష్యత్తు కోసం మెగా జాబ్ మేళాను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం మర్రిపాడు మండలంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తో కలిసి సుమారు 5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపకులు చేశారు.తొలుత మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నారై కొర్రపాటి ప్రియా దంపతుల సహకారంతో ఏర్పాటుచేసిన శంకర్ నేత్రాలయ వారి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని , మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ బస్సులను మంత్రి ఆనం, ఎమ్మెల్యే సురేష్ ప్రారంభించారు. పది రోజులపాటు నిర్వహించనున్న ఈ వైద్య శిబిరాన్ని స్థానిక గ్రామాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని మంచి కంటి చూపును పొందాలని సూచించారు. అనంతరం మర్రిపాడు గ్రామంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తో కలిసి ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ కోసం 95 లక్షలతో జల్జీవన్ మిషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. 8 సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మర్రిపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 2.54 కోట్లతో అదనపు తరగతి గదులు, మౌలిక వసతుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మర్రిపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, కోల్డ్ స్టోరేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి ఆలోచనల మేరకు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2 తేదీల్లో ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో మెగా జాబ్ మేళాకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఇప్పటికే సుమారు 30 జాతీయ స్థాయి కంపెనీలు జాబ్ మేళాకు హాజరయ్యేందుకు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మరో 20 కంపెనీలు కూడా పాల్గొంటాయని మంత్రి స్పష్టం చేశారు.స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వెబ్సైట్లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా నిరుద్యోగ యువత తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి సూచించారు. జాబ్ మేళాలో అభ్యర్థుల అర్హతల మేరకు తక్షణమే సుమారు 1400 వరకు ఉద్యోగాలను ఇచ్చేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చదివిన యువత అందరూ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం జాబ్ మేళా రిజిస్ట్రేషన్లకు సంబంధించి క్యూఆర్ కోడ్ ను మంత్రి ఆవిష్కరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ మేరకు విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసేందుకు చర్యలు వేగవంతమైనట్లు మంత్రి తెలిపారు. ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల భవనాల ఏర్పాటుకు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ఆర్డీఓ ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆరు కోర్సుల్లో ఒక్కొక్క కోర్స్ కు 60 మంది చొప్పున మొత్తం 300 మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు మంజూరైనట్లు చెప్పారు. కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్, ఈసీఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ మరియు డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొదలైన కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. నెల్లూరులోని విఆర్ఐపీఎస్ లో తాత్కాలికంగా తరగతులు మొదలు పెట్టేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. యువతీ యువకులకు వేరువేరుగా హాస్టల్ సౌకర్యాలు కూడా కల్పిస్తామన్నారు. అన్ని అనుమతులు పూర్తయితే ఈ ఏడాది నుంచి ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభమయ్యే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. సోమశిల జలాలను మెట్ట ప్రాంతమైన మర్రిపాడు మండలానికి తీసుకొచ్చి రైతుల కళ్ళల్లో ఆనందం నింపడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నామని మంత్రి ఆనం చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తాను మంత్రిగా పనిచేస్తున్నప్పుడు 1800 కోట్లతో సోమశిల నీటిని మర్రిపాడు తీసుకొచ్చేందుకు కృషి చేశామని, అనంతరం వచ్చిన పాలకులు ఈ పనులను విస్మరించినట్లు చెప్పారు. మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. నాయుడు పల్లి, పొంగూరు రిజర్వాయర్లను మొదట పూర్తి చేసి సోమశిల జలాశయం నుంచి ఐదు టీఎంసీల నీటిని మర్రిపాడుకు అందించేందుకు పనులు మొదలు పెడుతున్నట్లు చెప్పారు. రెండేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేసి మర్రిపాడు మండలంలో ఒక లక్ష కుటుంబాలకు తాగునీరు, 80వేల ఎకరాలకు సాగునీరు అందించి మర్రిపాడు మండలాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రధాన లక్ష్యంగా తామంతా పనిచేస్తున్నట్లు చెప్పారు.



## జగన్‌కి దిక్కుతోచక ఏదేదో మాట్లాడుతున్నారు

కాకినాడ: మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు మంత్రి నారాయణ. కాకినాడ జిల్లా కలెక్టరేట్ లో ఇన్చార్జి మంత్రి నారాయణ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ షన్మోహన్, ఇతర అధికారులు హాజరయ్యారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లు ఇవ్వకుండానే లబ్ధిదారుల పేరుమీద బ్యాంక్ లోన్లు తీసుకుంది.. డిసెంబర్ లోగా 365,430చ.అ ల విస్తీర్ణంలో ఇళ్లు పూర్తి చేయాలని సీఎం చెప్పారన్నారు. పరిపాలన చేయడం చేతకాని జగన్.. 10 లక్షల కోట్లు అప్పు చేసి వెళ్ళిపోయారన్నారు. ఇప్పుడు దిక్కుతోచక ఏదేదో మాట్లాడుతున్నాడని మండిపడ్డారు మంత్రి నారాయణ. జిల్లాలోని కొన్ని సమస్యలపై DRC సమావేశంలో చర్చించామన్నారు మంత్రి నారాయణ. గత ప్రభుత్వం పేదల ఇళ్ల విషయంలో అనేక అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. గత ప్రభుత్వం దొంగ పట్టాలు ఇచ్చిందని ప్రజా ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చానట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యం అన్నారు.

మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో పర్యటించారు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నారాయణ. పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన సంక్షేమం,అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు మంత్రి. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని తెలిపారు. కూటమి పాలనలో అరెస్టులు, దాడులు లేకుండా రాష్ట్రం ప్రశాంతంగా ఉందని ప్రజలంతా చెబుతున్నారని తెలిపారు.





## మడకశిర మున్సిపాలిటీ
# టీడీపీ కైవసం

**మడకశిర :**

మడకశిర నగరపాలక పంచాయతీ(మున్సిపాలిటీ)ని తెలుగుదేశంపార్టీ కైవసం చేసుకుంది. గతంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న మడకశిర మున్సిపాలిటీ కూటమి పాలనలో ప్రభుత్వానికి అనుకూలంగా మారింది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైన వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. తద్వారా మడకశిర మున్సిపాలిటీలో టీడీపీ ఆధిపత్యం పెరగడంతో నేడు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ప్రక్రియను ఎన్నికల రిటర్నింగు అధికారి నిర్వహించారు. బలప్రదర్శనలో టీడీపీకి అత్యధిక మెజార్టీ ఉండడంతో మున్సిపల్ చైర్మన్ గా నరసింహరాజును, వైస్ చైర్మన్ గా ప్రభావతిలను కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లకు నియామక పత్రాలను ఎన్నికల అధికారి అందించారు. నూతనంగా ఎన్నికైన మడకశిర మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు గారు ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నికల అధికారి చేతులు మీదుగా చైర్మన్, వైస్ చైర్మన్లకు ఎమ్మెల్యే నియామక పత్రాలను అందించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు గారికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గారికి, కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేదరికంలేని సమాజమే ప్రభుత్వం లక్ష్యం

**ఏలూరు:**

సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికంలేని సమాజాన్ని రూపొందించాలన్నదే పీ4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ4 కార్యక్రమం ఉద్దేశ్యాలను తెలియజేసి, అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సమాజంలో 10 శాతంగా ఉన్న ధనవంతులు, అట్టడుగు స్థాయిలో ఉన్న 20 మంది నిరుపేదల జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు చేయూత నివ్వడమే పీ4 లక్ష్యమన్నారు. పేదలకు సేవచేద్దామని, వారి జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు సంకల్పించి సదుద్దేశ్యంతో ఉన్న ధనవంతులకు పీ4 కార్యక్రమం ఒక మంచి వేదికన్నారు. జిల్లాలో ఇంతవరకు 95 వేల మంది బంగారు కుటుంబాలను గుర్తించామని, వారిలో ఇంతవరకు 5181 కుటుంబాలకు మార్గదర్శకులు అండగా నిలబడ్డారన్నారు. పీ4 కార్యక్రమంపై మార్గదర్శకులపై ఎటువంటి ఒత్తిడి లేదని, వారికి వారు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. మార్గదర్శకులు నిధులు ఇవ్వడమే కాక పీ4 స్ఫూర్తిని అర్థం చేసుకుని బంగారుకుటుంబాలకు వారు అందించే సాయం ఏ విధంగా ఉపయోగపడుతుంది, వాటి ద్వారా ఆ కుటుంబాలు ఏ విధంగా ఆర్థికాభివృద్ధి సాదిస్తున్నాయనే తెలుసుకునేందుకు సమయాన్ని కూడా వెచ్చించాలని విజ్ఞప్తి చేశారు. బంగారు కుటుంబాలలో సమస్యలు తెలుసుకుని, ఆయా కుటుంబాలలోని పిల్లలకు విద్య, వారి జీవనోపాధికి అవసరమైన , ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆ కుటుంబం అభివృద్ధి వైపు అడుగులు వేసేలా మార్గదర్శి చేయూత అందిస్తారన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై మంచి విజన్ కలిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో రూపొందించిన విజన్2020 ఫలాలను ఇప్పుడు మనం ప్రత్యక్షంగా చూస్తున్నామని, అదేవిధంగా స్వర్ణాంధ్రప్రదేశ్ @ 2047 సాధనకై విజన్ యాక్షన్ ప్లాన్ ను సమర్ధవంతంగా అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా మొదటి స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. పీ4 కార్యక్రమంలో మార్గదర్సకులు అందించే నిధులు, వాటి వినియోగం, బంగారుకుటుంబాలు అభివృద్ధి, తదితర అంశాలను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, వివరాలను పీ4 వెబ్సైటు లోపొందుపరచడం జరుగుతుందన్నారు. జిల్లాలో మరింతమంది మార్గదర్శులను గుర్తించి పీ4 కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసి జిల్లాలో పేదరికాన్ని రూపుమాపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.



జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సమాజంలో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన పీ4 కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. నిరుపేద కుటుంబాలలో ఆర్థిక కారణాలతో పిల్లలు విద్యకు దూరమవుతున్నారని, మార్గదర్శకులుగా వచ్చేందుకు ప్రవాసాంధ్రులు ఎందరో ఉన్నారని, వారికి పీ4 స్ఫూర్తిని అధికారులు తెలియజేసి, పీ4 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సేవా దృక్పధంతో ఉన్న ధనవంతులకు పేదల జీవితాలను మార్చి, బంగారుమయం చేయాలనే సేవా దృక్పధం కలిగిన ధనవంతులకు పీ4 కార్యక్రమం పెద్ద అవకాశమన్నారు. సమాజంలో ఆర్థిక అంతరాలు తొలగించేందుకు పీ4 కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. తానూ 10 లక్షల రూపాయల విలువ చేసే 100 గొర్రెలను పేద కుటుంబాలకు అందించి వాటి ద్వారా కొంతకాలంలో మరిన్ని గొర్రెలు ఉత్పత్తి ఐన తరువాత తనకు తిరిగి ఇచ్చే పద్ధతిన అందించనున్నారు. అదేవిధంగా తన నియోజకవర్గంలో పాముకాటు, ప్రమాదాల కారణంగా పాడి పశువులను కోల్పోయిన పాడిరైతులకు వారు కోలుకునే వరకు తన పాడి పశువులను అందిస్తున్నానన్నారు.

# పొగాకు, కోకో, మామిడి రైతులకు ప్రభుత్వం అండ

**అద్దంకి :**

పొగాకు రైతులకు బాసటగా నిలిచేందుకు అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కలిసి బుధవారం ప్రారంభించారు. రైతులు తీసుకొచ్చిన నల్లబర్లీ పొగాకును ఇరువురు మంత్రులు పరిశీలించారు. అనంతరం సంతమాగులూరు నూతన మార్కెటింగ్ యార్డు కమిటీ ఛైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... కమిటీ సభ్యులు పదవులను అలంకరణగా భావించకుండా.. బాధ్యతగా తీసుకొని ప్రజల కోసం పని చేయాలని కోరారు. రాష్ట్రంలో ఈ ఏడాది పొగాకు, కోకో, మామిడి అధిక దిగుబడి వచ్చాయి. దీంతో రైతులకు మార్కెట్ లో సరైన ధర దక్కలేదు. రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పొగాకు కొనుగోలు కోసం ప్రభుత్వం రూ. 270 కోట్లు కేటాయించింది. దేశ చరిత్రలో పొగాకు కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టడం ఇదే తొలిసారి. మామిడికి కిలోకు రూ. 4 ఇచ్చి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంది.” అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఒక్క సంతకంతో రూ. 3వేల పెన్షన్ ను రూ.4 వేలకు పెంచడంతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కేవలం పెన్షన్ల కోసమే రూ.33,000 కోట్లు వెచ్చిస్తోందని స్పష్టం చేశారు. దీపం పథకంతో ఉచిత గ్యాస్ అందించడంతో పాటు ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్నికూడా కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. తల్లికి వందనంలో భాగంగా రూ.15,000 తల్లుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అచ్చెన్నాయుడుతో కలిపి వైసీపీ ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేశామని మంత్రి గొట్టిపాటి గుర్తుచేశారు. 18 మంది టీడీపీ ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రజల పక్షాన 154 మందితో ఐదేళ్లూ పోరాడామన్నారు. 70 శాతం పూర్తయిన పోలవరాన్ని జగన్ ఐదేళ్లు పట్టించుకోలేదని తెలిపారు. దీంతో పోలవరం వ్యయం నేడు రెట్టింపు అయ్యిందని విమర్శించారు. వెయ్యి మెగావాట్ల పోలవరం విద్యుత్ కేంద్రాన్ని నిర్లక్ష్యం చేసి నాశనం చేసినట్లు విమర్శించారు. జగన్ రెడ్డి మాటలు విని వైసీపీ కార్యకర్తలు బెట్టింగ్గుల్లో ప్రాణాలు తీసుకున్నారని అన్నారు. వారి పరామర్శ కోసం జగన్ రెడ్డి రోడ్డు మీదకు వస్తున్నాడని ఎద్దేవా చేశారు. సొంత కారు కింద పల్నాడు ప్రాంత కార్యకర్త పడినా... పక్కన పడేసి వెళ్లిపోవడం, ప్రజల పట్ల జగన్మోహన్ రెడ్డి బాధ్యతను తెలియజేస్తుందని చెప్పారు. ఎవరు సీఎంగా ఉంటే అందరికీ మంచి జరుగుతుందో ప్రజలకు తెలుసని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అద్దంకి నియోజకవర్గంలో సుమారు రూ.3 కోట్లకు పైగా వెచ్చించి కాలువలకు మరమత్తులు చేపట్టామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అద్దంకి పరిధిలో రైతులు ఎక్కువగా ఎన్ఎస్పీ కెనాల్ పైనే ఆధారపడి ఉన్నారని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో పూడికను కూడా తీయలేదన్న గొట్టిపాటి... కూటమి ఏడాది పాలనలోనే అద్దంకి నియోజకవర్గంలో మైనర్లతో మేజర్లకూ మరమత్తులు చేసి వ్యవసాయ సీజన్ లో రైతులకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు.



జగన్మోహన్ రెడ్డి రాజకీయాలకు అనర్హుడని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. సంతమాగులూరు పొగాకు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ హయాంలో తనను, చంద్రబాబు నాయుడుని కక్ష కట్టి మానసికంగా హింసించి జైలుపాలు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం తయారు చేసింది, అమ్మింది కూడా జగనే అన్నారు. మద్యం కుంభకోణం ద్వారా రూ.32 వేల కోట్లు దోచుకున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. అధిక దిగుబడి పంటల విషయంలో అన్నదాతలు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. పొగాకు అధిక దిగుబడి, బర్లీ పొగాకు విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన దృష్టికి తీసుకు రాగానే సీఎం చంద్రబాబుకు చెప్పానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే పొగాకు కొనుగోళ్లకు రూ.270 కోట్లు విడుదల చేశారన్నారు. అదే విధంగా కోకో పంటకు అదనంగా రూ.50, మామిడి పంటకు అదనంగా రూ.4 ఇచ్చి రైతులకు ఇబ్బంది లేకుండా వారిని ఆదుకుని.. పంట కొనుగోలుకు ఉన్న ఇబ్బందులను తొలగించామన్నారు. అదే విధంగా మంత్రి గొట్టిపాటి తన దృష్టికి తీసుకువచ్చిన గోడౌన్లు, మిర్చి యార్డ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో పాటు ఏఎంసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

# అభివృద్ధికి దుష్టశక్తిలా జగన్ అడ్డుపడుతున్నారు

మంగళగిరి: మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పై విరమ్మలు చేశారు టీటీడీ నేతలు. జగన్ ప్రెస్‌మీట్ చూస్తుంటే పాత సినిమాలో రాజనాల క్యారెక్టర్ గుర్తుకువస్తుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో హత్యలు, దౌర్జన్యాలు చేసి నేడు ఏంచేయనట్లు జగన్ ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు నక్కా ఆనందబాబు. జగన్‌కి ప్రజలు దిమ్మతిరిగే షాక్ ఇచ్చినా ఆయనలో రియలైజ్ రాలేదన్నారు. 11 సీట్లకే పరిమితం చేసినా ప్రజలు ఇలాంటి తీర్పు ఎందుకు ఇచ్చారన్న ఆలోచన కూడా జగన్ చేయడం లేదన్నారు. ఇంకా అదే దోరణిలో మాట్లాడుతున్నాడు. 11 సీట్లు ఇచ్చారు అయినా సిగ్గు రాలేదు అన్నారు.

పోలీసులపై జగన్ మాట్లాడడాన్ని తప్పుబట్టారు నక్కా ఆనంద్ బాబు. కూటమి పాలనలో నిజాయతీగా పోలీస్ వ్యవస్థ పనిచేస్తుంటే వారిపై విమర్శలు చేయడం సిగ్గులేని తనం అన్నారు. డీఐజీని పట్టుకొని మాఫియా డాన్ అంటావ్. గతంలో చీటికి మాటికి వచ్చే పోలీస్ సంఘాలు నేడు ఎందుకు మౌనంగా ఉంటున్నాయి. మాజీ ఐపీఎస్ సిద్ధార్థ కౌశల్ స్వచ్ఛందంగా రాజీనామా



చేస్తే దాన్ని రాజకీయం చేస్తున్నావ్. నీ పాలనలో పోలీస్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశావు అది అందరికి తెలుసు. సొంత పార్టీ ఎంపీని ఏ విధంగా కొట్టి హింసించావో అందరం చూశాం. నీ కక్ష సాధింపు చర్యల కోసమే ఐదేళ్ల పాటు పోలీస్ వ్యవస్థను వాడుకున్నావు. చెట్లు తొగలించడం, పరదాలు కట్టేందుకు, ప్రతిపక్షాలను వేధింపులకు గురిచేసేందుకు పోలీస్ వ్యవస్థను వాడుకున్నావు. 25వ ర్యాంకు ఉన్న వ్యక్తికి కేవలం నీ సామాజికవర్గం అయినందుకు డీజీపీని చేసి అడ్డంగా దోపిడీలు చేశావు. నిన్ను నమ్ముకుంటే పోలీసులకు ఏం లభించింది. రామాంజనేయులు జైలుకు పోయాడు. ఐపీఎస్‌లను జైలుకు పంపించావ్. 40 రోజులు సినిమా యాక్టర్ ను హింసించి నానా ఇబ్బందులకు గురిచేస్తే నువ్వు ఏం చేశావు. వాళ్లని అందలం ఎక్కించే ప్రయత్నం చేశావు. యువగళం పాదయాత్ర చేస్తూంటే ఆంక్షలు పెట్టి కనీసం స్టూల్ పై కూడా నిల్చొని ప్రసంగం ఇచ్చేందుకు అనుమతి ఇవ్వలేదు. అడ్డగోలుగా కేసులు పెట్టిన పనికిమాలిన ప్రభుత్వం నీది. నువ్వు పోలీసు వ్యవస్థను నేడు విమర్శలు చేస్తున్నావు. పోలీస్ వ్యవస్థను వాడుకోవడంలో నిన్ను మించిన వాడు ఎవడూ లేడు.

దళితులను గ్రామ బహిష్కరణ చేస్తే పరామర్శకు వెళ్తున్న చంద్రబాబును ఇంటి వద్ద గేట్లకు తాళ్లు కట్టి అడ్డుకుంది మీరు కాదా అని ప్రశ్నించారు. సార్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిని ఇంటి నుంచి బయటికి రాకుండా అడ్డుకొని ప్రజస్వామ్యాన్ని ఖూనీ చేసింది నువ్వు కదా అని క్వశ్చన్ చేశారు. రప్పా రప్పా నకరమని చెబుతన్నావ్ అసలు సిగ్గు ఉందా. సినిమాలో డైలాగులు వాడితే తప్పేంటని మాట్లాడుతున్నావు. సినిమాను సినిమాలా చూడాలి కానీ ఇలా నరికితే మంచిదేగా అంటావా అసల నీవు మనిషివేనా. ముఖ్యమంత్రిగా పనిచేసిన నువ్వు సమాజానికి ఏం చెబుతున్నావు. మొన్న ప్రెస్ మీట్ లో రపారపా నరికితే తప్పేంటని అంటావ్. నేడు అదే మట్లాడుతున్నావు.

# శతాబ్దాల చేనేతల కృషి ఫలితం



**చీరాల:**

"ఒక జిల్లాఒక ఉత్పత్తి" పేరుతో కుప్పడం పట్టు చీరలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జాతీయ స్థాయి అవార్డును చీరల చేనేతలకు అంకితం చేస్తున్నానని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు. కుప్పడం పట్టు చీరలకు కేంద్రం ఇచ్చిన జాతీయస్థాయి అవార్డును అందుకుని బాపట్లకు చేరిన జిల్లా కలెక్టర్ వెంకట మురళి వివిధ శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి సన్మానించారు. శాలువలు కప్పి, పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. శతాబ్దాలుగా చేనేతల కృషి ఫలితమే కుప్పడం పట్టు చీరలకు జాతీయస్థాయి గుర్తింపు లభించిందని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వారు పడుతున్న కష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయన్నారు. చీరాల కుప్పడం పట్టు చీరలు ఎప్పటినుంచో ప్రాచుర్యం పొందాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో వెలుగులోకి వచ్చిందన్నారు. చీరాల కుప్పడం పట్టు చీరలకు ఢిల్లీలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఒక జిల్లాఒక ఉత్పత్తి పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జాతీయ స్థాయి అవార్డు, గౌరవం చేనేతలకే చెందుతుందన్నారు. కుప్పడం పట్టు చీరలను ఆన్ లైన్ వ్యాపార వేదికకు అనుసంధానం చేయాలన్నారు. సూర్యలంక బీచ్, వాడరేవు బీచ్ వద్ద, చీరాల పట్టణం, బాపట్ల పట్టణంలోని ప్రధాన కూడలిలో కుప్పడం పట్టు చీరల ప్రదర్శన, అమ్మకాలు జరపాలన్నారు. పొదుపు సంఘాల ద్వారా సంబంధిత నాలుగు ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటుచేసి, వ్యాపారాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశమంతా ప్రాచుర్యం పొందిన కుప్పడం పట్టు చీరల ఉత్పత్తి విస్తృతం కావాలని, చేనేత కుటుంబాల్లోని నిరుద్యోగులు ఆసక్తిగా చేనేత వృత్తిలోకి అడుగులు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి ధరలు రావాలి, చేనేత వృత్తి లాభదాయకంగా మారాలి, చేనేతలకు మరింత ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



# కలెక్టర్ సుడిగాలి పర్యటన

**పల్నాడు జిల్లా:**

రాజుపాలెం మండలంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు సుడిగాలి పర్యటన చేశారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు రాజుపాలెం మండలంలోని గణపవరం, కూబాద్ పురం, రాజుపాలెం, చౌట పాపాయపాలెం, బ్రాహ్మణ పల్లె గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. గణపవరం గ్రామంలో పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ పలకలను నిర్మించుకున్న లబ్ధిదారును అభినందించారు. సూర్యఘర్ పథకం ద్వారా ఉచిత విద్యుత్ తో పాటూ ప్రభుత్వానికి విద్యుత్ అమ్మి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. నియోజక వర్గంలో 10,000 మంది లబ్ధిదారుల ఇళ్లపై సూర్యఘర్ పథకం ద్వారా సౌర పలకలు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కుబాద్ పురం మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులలో అభ్యాస ప్రమాణాలను పరీక్షించారు. సమగ్రంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందించాలన్నారు. రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి కార్పులకు మొదటి ఎంపిక ప్రభుత్వ ఆసుపత్రులే అయ్యేలా సిబ్బంది పని చేయాలన్నారు. అక్కడ నుండి చౌట పాపాయ పాలెం వద్ద ఉన్న డి. ప్రతాపరెడ్డి కి చెందిన రెండున్నర ఎకరాల మామిడి తోటను పరిశీలించారు. బ్రాహ్మణపల్లిలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫామ్ పాండ్ పనులను పరిశీలించారు. ఫామ్ పాండ్ తో లాభాల గురించి రైతులను చైతన్య పరచాలని అధికారులను ఆదేశించారు.

# గన్నవరం జడ్పీ బాలికల హైస్కూల్లో ఫుడ్ పాయిజన్

గన్నవరం జడ్పీ బాలికల హైస్కూల్లో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. . ఆరుగురు విద్యార్థినిలు అస్వస్థతకు గురి అయ్యారు. మధ్యాహ్నం భోజనం చేసిన కొంతసేపటికి అపస్మారక స్థితిలోకి వెళ్లినపోయారు. వెంటనే అప్రమత్తమైన హాస్టల్ సిబ్బంది మెరుగైన వైద్యం కోసం చిన్న ఆవుటపల్లి సిద్ధార్థ మెడికల్ కాలేజీ హాస్పిటల్ కి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆరుగురు విద్యార్థినిలు ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తున్నరు డాక్టర్లు.




# 2027నాటి రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే

బాపట్ల: ఏ ఒక్క లబ్ధిదారుడు రెవెన్యూ సమస్యల వలన ఇబ్బంది పడకూడదని సీసీఎల్ఏ కమిషనర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రాజధాని అమరావతి నుండి బుధవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్రంలో భూముల రీ సర్వే 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్టు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రీ సర్వే పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు ఆయన సూచించారు. ఈ సంవత్సరం నవంబర్ మాసం నాటికి ప్రభుత్వ భూములు అన్ని రీసెర్వే పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రజలకు సానుకూలంగా స్పందించాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, రెవెన్యూ సమస్యల వలన ప్రజలు ఎవరు ఇబ్బంది పడకూడదని ఆయన అన్నారు. సర్వే శాఖ మరియు తహసీల్దారులు ఆధార్ వెరిఫికేషన్ చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో 20వేల ఆధార వెరిఫికేషన్ పెండింగ్ ఉందని, మొత్తం




మీద రాష్ట్రంలో 5 లక్షల 51 వేల ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్ ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రతి మండల తహసీల్దారులు ఈ విషయమై తగు చర్యలు తీసుకొని ఈనెల 20వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు మరియు తహసిల్దారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల వారీగా ఆధార్ సీడింగ్ పై స్పెషల్ డ్రైవ్ పెట్టి ఆధార్ పెండింగ్ లను పరిష్కరించాలన్నారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్లు మరియు రెవెన్యూ డివిజనల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మరణాలకు సంబంధించిన నివేదికపై విఆర్వోలు తనిఖీ చేసి వాటిని పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనంకు అర్హత ఉండి జాయింట్ ఎల్ పి ఎం వలన అనర్హులుగా ఉన్నాయెడల వాటిని ప్రత్యేకంగా హాజరై పరిష్కరించాలన్నారు. లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా ప్రయత్నించాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనంలో రెవెన్యూ మరియు సర్వే శాఖ వలన అనర్హులైనారని రాకూడదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజు తహసిల్దార్లను కలిసి సమస్యలను తెలుసుకొని ప్రతిరోజు ఆన్ లైన్ డేటా ఆధారంగా మండల స్థాయి, గ్రామస్థాయిలలో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి గ్రామంలో రీ సర్వే పూర్తి చేయాలన్నారు. రీ సర్వే పూర్తి చేయుటకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. వీలైనంతవరకు భూముల మ్యూటేషన్ లో నిజమైన భూ యజమాని పేరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలోనూ, కాలనీలోనూ ప్రభుత్వ భూములను గమనించి ఆ గ్రామాలకు స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలలో స్మశాన వాటికలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.



# ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం మాది

**గుడివాడ:**

కులమత, వర్గాలకు అతీతంగా ప్రజలందరికి మేలు చేసే మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము. అభివృద్ధితోపాటు అర్హులందరికీ సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. గుడివాడ పట్టణంలోని 6,7 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఆత్మీయంగా పలకరించారు. సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏడాది కూటమి పాలనలో అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఎమ్మెల్యే రాము ప్రజలకు కరపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానంటూ ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నడంతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతుందన్నారు. వచ్చే నాలుగేళ్లలో గుడివాడ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని వాటి అమలు దిశగా ముందుకు సాగుతున్నామని రాము పునరుద్ఘాటించారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్తకర్తలు పాల్గొన్నారు.


# నగరం నడిబోడ్డున జంట హత్యలు

విజయవాడలో జంటహత్యలు కలకలం రేపాయి. నగర నడిబొడ్డున ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులను ఓ వ్యక్తి పొడిచి పరారైనట్లు తెలుస్తోంది. రక్తపు మడుగులో పడి ఉన్న రెండు మృతదేహాలు చూసి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన గవర్నర్‌పేటలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో చోటుచేసుకుంది. మృతులు ఇద్దరూ విజయనగరం జిల్లాకు చెందిన వారిగా తెలుస్తోంది. వారు క్యాటరింగ్ పనుల కోసం వచ్చి, అన్నపూర్ణ థియేటర్ సమీపంలో అద్దె గదుల్లో ఉంటున్నట్లు సమాచారం. స్థానికుల ద్వారా ఈ



జంట హత్యలపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఓ రౌడీషీటర్ ఆ ఇద్దరు యువకులను కత్తితో పొడిచి హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మధ్యవర్తిత్వం పై అవగాహన




వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 89 కింద పరిగణించేదే మధ్యవర్తిత్వమని తెనాలి మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షులు,11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు అన్నారు. మధ్యవర్తిత్వం పై అవగాహన కార్యక్రమాన్ని కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. మధ్యవర్తిత్వం పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు మండల న్యాయసేవాధికార సంస్థ ప్రదర్శన నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో సమావేశాన్ని నిర్వహించింది. కోర్టులో విచారణ వరకు వెళ్లకుండా తమ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ఉభయ పక్షాలకు వారి వివాదంలో ఎలాంటి సంబంధం లేని మూడవ పక్షం సహాయం చేసే ప్రక్రియ మధ్యవర్తిత్వం అని మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షులు 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు అన్నారు. దీనిపై వివాదాల పరిష్కారానికి అవగాహన ప్రజల్లో కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

# యువకుడు సెల్ఫీ సూసైడ్.

**తాడేపల్లి:**




గుంటూరు జిల్లా తాడేపల్లిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. నూరేళ్ళ జీవితాన్ని క్షణికావేశంలో అర్ధాంతరంగా ముగించుకున్నాడు ఓ వ్యక్తి.

వివాహమై సంవత్సరం గడవకముందే నా మరణానికి భార్యే కారణమంటూ ఓ యువకుడు ఉరేసుకి ఆత్మహత్య చేసుకున్నాడు. తన భార్య వల్లే చనిపోతున్నానంటూ సెల్ఫీ వీడియో తీసుకొని సూసైడ్ చేసుకున్నాడు. తాడేపల్లి మండలం నులకపేటకు చెందిన బ్రహ్మయ్య మంగళగిరి కి చెందిన మోహన కౌసల్య కి గత సంవత్సరం ఆగస్టు 18న వివాహం అయింది. వేరే కాపురం ఉందామని భర్త మీద ఒత్తిడి తేవడంతో ఉండవల్లి సాయిబాబా గుడి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం పెట్టిన బ్రహ్మయ్య ఆషాడ మాసం కావటంతో పుట్టింటికి వెళ్లింది. బుధవారం ఉదయం ఉండవల్లి గ్రామంలో తను ఉంటున్న నివాసంలో సెల్ఫీ వీడియో తీసుకుంటూ నా మృతికి నా భార్యే కారణం అని ఆత్మహత్య చేసుకున్నాడు బ్రహ్మయ్య. కొడుకు మృతికి కోడలే కారణమని పోలీసుల్ని ఆశ్రయించారు బ్రహ్మయ్య తల్లి. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆసుపత్రి మార్చురీకి తరలించింది కేసు నమోదు చేసి దర్యాప్తు చేచేస్తున్నారు తాడేపల్లి పోలీసులు

# టెక్నాలజీకి ఆద్యులు చంద్రబాబు

**రాప్తాడు:**

వ్యవసాయ రంగంలో డ్రోన్ వ్యవస్థను తీసుకొచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక కార్యక్రమాలు చేపట్టారని.. అందులో భాగంగా డ్రోన్ ను తీసుకొచ్చారన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లి గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర రైతు మిత్ర సంఘానికి డ్రోను అందజేశారు. వ్యవసాయశాఖ ద్వారా ఐదు మంది రైతులకు సబ్సిడీపై డ్రోన్ ను అందించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు. డ్రోన్ ద్వారా పొలాలకు మందులను పిచికారి చేసే విధానాన్ని స్వయంగా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. దీనిపై రైతులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్డును కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూలీల ఖర్చును, సమయాన్ని, మందుల వేస్టేజిని తగ్గించేందుకు ఈడ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 10లక్షలు విలువ చేసే ఈ పరికరాన్ని ఐదు మంది రైతులకు కలిపి అందిస్తున్నట్టు చెప్పారు. ఇందులో ప్రభుత్వ సబ్సిడీనే 8లక్షలు ఉంటుందని.. మిగిలిన 2లక్షలు బ్యాంక్ లోన్ ఉంటుందన్నారు. ఇది కేవలం ఐదు మంది రైతులకే కాకుండా మిగిలిన రైతులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. పదేళ్ల క్రితం అమెరికాలో టెక్నాలజీ సాయంతో వ్యవసాయాన్ని చూశానని.. ఇప్పుడు ఏపీలో కూడా ఇలాంటి విధానాన్ని ముఖ్యమంత్రి తీసుకొచ్చారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మరమ్మత్తులకు గురైన త్రాగునీటి ప్లాంట్ కు రిపేరి చేయించి తిరిగి ప్రారంభించారు ఎమ్మెల్యే. ఈ కార్యక్రమం అనంతరం చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే సునీత భూమి పూజ చేసారు. 1.60కోట్ల ఎస్ఎస్ఏ నిధులతో అదనపు భవనాల నిర్మాణం చేపట్టారు.



# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వేటే



తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కే. వెంకటేశ్వరరావు పెరవలి మండలం పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పిటల్ పరిసర ప్రాంతాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని ప్రోగ్రామ్స్ ను రివ్యూలో టార్గెట్ గణాంకాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కోసం వచ్చిన రోగుల నుండి ఆస్పత్రిలో చికిత్సపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రోగుల నుంచి ఎలాంటి కంప్లైంట్ రాకపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నమెంట్ ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా విధుల పట్ల అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

# మాతృ మరణాలు పూర్తిగా అరికట్టాలి




**అనంతపురం:**

మాతృమరణాలు, శిశుమరణాలు నివారణకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ .బి దేవి. గత నెల జూన్ మాసంలో జిల్లాలో జరిగిన శిశు మరణాలు ,మాతృమరణము లు జరగడానికి గల కారణాలను ఆ ప్రాంత డాక్టర్స్ మరియు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి మాట్లాడుతూ మాతృమరణాలు శిశుమరణాలు నివారించాలని , గ్రామీణ ప్రాంతాలలో మూఢనమ్మకాల వల్ల గర్భిణి లకు , పురిటిపిల్లలకు నాటు వైద్యం కానీ , తంత్ర వైద్యం కానీ చేయడం మంచిది కాదని ఆయా కుటుంబ సభ్యులకు పూర్తి అవగాహన కల్పించాలి అన్నారు. వైద్య పరంగా ఎంతో అభిరుచి చెందిన ఈ రోజులలో కూడా మూఢనమ్మకాలు పాటించడం తగదన్నారు. వారిని చైతన్య పరచడం మన భాద్యత అన్నారు. శిశు మరణం కానీ మాతృ మరణం కానీ జరిగినప్పుడు మరణానికి ముందు ఏ రకమైన ఇబ్బందులు ఎదురైనాయి.. మరణానికి గల కారణాలు తెలుసుకొని మరో సారి అలా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# సుపరిపాలన తొలిఅడుగులో ఎమ్మెల్యే బేబీనాయన



**విజయనగరం:**

రామభద్రపురం మండలం, శిస్తుసీతారాంపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెలుగుదేశం శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు స్థానిక ప్రజల సమస్యలను విన్నారు. త్వరలోనే ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, త్వరలోనే పూర్తిస్థాయి మేనిఫెస్టో అమలుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, రామభద్రపురం మండలం పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్, విజయనగరం పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతి, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలపై ఆకస్మిక తనిఖీలు

**నెల్లూరు:**

జిల్లాలో గర్భస్త లింగ నిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు డెకాయ్ ఆపరేషన్స్ ఎక్కువగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో గర్భస్త పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం అమలుపై జిల్లా మల్టీ మెంబర్ అప్రోపరేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్స్ మరింత ముమ్మరంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడమంటే భ్రూణ హత్యలను ప్రోత్సహించడమేనన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ సభ్యులు, ఎన్‌జివోలు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.

# ప్రతీ రైతుకు పంటల భీమా తప్పనిసరి



**నెల్లూరు:**

జిల్లాలో పంటలను సాగు చేస్తున్న ప్రతి రైతు పంటల బీమా చేయించాలని సూచించారు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్రు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో పంటల బీమా పథకంపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పథకం ఉద్దేశాల గురించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత బీమా పథకాల్లో గుర్తించిన పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా తుఫానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అదేవిధంగా వాతావరణాంశాల ఆధారంగా కలిగే పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించటం జరుగుతుందన్నారు. తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ బీమా పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో వరి, మినుములు, శనగలు, పెసర, వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకునే రైతుల విషయంలో సంబంధిత బ్యాంకు ప్రీమియం మొత్తాన్ని మినహాయించి బీమా కంపెనీకి చెల్లిస్తారని, పంట రుణాలు తీసుకోని రైతులు తమ సమీప సచివాలయాలు, రైతు సేవ కేంద్రాలు, పోస్ట్ ఆఫీసులు, పి ఎ సి యస్ లలో ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. అలాగే నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా నేరుగా మొబైల్ యాప్ ద్వారా నమోదు కావచ్చునన్నారు. పంటల బీమా పత్రం కరపత్రాన్ని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో కలసి ఆవిష్కరించారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు, ఫించన్లు మంజూరు



**కళ్యాణదుర్గం:**

నియోజకవర్గంలో ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. కంబదూరు మండలం నూతిమడుగు గ్రామంలో సుపరి పాలనకు తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు ఎమ్మెల్యే. ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలు, వారికి ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. గడచిన ఐదేళ్లలో ఒక్కరికి కూడా పింఛన్ అందించకపోగా.. ఉన్న పింఛన్లు కూడా తొలగించారని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు ఎమ్మెల్యే సురేంద్రబాబు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాయలసీమ నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి హంద్రీనీవా కాలువ పనుల కోసం రూ.3500 కోట్లు వెచ్చించారని తెలిపారు. మరోవైపు పూసపాటి అశోక్ గజపతి రాజుకి గోవా గవర్నర్ గా కేంద్ర ప్రభుత్వం నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పేరాలసిస్ వ్యాధితో బాధపడుతున్న వడ్డే రామాంజనేయులుకు మందుల కోసం 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు ఎమ్మెల్యే. తల్లికి వందనం సక్సెస్ ఫుల్‌గా అమలు చేశారని తెలిపారు. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వారి ఖాతాల్లో నగదు జమచేయడం జరుగుతుందన్నారు.

# కోటసత్తెమ్మ సేవలో ఎమ్మెల్సీ సోము

**నిడదవోలు:**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయాన్ని సందర్శించారు ఎమ్మెల్సీ సోము వీర్రాజు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ సోమ వీర్రాజుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అధికారులు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి.. తీర్థప్రసాదాలు స్వీకరించారు సోమువీర్రాజు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికతో ముందుకెళ్తోందని చెప్పారు ఎమ్మెల్సీ సోము వీర్రాజు. రాజధాని, పోలవరం, స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, తదితర అంశాలను కేంద్ర సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలు, సహకార సొసైటీల నామినేటెడ్ పోస్టులు భర్తీ వివాదం కూటమి ఇంటర్నల్ ఇష్యూ అన్నారు. కూటమి నేతలు కలిసి సమిష్టిగా పరిష్కరించుకుంటామని ఏ విధంగా ముందుకు వెళ్లాలనేది సమిష్టిగా ఆలోచన చేస్తాం అన్నారు సోము వీర్రాజు.




# స్వరాంధ్ర వైపు చకచకా అడుగులు

**పుట్టపర్తి:**


రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి. గత ఐదేళ్ల ఆగిపోయిన అభివృద్ధిని తిరిగి గాడిలో పెడుతున్నారని.. జగన్ ప్రభుత్వంలో వెళ్లిపోయిన పరిశ్రమలు, పెట్టుబడులు తిరిగి ఏపీ వైపు దృష్టిసారించాయని చెప్పారు ఎమ్మెల్యే సింధూర రెడ్డి. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు మండలం బైరాపురం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు ఎమ్మెల్యే. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ వాటి అమలు తీరును తెలుసుకునేందుకే స్థానిక ఎమ్మెల్యేలు ప్రజల వద్దకు రావడం జరిగిందని తెలిపారు. స్థానికంగా ప్రజలకు త్రాగునీరు ,విద్యుత్ ,సిసి రోడ్లు,రైతులకు రెవిన్యూ సమస్యలు , ప్రజలకు సంబంధించిన ఇతర సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడించారు. ఈ ఐదేళ్లలో పరిశ్రమలు ఏర్పాటు చేసి సుమారు 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే సత్య సాయి జిల్లాలో కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు. ఈ ప్రాంతానికి మరి కొన్ని పరిశ్రమలు ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సాధించారని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ మంత్రి టీజీ భరత్ దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వారు కూడా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ను స్వర్ణాంధ్ర వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రజలు కలిసి ప్రజలను సమస్యలను తెలుసుకున్నారు ఎమ్మెల్యే. కొంతమంది ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. ప్రజల సమస్య పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు ఎమ్మెల్యే.






# పోష్ చట్టానికి పదేళ్లు..

## ఇంకా గాల్లో దీపంలానే మహిళల భద్రత..!



2013లో ప్రవేశపెట్టిన లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోష్ చట్టం) లక్ష్యం, మహిళల కోసం సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడం. అయితే, ఒక దశాబ్దం గడిచినా ఈ లక్ష్యం ఇంకా నెరవేరలేదు. చట్టం ఉన్నా, దాని అమలులో ఉన్న లోపాలు, యజమానుల ఉదాసీనత, మరియు అవగాహనలో ఉన్న లోపం కారణంగా మహిళల భద్రత అనేది ఇంకా సాధ్యమైన దూరంగా ఉంది. ఇది కేవలం లైంగిక వేధింపుల సమస్య మాత్రమే కాదు —— ఇది సమానత్వాన్ని, మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని, మరియు దేశవ్యాప్త అభివృద్ధిని అడ్డుకుంటున్న నిర్మాణాత్మక లోపాల సంకేతం.

**గణాంకాలు చెబుతున్న వాస్తవాలు..**

వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2025 గెండర్ గ్యాప్ నివేదిక ప్రకారం, భారతదేశం 148 దేశాల్లో 131వ స్థానంలో ఉంది. ముఖ్యంగా ఆర్థిక భాగస్వామ్యం మరియు ఆరోగ్య రంగాల్లో భారతదేశం తక్కువ స్కోర్లు సాధించింది. ఇదే సమయంలో, 2024 మెక్‌కిన్సీలీన్ ఇన్ "విమెన్ ఇన్ ది వర్క్‌ప్లేస్" నివేదిక ప్రకారం, సుమారు 50% భారతీయ మహిళలు తమ యజమానులు లైంగిక వేధింపుల ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించలేరనే అభిప్రాయంతో ఉన్నారు —— ఈ సంఖ్య 2018 నుండి మారలేదు. ఈ విశ్వాస లోపం మహిళలను ఫిర్యాదులు చేయడంలో వెనక్కి నెట్టుతుంది, అదే సమయంలో పనిస్థలాల్లో నిశ్శబ్ద సంస్కృతిని ప్రోత్సహిస్తుంది.

**చట్టం ఏమంటోంది..? కానీ ఏం జరుగుతోంది..?**

పోష్ చట్టం ప్రకారం, ప్రతి సంస్థ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ICC)ను ఏర్పాటు చేయాలి. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, అవసరమైతే క్రిమినల్ ఫిర్యాదులు కూడా సహాయపడాలి. యజమానులు చట్ట సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించాలి. అయితే, వాస్తవంగా, చాలా సంస్థలు ఈ నిబంధనలను కేవలం ఓ అధికారికతగా మాత్రమే చూస్తున్నాయి. కొన్ని చోట్ల ICCలు సరిగా ఏర్పాటు చేయబడటం లేదు, అవగాహన సెషన్లు నిర్వహించకపోవడం లేదా అర్థవంతంగా డాక్యుమెంటేషన్ చేయకపోవడం వంటివి జరుగుతున్నాయి. కొన్ని సంస్థలు అవసరమైన వార్షిక నివేదికలు సైతం దాఖలు చేయడంలేదు. డేటా లీక్ భయం, మరియు చట్ట పట్ల అర్థం లోపం మరింత అమలులో దౌర్బల్యాన్ని కలిగిస్తోంది.

**న్యాయ వ్యవస్థ జోక్యం..!**

2024 నవంబర్‌లో, ఒడిశా హైకోర్టు ఒక కీలక తీర్పు ఇచ్చింది. సామాజిక కార్యకర్త బియాట్ ప్రజ్ఞా త్రిపాఠి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో, పోష్ చట్టంలోని సెక్షన్ 19 అమలులో విఫలమవుతున్న కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలపై హైకోర్టు విమర్శలు చేసింది. వేధింపులపై స్పష్టమైన బోర్డులు ఏర్పాటు చేయాలని, ICCలు కేవలం నామమాత్రపు వ్యవస్థ కాకుండా చట్టపరమైన బాధ్యతగా ఉండాలన్న అంశాన్ని కోర్టు పునరుద్ఘాటించింది.

**ఆర్థికాభివృద్ధి కోణం..!**

పని ప్రదేశాల్లో భద్రత లేమి మహిళలను కేవలం మనోవేదనలో పడేయడం కాదు —— వారు ఉద్యోగాన్ని వదిలేయడం లేదా దూరంగా ఉండేలా చేస్తుంది. ఇది మహిళల శ్రమ శక్తి పాల్గొనడాన్ని తగ్గిస్తుంది. భారతదేశంలో ఇప్పటికే మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు తగ్గిపోతున్న సమయంలో, ఈ పరిస్థితి దేశ ఆర్థిక వ్యస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అంటే మహిళల భద్రత కేవలం నైతికంగా అవసరమైతే సరిపోదు —— ఇది ఆర్థికంగా కూడా కీలకం.

**ముందుకెళ్లే మార్గం..!**

భారతదేశం ఇప్పుడు ఉపరితల స్థాయి చట్టాలను అధిగమించాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ILO) కన్వెన్షన్ C190ను ఆమోదించడం ద్వారా పని ప్రదేశ హింసపై గ్లోబల్ ప్రమాణాలతో చట్టాలను సమన్వయం చేయవచ్చు. గిగ్ వర్కర్లు, అనధికార శ్రమికులు కూడా రక్షణ పరిధిలోకి రావాలి. అమలు వ్యవస్థను పటిష్టంగా మార్చాలి —— ఇందులో స్వతంత్ర పర్యవేక్షణ, బాధ్యతా నిర్ణయం, మరియు బాధితుల కేంద్రంగా విధాన రూపకల్పన అవసరం. కేవలం శిక్షలకే పరిమితమయ్యే దృష్టికోణం కాకుండా, నివారణ, పునరావాసం మరియు సాంస్కృతిక మార్పుపై దృష్టిపెట్టాలి.

**విధానాల నుంచి సంస్కృతుల దిశగా..**

చట్టం రావడం సరిపోదు —— నిజమైన మార్పు అంటే మనసు మార్చుకోవడం, వ్యవస్థను మార్చడం. పని ప్రదేశ భద్రతను ఒక బాధ్యతగా కాదు, ఒక విలువగా భావించాలి. నిబంధనలు కేవలం పత్రాలపై కాకుండా, ప్రవర్తనలపై ప్రతిబింబించాలి. ప్రతి మహిళ పని ప్రదేశంలో సురక్షితంగా, గౌరవంతో, స్వేచ్ఛతో ఉండగలిగినప్పుడే భారతదేశం ఒక సమానతా సమాజంగా పరిగణించబడుతుంది.



**అనుపమ దార్ల,**
**న్యాయవాది, సంఘ సంస్కర్త, గుంటూరు.**





# గ్రేట్ ఇండియన్ ఐటీ క్రాష్.. ఉద్యోగ సాధనలో వెనకబడుతున్న యువ ఇంజనీర్లు..!

బెంగళూరు, హైదరాబాద్, మరియు పుణె వంటి నగరాల్లో, అనేకమంది యువ ఇంజనీర్లు పీజీ హాస్టళ్లలో నివసిస్తూ, రోజూ జాబ్ పోర్టల్‌స్‌ను ఆత్రుతగా రిఫ్రెష్ చేస్తున్నారు. విజయవంతమైన ఐటీ కెరీర్ కలలు క్రమంగా కనుమరుగవుతున్నాయి, ఏం తప్పు జరిగిందోనని వారు ఆశ్చర్యపోతున్నారు. రెండు దశాబ్దాల క్రితం లక్షలాది మంది ఆకాంక్షలను రేకెత్తించిన భారతదేశంలోని ఎంట్రీలెవల్ ఐటీ ఉద్యోగ మార్కెట్, ఇప్పుడు అసాధారణమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 2000ల ప్రారంభంలో, ఇన్ఫోసిస్, టీసీఎస్, లేదా విప్రో వంటి సంస్థల్లో ఉద్యోగం పొందడం ఒక బంగారు టికెట్‌గా పరిగణించబడేది. ప్రాథమిక కోడింగ్ నైపుణ్యాలతో సాయుధమైన ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, బగ్ ఫిక్సింగ్, లేదా టెక్ సపోర్ట్ వంటి లెవల్ 1 రోల్స్ కోసం పెద్ద సంఖ్యలో నియమించబడేవారు. ఈ క్యాంపస్ హైరింగ్ కన్వేయర్ బెల్ట్ ఆర్థిక స్థిరత్వాన్ని మాత్రమే కాకుండా సామాజిక ఆమోదాన్ని కూడా అందించేది. భారతదేశ ఐటీ పరిశ్రమ కేవలం వృద్ధి చెందడమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా గౌరవించబడే భారతీయ ప్రతిభతో గ్లోబల్ పవర్‌హౌస్‌గా మారింది.

2025కి వచ్చేసరికి, ఈ దృశ్యం గుర్తించలేనంతగా మారిపోయింది. ఎంట్రీలెవల్ ఐటీ ఉద్యోగాలు వేగంగా అదృశ్యమవుతున్నాయి, మరియు దీనికి కారణం ఇకపై ప్రతిభ లేకపోవడం కాదు—— ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా రాకపోకలు సాగించే సాంకేతిక విఘటన. చాట్‌జిపిటి మరియు గిట్‌హబ్ కోపైలట్ వంటి ఏఐ సాధనాలు, ఒకప్పుడు జూనియర్ ఇంజనీర్లకు అప్పగించబడిన అనేక పనులను ఆటోమేట్ చేస్తున్నాయి. బాయిలర్‌ప్లేట్ కోడ్ రాయడం, సాధారణ లోపాలను డీబగ్ చేయడం, మరియు రొటీన్ సాఫ్ట్‌వేర్ నిర్వహణ వంటివి ఇప్పుడు ఎక్కువగా ఇంటెలిజెంట్ సాఫ్ట్‌వేర్‌ల ద్వారా నిర్వహించబడుతున్నాయి, ఫ్రెషర్లకు తక్కువ రోల్స్ మిగిల్చాయి. విప్రో వంటి కంపెనీలు ఫ్రెషర్ హైరింగ్‌ను గణనీయంగా తగ్గించాయి——FY23లో 38,000 నుండి FY25లో కేవలం 10,000కి. టిసిఎస్ మరియు ఇన్ఫోసిస్ కూడా కొత్త గ్రాడ్యుయేట్ల ఆన్‌బోర్డింగ్‌ను తగ్గించాయి లేదా ఆలస్యం చేశాయి. గ్లోబల్ సంస్థలు కూడా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి, యుఎస్ మరియు యుకెలో కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్ల నిరుద్యోగం పెరుగుతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ యొక్క 2025 నివేదిక, 2030 నాటికి ఏఐఆధారిత ఆటోమేషన్ ప్రపంచవ్యాప్తంగా 75 మిలియన్ ఉద్యోగాలను తొలగించవచ్చని, అయితే 170 మిలియన్ కొత్త ఉద్యోగాలను సృష్టించవచ్చని హెచ్చరిస్తుంది——కానీ ఈ కొత్త రోల్స్ సాంప్రదాయ కోడింగ్‌కు మించిన నైపుణ్యాలను డిమాండ్ చేస్తాయి.

భారత ఇంజనీరింగ్ కళాశాలలు ఈ మార్పును అందిపుచ్చుకోవడంలో వెనుకబడి ఉన్నాయి. 12%కంటే తక్కువ కళాశాలలు ఏఐ లేదా మెషిన్ లెర్నింగ్ కోర్సులను అందిస్తాయి, మరియు ఫ్యాకల్టీలో చాలా తక్కువ మందికి మాత్రమే జనరేటివ్ ఏఐ సాధనాలతో హ్యాండ్స్‌ఆన్ అనుభవం ఉంది. దీని వలన గ్రాడ్యుయేట్లు తరచుగా కొత్త టెక్ ల్యాండ్‌స్కేప్‌కు సిద్ధంగా లేరు, ఇది పరిశ్రమ డిమాండ్లు మరియు అకడమిక్ శిక్షణ మధ్య అంతరాన్ని విస్తరిస్తుంది. కుటుంబాలు విద్యలో భారీగా పెట్టుబడి పెడతాయి, కానీ చాలా మంది విద్యార్థులు నిరుద్యోగులుగా లేదా సంబంధం లేని ఉద్యోగాలకు మారవలసి వస్తుంది.

అయితే, కథ పూర్తిగా నిరాశాజనకం కాదు. ఏఐ కూడా ఏఐ ట్రైనర్స్, ప్రాంప్ట్ ఇంజనీర్స్, చాట్‌బాట్ టెస్టర్స్, మరియు మోడల్ ఆడిటర్స్ వంటి ఉద్భవిస్తున్న రోల్స్‌లో కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఈ స్థానాలకు ఎలైట్ డిగ్రీల కంటే ఆసక్తి, అనుకూలత, మరియు నేర్చుకోవడానికి సుముఖత అవసరం. ఏఐని ఒక బెదిరింపుగా కాకుండా సహకారిగా స్వీకరించే వారికి భవిష్యత్తు చెందుతుంది. ఈ మార్పును నావిగేట్ చేయడానికి, భారతదేశ విద్యా వ్యవస్థ తన కరిక్యులమ్‌ను పునర్విమర్శించాలి, ఏఐ మరియు మెషిన్ లెర్నింగ్‌ను ప్రధాన సబ్జెక్టులుగా చేర్చాలి. విశ్వవిద్యాలయాలు ఇంటర్న్‌షిప్‌లు మరియు హ్యాండ్స్‌ఆన్ ప్రాజెక్ట్‌లను ప్రోత్సహించాలి, రోట్ పరీక్షలను వాస్తవప్రపంచ సమస్యల పరిష్కారంతో భర్తీ చేయాలి. జాతీయ నైపుణ్య కార్యక్రమాలు విస్తరించాలి, మరియు స్టార్టప్‌లు క్యాంపస్‌లతో భాగస్వామ్యం చేసి ఆవిష్కరణలను పెంపొందించాలి. చివరగా, "ఎంట్రీలెవల్" ఉద్యోగాల భావనను ఈ కొత్త ఏఐఆధారిత రోల్స్‌ను చేర్చేలా పునర్నిర్వచించాలి. యువ ఇంజనీర్లకు సందేశం స్పష్టం: ఐటీ విజయానికి పాత మెట్లు బహుశా విరిగిపోయి ఉండవచ్చు, కానీ కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయి. ఏఐని స్వీకరించడం, నిరంతరం నేర్చుకోవడం, మరియు త్వరగా అనుకూలించడం గ్రేట్ ఇండియన్ ఐటీ రీసెట్‌లో వృద్ధి చెందడానికి కీలకం. భవిష్యత్తు అనిశ్చితం, కానీ మూసివేయబడలేదు——మీరు పరిణామం చెందడానికి సిద్ధంగా ఉంటే, మీ కెరీర్ మళ్లీ గాడిన పడుతుంది.



# ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విప్లవాత్మక మార్పులు అవసరం..!

భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు భాగం IIIలో పొందుపరిచిన ఆర్టికల్ 15.. మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారంగా వివక్షను ఖచ్చితంగా నిషేధిస్తుంది. ఈ విధానం, ప్రతి పౌరుడికి సమాన అవకాశాలను కల్పించాలన్న దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తుంది. కానీ వాస్తవంలో, ఈ రాజ్యాంగపు లక్ష్యాలకు విరుద్ధంగా, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సంస్థాగత వివక్ష ఇప్పటికీ కొనసాగుతుంది. భారతదేశవ్యాప్తంగా సుమారు 50,000 ప్రభుత్వ మరియు సంబంధిత విద్యాసంస్థల హాస్టళ్లు పనిచేస్తున్నాయి. ఇవి ప్రధానంగా షెడ్యూల్డ్ కులాలు (SC), షెడ్యూల్డ్ తెగలు (ST), ఇతర వెనుకబడిన తరగతులు (OBC), మరియు మైనారిటీలకు చెందిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం వసతి కల్పిస్తున్నాయి. ఈ హాస్టళ్ల లక్ష్యం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యలో సమాన అవకాశాలు కల్పించడం. అయితే, ఈ లక్ష్యం సాధన మార్గంలో కనిపిస్తున్న అనేక వైఫల్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి.



ఈ హాస్టళ్లు తరచుగా కులం ఆధారంగా వేర్వేరుగా నిర్వహించబడతాయి——ఉదాహరణకు SC హాస్టల్, ST హాస్టల్, BC హాస్టల్ వంటి పేర్లతో. ఫలితంగా, విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒక విభజిత వాతావరణంలో పెరుగుతున్నారు. వారు ఎక్కువగా తమ కులం లేదా వర్గానికి చెందిన వారితో మాత్రమే మమేకమై జీవిస్తున్నారు. ఇది ఇతర సముదాయాల వ్యక్తులతో పరస్పర అవగాహన ఏర్పడకుండా చేస్తూ, వారిలో సామాజిక దూరాన్ని బలపరుస్తుంది. ఇలాంటి సంస్థాగతంగా వ్యవస్థీకృతమైన విభజన, రాజ్యాంగ నైతిక విలువలైన సమానత్వం, ఐక్యతకు వ్యతిరేకంగా ఉంటుంది. ఈ విధంగా పెరిగే విద్యార్థులలో భవిష్యత్తులో సహజంగా సంఘ బేధాలు ప్రబలే ప్రమాదం ఉంది, తద్వారా సమాజంలో సామరస్యం దెబ్బతింటుంది. దీంతో పోలిస్తే, ప్రైవేట్ లేదా కార్పొరేట్ రంగంలోని విద్యాసంస్థల హాస్టళ్లు సామాజిక సమ్మిళనాన్ని పెంపొందించేలా రూపొందించబడ్డాయి. వివిధ వర్గాల విద్యార్థులు ఒకచోట నివసించి, ఒకే వాతావరణంలో పెరిగే అవకాశాన్ని పొందుతారు. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ సంస్థలు విభజనను పెంపొందించే పాత నమూనాలను కొనసాగించడం అనర్థం.

**అభ్యున్నతికి మార్గదర్శక సూచనలు:**

1.హాస్టళ్లకు 'సంక్షేమ హాస్టళ్లు' అనే పేరు పెట్టాలి: కులం లేదా వర్గం ఆధారిత హాస్టల్ పేరు తొలగించటం ద్వారా భావితరాల కోసం సమ్మిళనాన్ని సూచించే వాతావరణాన్ని నిర్మించవచ్చు.

2.ఏకీకృత ప్రవేశ విధానం: అన్ని వర్గాల విద్యార్థులు కలిసే జీవించేలా హాస్టల్ వ్యవస్థను పునరుద్ధరించాలి, దీని ద్వారా చిన్న వయస్సు నుండే పరస్పర గౌరవం మరియు సమాజంలో ఐక్యత పెంపొందుతుంది.


3.విభజన లేకుండా రిజర్వేషన్ కొనసాగించాలి: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు ప్రవేశాల విషయంలో అమలవుతుండగా, వసతి ఏర్పాట్ల విషయంలో కుల ఆధారిత వేర్పాటు ఉండకూడదు.

4.సమాన బడ్జెట్ కేటాయింపులు: హాస్టళ్లు సమ్మిళితంగా ఉన్నప్పటికీ, వర్గాలపై కేంద్రిత మద్దతు కొనసాగించేందుకు వేరుగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలి. ఇది సానుకూల చర్యలను బలపరచడంలో సహాయపడుతుంది.

ఈ మార్గదర్శకాలు, యువతలో సామాజిక సమరస్యం, సమానత్వం, మరియు ఐక్యత వంటి విలువలను పెంపొందించడంలో కీలకంగా ఉంటాయి. 2020లో కృష్ణా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఈ అంశంపై గౌరవ గవర్నర్‌కు నివేదిక సమర్పించినా, దానికి గణనీయమైన స్పందన రాలేదు.

అయితే జూన్ 26, 2025న, తమిళనాడు ముఖ్యమంత్రి ఒక కీలక ప్రకటన చేశారు: రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లను "సామాజిక న్యాయ హాస్టళ్లు"గా పేరు మార్చారు. ఇది ఒక దార్శనిక నిర్ణయంగా మారి, భవిష్యత్ మార్పులకు బీజం వేశింది.

ఇప్పుడు కేంద్రం మరియు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మార్గాన్ని అనుసరించాల్సిన సమయం ఆసన్నమైంది. విధానస్థాయిలో మార్పులు కేవలం చట్టబద్ధంగానే కాకుండా, ప్రజల అనుభవాల్లోనూ రాజ్యాంగ విలువలు ప్రతిఫలించేలా ఉండాలి. సమ్మిళిత సంక్షేమ హాస్టళ్లు భారతదేశం యొక్క "సమాన హక్కులతో కూడిన సమైక్య భవిష్యత్తు" వైపు తీసుకెళ్లే ఒక ప్రాముఖ్యమైన పథంగా నిలుస్తాయి.



**బీవీఎస్ కుమార్,**
**చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్, కృష్ణాజిల్లా.**



## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో, దేశ వ్యవసాయం ,ఇంధన రంగానికి కొత్త దిశానిర్దేశం చేసే మూడు ప్రధాన నిర్ణయాలు ఆమోదించబడ్డాయి. ఒక వైపు వ్యవసాయ జిల్లాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక ఆమోదించబడింది, మరోవైపు, పునరుత్పాదక ఇంధనంలో పెద్ద ఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేయబడింది. కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. 2025 26 నుంచి ఆరేళ్ల కాలానికి ఈ పథకం 100 జిల్లాలను కవర్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంట కోత తర్వాత గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేయడానికి గోదాముల సదుపాయం, నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడం వంటి లక్ష్యాలతో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని రూపొందించారు. 11 శాఖల్లోని 36 పథకాలు, రాష్ట్రంలోని ఇతర పథకాలు, ప్రైవేటు రంగంతో స్థానిక భాగస్వామ్యం ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీకి రూ. 20 వేల కోట్ల పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతరిక్ష కేంద్రంలో 18 రోజులు గడిపి విజయవంతంగా భూమికి తిరిగి వచ్చిన శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానం చేశారు.

## కేజ్రీవాల్ మోడల్‌ని పీకే అవలంభిస్తారా..?

**టీపీఎన్, పాట్నా :**

ఈసారి బీహార్ లో త్రిముఖ పోరు కనిపిస్తోంది. అధికారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అక్టోబర్‌నవంబర్ నాటికి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్న ఎన్నికల వ్యూహకర్త, రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్ (పికె) పార్టీ జాన్ సూరజ్ కూడా అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ)ప్రతిపక్ష మహా కూటమి మధ్య ప్రత్యక్ష పోరును ఎదుర్కోవడానికి తన శక్తినంతా ఉపయోగిస్తోంది. తాను ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోనని..రాష్ట్రంలోని 243 స్థానాల్లోనూ అభ్యర్థులను పోటీచేస్తారని పికె ఇప్పటికే స్పష్టం చేశారు. ఇప్పుడు ఎన్నికల సమయం దగ్గర పడుతోంది. రాజకీయ రణక్షేత్రంలో పికె స్వయంగా ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే దానిపై చర్చ జరుగుతోంది?



**ఎన్నికల్లో పోటీ చేయడంపై పీకే వైఖరి ఏమిటి?**

ప్రశాంత్ కిషోర్ ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారారు. ఎన్నికల్లో పోటీ చేయడం ఆయన పాత్ర. జన్ సూరజ్ పార్టీతో బీహార్ ఎన్నికల యుద్ధభూమిలోకి ప్రవేశించిన తర్వాత ఇప్పుడు ఆయనపై ఎన్నికల్లో పోటీ చేసే బాధ్యత ఉంది. ముందుండి నడిపించే సవాలు కూడా ఉంది. జన్ సూరజ్ పార్టీకి సూత్రధారిగా, ఆయన ఎన్నికల ప్రచారానికి కేంద్రబిందువుగా కూడా ఉంటారు.

ఇలాంటి పరిస్థితుల్లో పీకే స్వయంగా ఎన్నికల యుద్ధభూమిలోకి ప్రవేశిస్తారా? లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయడంపై పీకే వైఖరి గురించి మాట్లాడుతూ పార్టీ నిర్ణయిస్తే తాను రఘోపూర్ స్థానం నుంచి పోటీ చేస్తానని మార్చి నెలలో ఆయన అన్నారు. రఘోపూర్ బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ నియోజకవర్గం. మహాఘట్బంధన్ కు నాయకత్వం వహిస్తున్న రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ), జాన్ సూరజ్ ను బీజేపీ బి టీమ్ గా పిలుస్తున్నారనే తమ కథనాన్ని బలోపేతం చేయడానికి, రాఘోపూర్ నుంచి పోటీ చేయాలనే పీకే మాటలను ఉపయోగించడం ప్రారంభించింది. తేజశ్విని పక్కన పెడితే మోడీపై కూడా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని పీకే తరువాత అన్నారు. ప్రశాంత్ కిషోర్ చేసిన ఈ ప్రకటనల వెనుక ఒక ప్రత్యేక వ్యూహం కూడా ఉందని నమ్ముతారు.

**పీకే తొలిసారి కేజ్రీవాల్ మోడల్‌ను అవలంబిస్తారా?**

రఘోపూర్ అసెంబ్లీ స్థానాన్ని లాలూ యాదవ్ కుటుంబానికి చెందిన స్థానంగా పరిగణిస్తారు. తేజస్వి యాదవ్ 2015 నుండి బీహార్ అసెంబ్లీలో ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తేజస్వికి ముందు లాలూ ప్రసాద్ యాదవ్ , రబ్రీ దేవి కూడా రఘోపూర్ స్థానం నుండి ఎమ్మెల్యేలుగా గెలిచారు.. ప్రశాంత్ కిషోర్ లాలూ కుటుంబం యొక్క బలమైన కోటలోకి ప్రవేశించడం గురించి మాట్లాడారు, కాబట్టి దీనిని కేజ్రీవాల్ ఎన్నికల అరంగేట్రం మోడల్ గా కూడా చూస్తున్నారు పలువురు రాజకీయ నిపుణులు.

ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి ఢిల్లీలో ఎన్నికల బరిలోకి దిగిన అరవింద్ కేజ్రీవాల్ అప్పటి ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ సీటు అయిన న్యూఢిల్లీని ఎంచుకున్నారు. షీలా దీక్షిత్ అధికార పార్టీకి అతిపెద్ద ప్రతినిధి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కూడా కేజ్రీవాల్ అదే ఫార్ములాను ఉపయోగించారు. వారణాసి స్థానం నుంచి ఎన్డీఏ ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్ర మోడీపై పోటీ చేశారు.

ఒకవేళ ప్రశాంత్ కిషోర్ రాఘోపూర్ స్థానం నుండి తేజస్వి యాదవ్ పై పోటీ చేస్తే, దీని వెనుక ఉన్న కారణం ఒక పెద్ద వ్యక్తిపై పోటీ చేయడం అనే ఫార్ములా అయి ఉండవచ్చు. నిజానికి, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శాసన మండలి సభ్యుడు. నితీష్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయరు. అటువంటి పరిస్థితిలో ప్రశాంత్ కిషోర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు , మహాకూటమి నుండి ముఖ్యమంత్రి పదవికి అతిపెద్ద పోటీదారుడు అయిన తేజస్వి యాదవ్ స్థానాన్ని ఎంచుకున్నారు.

**బక్సర్ స్థానం నుండి పోటీ చేయడంపై ఊహాగానాలు**

ప్రశాంత్ కిషోర్ కు అవకాశం ఉన్న సీట్ల జాబితాలో, బక్సర్ సీటు గురించి కూడా ఊహాగానాలు వస్తున్నాయి. బక్సర్ నుండి 12వ తరగతి వరకు చదువుకున్నాడు. అతనికి ఇక్కడ సొంత ఇల్లు కూడా ఉంది. బక్సర్ సీటు యొక్క కుల సమీకరణం కూడా రోహ్తాస్ జిల్లాలోని కోనార్ గ్రామంలో జన్మించిన ప్రశాంత్ కిషోర్ కు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. రాఘోపూర్ లాగే బక్సర్ అసెంబ్లీ స్థానాన్ని కూడా 2020 బీహార్ ఎన్నికల్లో గ్రాండ్ అలయన్స్ గెలుచుకుంది. జనరల్ కేటగిరీ నుండి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్నా తివారీ అప్పట్లో ఈ స్థానం నుండి విజయం సాధించారు.

**బీహార్ ఎన్నికలకు జాన్ సూరజ్ వ్యూహం ఏమిటి?**

బీహార్ ఎన్నికలకు ప్రశాంత్ కిషోర్ వ్యూహం ఏమిటంటే, ఎన్డీఏ , మహాఘట్బంధన్ లకు ప్రత్యామ్నాయంగా జాన్ సూరజ్ ను ప్రజల్లోకి తీసుకెళ్లడం. జాన్ సూరజ్ విద్య, ఆరోగ్యం, వలసలు ఉపాధి వంటి అంశాలను లేవనెత్తుతోంది. వాటి పరిష్కారం కోసం తన దార్శనికతను కూడా ప్రదర్శిస్తోంది. క్లీన్ ఇమేజ్ ఉన్న కొత్త ముఖాలను జాన్ సూరజ్ తో అనుసంధానించడం ఎన్నికల్లో వారిని నిలబెట్టడంపై ఫోకస్ చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో, ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయని అలాంటి ముఖాలకు జాన్ సూరజ్ 90 శాతం టిక్కెట్లు ఇస్తానని ప్రశాంత్ కిషోర్ స్వయంగా ప్రకటించారు. త్వరలో జరగబోయే ఎన్నికలు చాలా రసవత్తరంగా మారనున్నాయి.



## శశి థరూర్ ముఖ్యమంత్రి అవుతారా?

**టీపీఎన్, కేరళ :**

కేరళలో వచ్చే ఏడాది మే నెలలో ఎన్నికలు జరగనున్నాయి. పినరయి విజయన్ నేతృత్వంలోని పాలక ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రాకుండా నిరోధించడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది. రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి పదవికి కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) అభ్యర్థిగా ఉన్నారా? కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒక సర్వే డేటాను బహిర్గతం చేయడం ద్వారా ఈ విషయాన్ని గుర్తించారు. ఈ సర్వే ఆయనను యుడిఎఫ్ నుంచి ముఖ్యమంత్రి పదవికి ముందు వరుసలో ఉంచింది.

**సర్వేలో శశి థరూర్ అగ్రస్థానంలో ఉన్నారు.**

స్వతంత్ర సంస్థ ఓట్ వైబ్ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో బలమైన ప్రభుత్వ వ్యతిరేకత ఉందని వెల్లడైంది. సర్వే ప్రకారం 28.3 శాతం మంది ప్రజలు యుడిఎఫ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా థరూర్‌ను ఇష్టపడ్డారు. ఇటీవలి కాలంలో ఆయన అఖిలపక్ష బృందంలో సభ్యుడిగా ఉండటం..ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ప్రశంసించడం వల్ల కాంగ్రెస్ లక్ష్యంగా మారారు. తిరువనంతపురం నుండి నాలుగుసార్లు ఎంపీగా ఎన్నికైన థరూర్‌కు వృద్ధ ఓటర్లు (55 ఏళ్లు పైబడినవారు) 34.2% మద్దతు ఇచ్చారు. సర్వే ప్రకారం, ఆయనకు 1824 ఏళ్ల వయస్సు వారి నుండి 20.3% మద్దతు లభించింది.

## మేము ఆ పార్టీతో పొత్తు పెట్టుకోం..!

**టీపీఎన్, బీహార్ :**

అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్‌ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్ (AIMIM), ప్రతిపక్ష మహా కూటమిలో చేరాలనే కోరికను వ్యక్తం చేస్తూ రాష్ట్రీయ జనతాదళ్ (RJD)కి లేఖ రాసింది. దీనిపై బీహార్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ అఖిలేష్ ప్రసాద్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. AIMIM లాంటి మతతత్వ పార్టీతో పొత్తు ఎలా ఉంటుందని అఖిలేష్ ప్రసాద్ సింగ్ అన్నారు. AIMIM ఎల్లప్పుడూ BJPకి సహాయం చేస్తోందన్నారు. బిజెపి తప్ప ప్రతి పార్టీకీ SIR గురించి భయాలు ఉన్నాయని అఖిలేష్ ప్రసాద్ సింగ్ పేర్కొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) వ్యక్తం చేసిన ఆందోళనను ఆయన ప్రస్తావిస్తూ కొంతమంది బహిరంగంగా మాట్లాడుతున్నారని. కానీ కొంతమంది ఇప్పటికీ భయం నుండి బయటపడలేకపోతున్నారని అన్నారు. మహాఘట్బంధన్‌లో AIMIM ప్రవేశానికి అఖిలేష్ ప్రసాద్ సింగ్ 'నో' చెప్పిన తర్వాత, అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కొత్త చర్చ ప్రారంభమైంది.



**అఖిలేష్ ప్రసాద్ కు మద్దతు ఇచ్చిన ఆర్జేడీ**

బీహార్‌లో మహాఘట్‌బంధన్‌కు నాయకత్వం వహిస్తున్న ఆర్జేడీ, అఖిలేష్ ప్రసాద్ సింగ్ ప్రకటనకు మద్దతు ఇచ్చింది. ఒవైసీ బీజేపీకి బి టీమ్‌గా మారడం ద్వారా లౌకిక ఓటును విభజించిందని ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ అన్నారు. మతతత్వ శక్తులకు ప్రయోజనం చేకూర్చడంలో ఆయనకు ట్రాక్ రికార్డ్ ఉందన్నారు.

**ఒవైసీ బీహార్ కు ఎందుకు వస్తాడు- ఆర్జేడీ**

మేము ఎన్నికల్లో పోటీ చేయడానికి హైదరాబాద్ వెళ్లడం లేదని, మరి ఒవైసీ బీహార్‌కు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించింది ఆర్జేడి. ఒవైసీ నిజంగా లౌకిక శక్తులకు సహాయం చేయాలనుకుంటే, బీహార్ ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించాలని ప్రసాద్ సింగ్ అన్నారు. మహాఘట్బంధన్‌లో AIMIM ప్రవేశంపై రాజకీయాల మధ్య, ఇప్పుడు JDU కూడా దానిపై విమర్శలు గుప్పించింది.

**జెడియు ఒక విమర్శను ఎదుర్కొని ఎన్డిఎ విజయం సాధించిందని ప్రకటించింది.**

ఒవైసీకి మహాఘట్బంధన్‌లో ప్రవేశం లేకపోవడంతో ప్రతిపక్షాల సంక్షోభం మరింత తీవ్రమైందని జెడియు అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ అన్నారు. ఆర్జేడీ, ఒవైసీల మధ్య దూరం బహిరంగమైందని ఆయన అన్నారు. ఈ వ్యక్తులు ఎన్డీఏతో పోటీ పడలేరని ఆరోపించారు. నితీష్ కుమార్ నాయకత్వంలో ఎన్డీఏ విజయం ఖాయమని పేర్కొన్నారు.



## జమ్మూ కాశ్మీర్ పై ప్రధాని మోదీకి రాహుల్ లేఖ

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ ప్రధాని మోదీకి లేఖ రాశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి బిల్లును తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ డిమాండ్ చట్టబద్ధమైనదని , రాజ్యాంగ , ప్రజాస్వామ్య హక్కులపై ఆధారపడి ఉందని రాహుల్ గాంధీ ఈ లేఖలో రాశారు.



## మంత్రి పుట్టినరోజు వేడుకల్లో కలెక్టర్, ఎస్పీ

**టీపీఎన్, రాజ్‌గఢ్ :**

మధ్యప్రదేశ్ మంత్రి నారాయణ్ సింగ్ పవార్ పుట్టినరోజును రాజ్‌గఢ్ జిల్లాలోని బియోరాలోని తన కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , పోలీసు సూపరింటెండెంట్ హాజరు కావడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంక్షేమం , మత్స్య అభివృద్ధి మంత్రి బహిరంగంగా కేక్ కట్ చేసి ముందుగా కలెక్టర్‌కు కేక్ తినిపించి, ఆపై తన చేతులతో ఎస్పీకి కేక్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు కూడా మంత్రికి కేక్ తినిపించి అభినందించారు. ఈ దృశ్యం మొత్తం కెమెరాలో రికార్డు అయ్యింది. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. .దీనిపై ప్రతిపక్ష నాయకులు, సామాజిక సంస్థలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశాయి. పరిపాలనా అధికారులు వేదికపై ఉండటం, రాజకీయ నాయకుడి ప్రైవేట్ కార్యక్రమంలో వ్యక్తిగతంగా పాల్గొనడంపై తీవ్ర విమర్శలు చేశారు. అధికార పార్టీ నాయకుల వ్యక్తిగత కార్యక్రమాల్లో ఉన్నతాధికారులు ఈ విధంగా పాల్గొన్నప్పుడు, వారి ప్రవర్తన సాధారణ ప్రజలతో ఎంతవరకు న్యాయంగా ఉంటుందనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

## ఢిల్లీలో పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

స్థానిక పాఠశాలలు, కళాశాలలకు నిరంతరం మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వస్తున్నాయి. ఇది మూడు రోజులుగా కొనసాగుతోంది. సెయింట్ థామస్ స్కూల్, సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్, రాంజాస్ కాలేజ్ ,సైంటిఫిక్ డిఫెన్స్ కాలేజ్ సహా అనేక సంస్థలకు మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ , అగ్నిమాపక బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నాయి. ఇప్పటివరకు ఎక్కడా అనుమానాస్పద వస్తువు కనుగొనబడలేదు. జూలై 16న ద్వారకలోని సెయింట్ థామస్ స్కూల్ , మరొక స్కూల్ కు బెదిరింపు మెయిల్ వచ్చింది. జూలై 15న, సెయింట్ థామస్ స్కూల్ తో పాటు, సెయింట్ స్టీఫెన్స్ , రాంజాస్ కాలేజ్ ఆఫ్ ఢిల్లీ యూనివర్సిటీకి కూడా ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అన్ని సంస్థలను ఖాళీ చేయించి, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు,




అదేవిధంగా ఢిల్లీ విశ్వవిద్యాలయం యొక్క నార్త్ క్యాంపస్‌లో ఉన్న సైంటిస్ట్ డిఫెన్స్ కాలేజీకి ఉదయం 7:15 గంటలకు కళాశాల లైబ్రరీలో RDX ఉంచబడిందని .. బాంబుతో కళాశాలను పేల్చివేయడానికి ప్రణాళిక ఉందని ఇమెయిల్ ద్వారా బెదిరింపు వచ్చింది. కళాశాల పరిపాలన వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. అగ్నిమాపక దళం, బాంబు స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని మొత్తం కళాశాల క్యాంపస్‌లో శోధన ఆపరేషన్ నిర్వహించింది. ఈనెల 14న కూడా చాణక్యపురిలోని నేవీ స్కూల్, ద్వారకలోని సిఆర్‌పిఎఫ్ స్కూల్‌లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ప్రతిసారీ మెయిల్ లేదా కాల్స్ ద్వారా బెదిరింపులు వస్తున్నాయి. కానీ ఇప్పటివరకు ఏ ప్రదేశం నుండి పేలుడు లేదా అనుమానాస్పద వస్తువు కనుగొనబడలేదు. బెదిరింపు మెయిల్స్ అన్నీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు .ఈ మెయిల్స్ ఎవరు, ఎందుకు పంపించారో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. నిరంతర బెదిరింపులు భద్రతా సంస్థలను అప్రమత్తం చేశాయి.

**ఢిల్లీని అడవి రాజ్యంగా మార్చాలని బీజేపీ పట్టుదలతో ఉంది: కేజ్రీవాల్**

ఇంతలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ పాఠశాలలకు నిరంతరం వస్తున్న బెదిరింపుల గురించి X లో పోస్ట్ చేశారు. 'వరుసగా మూడో రోజు ఢిల్లీ పాఠశాలలకు బాంబు దాడుల బెదిరింపులు వచ్చాయి. హోంమంత్రి అమిత్ షా జీ లేదా ఆయన నాలుగు ఇంజిన్ల ప్రభుత్వాలు ఢిల్లీ ప్రజలు, వారి పిల్లల గురించి పట్టించుకోవు. ఢిల్లీని అడవి రాజ్యంగా మార్చాలని బిజెపి గట్టిగా పట్టుబడుతోంది అని ఆయన అన్నారు.



# మళ్లీ పడగ విప్పుతున్న కరోనా..!

**టీపీఎన్, అమెరికా :**

కరోనా మహమ్మారి అమెరికాలో విజృంభిస్తోంది. గత కొన్ని రోజులుగా అగ్రరాజ్యంలో కరోనా బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో వేసవి కాలం కావడంతో, సెలవులను ఆస్వాదించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ప్రయాణాలు చేస్తున్నారు. తీర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు తరలిపోవడం వల్ల వైరస్ వేగంగా వ్యాపిస్తోందని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) వెల్లడించింది. ముఖ్యంగా ఫ్లోరిడా, టెక్సాస్, కాలిఫోర్నియా, ఒహియో వంటి రాష్ట్రాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సీడీసీ నివేదిక ప్రకారం, ఎన్బీ.1.8.1 , ఎక్స్ఎఫ్ జీ అనే కొత్త వేరియంట్లు ప్రస్తుతం అమెరికాలో వేగంగా వ్యాపిస్తున్నాయి. వేరియంట్ల ప్రభావంతో గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె బరువుగా ఉండటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజలు కరోనా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు అధికారులు.



# రష్యాతో చమురు కొనుగోలు చేస్తే 100%సుంకాలు

**టీపీఎన్, రష్యా :**

రష్యాతో చమురు , గ్యాస్ వ్యాపారం కొనసాగించే దేశాలపై 100% ఆంక్షలు విధిస్తామని NATO సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. వ్లాదిమిర్ పుతిన్‌కు ఫోన్ చేసి, శాంతి చర్చల గురించి ఆయన తీవ్రంగా ఆలోచించాలని చెప్పండి... లేకుంటే ఇది బ్రెజిల్, భారతదేశం, చైనాపై భారీ స్థాయిలో ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని రుట్టే అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను ప్రకటించిన మరుసటి రోజు, 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యన్ ఎగుమతుల కొనుగోలుదారులపై 100% సుంకాలను విధిస్తామని వార్నింగ్ ఇచ్చిన మరుసటి రోజు యుఎస్ కాంగ్రెస్‌లో సెనేటర్లతో సమావేశమైనప్పుడు రుట్టే ఈ వ్యాఖ్య చేశారు.



# ఇమ్రాన్ మాజీ భార్య కొత్త పార్టీ

**టీపీఎన్, పాకిస్తాన్ :**

పాకిస్తాన్ రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో పీటీఐ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ మాజీ భార్య రెహమ్ ఖాన్ కొత్త పార్టీని ప్రకటించారు. పాకిస్తాన్ రిపబ్లిక్ పార్టీ పేరుతో దీన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. నేను ఇంతకు ముందు ఎప్పుడూ రాజకీయ పదవులను అంగీకరించలేదు. నేను ఒకే వ్యక్తి కోసం ఒకసారి ఒక పార్టీలో చేరాను" అని తన మాజీ భర్తను ఉద్దేశించి అన్నారు. తన పార్టీ పాకిస్తాన్ రిపబ్లిక్ పార్టీ ప్రజల గొంతుకగా ఉంటుందని, పాలక వర్గాలను జవాబుదారీగా ఉంచుతుందని అన్నారు. దేశంలో పెరుగుతున్న అసంతృప్తి నుండి తమ పార్టీ పుట్టిందని ఆమె అన్నారు.

**రెహమ్ ఖాన్ ఎవరు?**

2015లో క్రికెటర్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ఇమ్రాన్ ఖాన్‌ను వివాహం చేసుకుంది రెహమ్ ఖాన్. అప్పటి పిటిఐ చీఫ్‌తో జరిగిన వివాహం ఆమెకు రెండో పెళ్లి. ఆమె గతంలో మానసిక వైద్యుడు అయిన ఇజాజ్ రెహ్మాన్‌ను వివాహం చేసుకుంది. ఈ జంట 1993లో వివాహం చేసుకుని.. 2005లో విడాకులు తీసుకున్నారు. వారి వివాహ సమయంలో వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఇమ్రాన్ ఖాన్‌తో వివాహానికి ముందు, రెహమ్ జర్నలిస్ట్‌గా పనిచేశారు . ఆమె బిబిసిలో పనిచేశారు . ఆమె చిత్ర నిర్మాణంలోకి కూడా అడుగు పెట్టారు. 2016లో ఆమె స్వాత్‌లో సెట్ చేయబడిన రొమాంటిక్ కామెడీ జనాన్‌ను నిర్మించింది.




# ఇరాన్ హైపర్సోనిక్ క్షిపణికి ఇజ్రాయెల్ భయపడిందా?

**టీపీఎన్, ఇరాన్ :**

ఇజ్రాయెల్ రక్షణ రంగంలో మరింత శక్తివంగా తయారవుతోంది,. హైపర్‌సోనిక్ క్షిపణులను కూల్చివేసే యారో 4 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను నిర్మించింది. ఇది వేగవంతమైనది, ఖచ్చితమైనది చౌకైనది కూడా. జర్మనీ దీనిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతోంది. ఇజ్రాయెల్ లేటెస్ట్ టెక్నాలజీ ఎప్పటికప్పుడు ప్రపంచానికి పరిచయం చేస్తుంది. ఇజ్రాయెల్ తన కొత్త హైపర్సోనిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ యారో 4 అభివృద్ధి చేసింది. ఈ వ్యవస్థ ఏదైనా హైపర్సోనిక్ క్షిపణిని అడ్డగించి నాశనం చేయగలదు.యారో 4 త్వరలో పనిచేయడం ప్రారంభిస్తుందని ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (IAI) CEO బోజ్ లెవి అన్నారు. ఇది ఇజ్రాయెల్ యొక్క వైమానిక రక్షణలో చేర్చబడుతుంది. ఈ వ్యవస్థను నేటి అతిపెద్ద ముప్పు అయిన హైపర్సోనిక్ క్షిపణులను ఎదుర్కోవడానికి రూపొందించబడింది.

**హైపర్సోనిక్ క్షిపణుల పెరుగుతున్న ముప్పు**

చైనా యొక్క DFZF రష్యా యొక్క అవంగార్డ్ వంటి హైపర్సోనిక్ క్షిపణులు మాక్ 5 కంటే వేగంగా ప్రయాణిస్తాయి (ధ్వని వేగం కంటే ఐదు రెట్లు). ఈ క్షిపణులు గాలిలో దిశను మార్చుకోగలవు. తక్కువ ఎత్తులో ఎగురుతాయి, ఇది సాంప్రదాయ క్షిపణి రక్షణ వ్యవస్థలకు కష్టతరం చేస్తుంది. సాంప్రదాయ బాలిస్టిక్ క్షిపణులు సరళ మార్గంలో ప్రయాణిస్తాయి. కానీ హైపర్సోనిక్ క్షిపణులను అంచనా వేయడం కష్టం. చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాల పెరుగుతున్న సాంకేతికతతో ఈ ముప్పు మరింత తీవ్రంగా మారింది. అమెరికా పేట్రియాట్ PAC3, THAAD, రష్యా యొక్క S400 వంటి మునుపటి వ్యవస్థలు హైపర్సోనిక్ క్షిపణులను ట్రాక్ చేసి నాశనం చేయగల సామర్థ్యాన్ని కలిగి లేవు. వాటి నెమ్మదిగా ప్రతిస్పందన పాత సాఫ్ట్‌వేర్ దీనికి కారణం. హైపర్సోనిక్ క్షిపణులు చాలా వేగంగా ఉంటాయి, ప్రతిస్పందించడానికి సమయం కేవలం సెకన్లకు తగ్గించబడుతుంది. దీని కారణంగా ఉన్న రాడార్లు, ఇంటర్‌సెప్టర్లు విఫలమవుతాయి.

**ఇరాన్ హైపర్‌సోనిక్ క్షిపణిని ఉపయోగించింది**

ఇజ్రాయెల్‌పై ఇటీవలి దాడుల్లో ఇరాన్ ఫతా 1 హైపర్‌సోనిక్ క్షిపణిని ప్రకటించుకుంది . ఇరానియన్ మీడియా మరియు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) ప్రకారం ఈ క్షిపణిని 2023లో ప్రవేశపెట్టారు. ఇది మాక్ 5 కంటే ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. అయితే, దాని హైపర్‌సోనిక్ సామర్థ్యం ప్రభావం గురించి చర్చ జరుగుతోందని నిపుణులు భావిస్తున్నారు.

**ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది**

యారో 4 పై అంతర్జాతీయ ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే యారో 3 ను కొనుగోలు చేసిన జర్మనీ ఇప్పుడు యారో 4 ను పరిశీలిస్తోంది. యూరోపియన్ స్కై షీల్డ్ ఇనిషియేటివ్ కింద వేగవంతమైన రహస్య క్షిపణుల నుండి రక్షించడానికి ఇది అవసరం. దీని మాడ్యులర్ డిజైన్ అనేక దేశాలతో అనుసంధానించడం సులభం చేస్తుంది. హైపర్‌సోనిక్ క్షిపణుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో యారో 4 ఆధునిక యుద్ధానికి ఒక ముఖ్యమైన ఆయుధంగా మారవచ్చు. ఇజ్రాయెల్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు వ్యూహాత్మక సహాయంగా మారుతుంది. ఈ వ్యవస్థ కొత్త సాంకేతికత ..భవిష్యత్ యుద్ధాలలో భద్రతకు ఆధారం అవుతుంది.

# క్యూబాలో బిచ్చగాళ్లపై వ్యాఖ్యలు

- **మంత్రి పదవికి రాజీనామా చేసిన ఫీటో**

**టీపీఎన్, క్యూబా :**






మంత్రి చేసిన ఒక ప్రకటన కారణంగా ఆమె తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కమ్యూనిస్ట్ పాలిత ద్వీప దేశ కార్మిక , సామాజిక భద్రతా మంత్రి మార్తా ఎలెనా ఫీటోకాబ్రెరా క్యూబాలో ఒక్క బిచ్చగాడు కూడా లేదని పార్లమెంటరీ సమావేశంలో అన్నారు. ఆమె ప్రకటనపై చాలా వివాదం చెలరేగింది. ఆ తర్వాత ఆమె తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. క్యూబాలో 'బిచ్చగాడు' అనే వాడు లేదని మంత్రి అన్నారు . కొంతమంది కష్టపడి పని చేయకుండా డబ్బు సంపాదించడానికి వీధుల్లో తిరుగుతూ చెత్తను ఏరుకుంటారని అన్నారు. ఆర్థిక సంక్షోభం కారణంగా క్యూబాలో సామాజిక అభద్రత పెరిగింది. అక్కడి పేదలు, ముఖ్యంగా వృద్ధులు అడుక్కుంటూ లేదా చెత్తను ఏరుకుంటున్నారు. దేశంలోని ఈ పరిస్థితులను విస్మరించి నేషనల్ అసెంబ్లీ కమిటీ ముందు ఫీటో మాట్లాడుతూ మేము ప్రజలను చూశాము... వారు బిచ్చగాళ్లలా మాత్రమే కనిపిస్తారు. వారి చేతులు, వారి బట్టలు బిచ్చగాళ్లలా ఉన్నాయి. కానీ వారు బిచ్చగాళ్ళు కాదు. క్యూబాలో బిచ్చగాళ్ళు లేరు. ఇక్కడ ప్రజలు సులభంగా డబ్బు సంపాదించడానికి బిచ్చగాళ్లలా నటిస్తారు అని అన్నారు. క్యూబాలో అడగకుండానే కారు అద్దాలు శుభ్రం చేసే బిచ్చగాళ్ళు, ప్రజల నుండి వచ్చే డబ్బుతో మద్యం తాగుతారని ఆయన అన్నారు. చెత్త ప్రదేశాల నుండి వస్తువులను తీసుకునే వ్యక్తులను కూడా ఫిటో లక్ష్యంగా చేసుకుని, చెత్త నుండి వస్తువులను తీసి మళ్ళీ అమ్ముతారని అన్నారు. క్యూబాలోని భిక్షాటనదారులపై మంత్రి ఫీటో చేసిన వ్యాఖ్యలపై క్యూబా నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


# కెనడాలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని డిమాండ్..!

**టీపీఎన్, కెనడా :**

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కెనడాలోని ఆల్బెర్టా ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఆల్బెర్టా ప్రీమియర్ డేనియల్ స్మిత్ , ప్రజా భద్రత , అత్యవసర సేవల మంత్రి మైక్ ఎల్లిస్ కూడా బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలన్నారు. ఈ ముఠా కెనడా , ఇతర దేశాలలో నేర కార్యకలాపాలను నిర్వహిస్తోందని.. దీని పరిధి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని వారు ఆరోపించారు.

కెనడాలోని ఆల్బెర్టా ప్రావిన్స్‌లో కూడా లారెన్స్ బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలనే డిమాండ్ తీవ్రమైంది. ఈ ముఠా అంతర్జాతీయంగా విస్తరించి ఉండటం.. కెనడాలో దాని ప్రమాదకరమైన కార్యకలాపాలకు పాల్పడుతోందని తెలిపింది. ఈ గ్యాంగ్ కెనడాలో హింస, దోపిడీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, హత్యలు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడుతోందని ప్రభుత్వం చెబుతోంది.

అంతకుముందు బ్రిటిష్ కొలంబియా ప్రభుత్వం కూడా బిష్ణోయ్ గ్యాంగ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. దోపిడీ , ఇతర నేరాలను ఎదుర్కోవడంలో దర్యాప్తు సంస్థలకు సహాయం చేయడానికి కెనడాలో బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని బ్రిటిష్ కొలంబియా చీఫ్ డేవిడ్ ఎబి అన్నారు . దోపిడీ బెదిరింపులతో పాటు, కాల్పులు, హత్యలకు సంబంధించిన సంఘటనలు తెరపైకి వచ్చాయని ఇవి బ్రిటిష్ కొలంబియాలోనే కాకుండా ఎడ్మంటన్ , బ్రాంప్టన్ వంటి ఇతర నగరాల్లో కూడా జరుగుతున్నాయని ఎబి చెప్పారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బ్రిటిష్ కొలంబియా, ఆల్బెర్టా, ఒంటారియోలోని దక్షిణాసియా సమాజ సభ్యులను లక్ష్యంగా చేసుకుందని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఆల్బెర్టా ప్రీమియర్ డేనియల్ స్మిత్ , ప్రజా భద్రత.. అత్యవసర సేవల మంత్రి మైక్ ఎల్లిస్ కూడా బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ముఠా కెనడా , ఇతర దేశాలలో నేర కార్యకలాపాలను నిర్వహిస్తోందని... దీని పరిధి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని వారు చెబుతున్నారు.



లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనేది కెనడాతో సహా అనేక దేశాలలో హింస, దోపిడీ, హత్యలు , మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి తీవ్రమైన నేరాలలో పాల్గొన్న ఒక అంతర్జాతీయ నేర నెట్‌వర్క్ అని స్మిత్ , ఎల్లిస్ సంయుక్తంగా సోషల్ మీడియాలో తెలిపారు. దీని పరిధి ప్రపంచవ్యాప్తంగా ఉందని.. దీని ఉద్దేశ్యం నేరపూరితం.. హింసాత్మకమైనదిగా అభివర్ణించారు. ఈ ముఠా కార్యకలాపాలకు సరిహద్దులు తెలియవని..ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని ఆల్బెర్టా తెలిపారు.బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తే, అటువంటి నెట్‌వర్క్ కార్యకలాపాలను సమర్థవంతంగా ఆపడానికి వీలుంటుంది. లేకపోతే ప్రాంతీయ ప్రభుత్వాల ఆర్థిక వనరులు సమకూర్చుకుని సాధారణ పౌరుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

**దక్షిణాసియా సమాజంపై ప్రభావం**

ఆల్బెర్టా ,కెనడా అంతటా ఉన్న దక్షిణాసియా సమాజం ఈ ముఠా కార్యకలాపాల వల్ల ప్రభావితమైందని కూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థలు, ముఠాలు హింసాత్మక నేరస్థులని...ప్రజలను లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేయకుండా నిరోధించవచ్చని స్మిత్ , ఎల్లిస్ అన్నారు.

# సూచీలను నడిపించిన పీఎస్‌యూ బ్యాంకు, రియాల్టీ షేర్లు!

**టీపీఎన్, ముంబై :**
దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం మోస్తరు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు రావడంతో ఫ్లాటుగా మొదలైన బెంచ్‌మార్క్ సూచీలు క్రమంగా బలం పుంజుకున్నాయి. మధ్యాహ్ననికి ఇంట్రాడే గరిష్ఠాలకు చేరాయి. ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటం, కార్పొరేట్ ఫలితాలు విడుదలవుతుండటంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టారు. మెటల్స్, డిఫెన్స్ వంటి రంగాల్లో మాత్రం సెలక్టివ్‌గా లాభాలు స్వీకరించారు. పీఎస్‌యూ బ్యాంకు, రియాల్టి రంగాల షేర్లు అదరగొట్టాయి. మొత్తంగా నిఫ్టీ 16, సెన్సెక్స్ 63 పాయింట్ల మేర ఎగిశాయి.
క్రితం సెషన్లో 82,570 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ బుధవారం 82,534 వద్ద మొదలైంది. 82,342 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 82,784 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 63 పాయింట్ల లాభంతో 82,634 వద్ద ముగిసింది. 25,196 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,121 వద్ద కనిష్ఠ, 25,255 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 16 పాయింట్ల లాభంతో 25,212 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 162 పాయింట్లు పెరిగి 57,168 వద్ద స్థిరపడింది.
నిఫ్టీ50లో 20 కంపెనీలు లాభపడగా 29 నష్టపోయాయి. ఎంఅండ్ఎం, విప్రో, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, ఎస్బీఐ టాప్ గెయినర్స్. శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్, సన్ ఫార్మా, సిప్లా, టాటా స్టీల్ అత్యధికంగా నష్టపోయాయి.



పీఎస్‌యూ బ్యాంకు, మీడియా, ఐటీ, రియాల్టి, ఎఫ్ఎంసీజీ, ఆటో, బ్యాంకు, చమురు రంగాల సూచీలు కళకళలాడాయి. మెటల్, హెల్త్‌కేర్, ఫార్మా, తయారీ, కమోడిటీస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల సూచీలు ఎరుపెక్కాయి. ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ బయ్యర్లకు అనుకూలంగా ఉంది. మొత్తం 3018 షేర్లు ట్రేడవ్వగా 1660 లాభపడ్డాయి. 1269 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 78 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 22 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 96, లోయర్ సర్క్యూటును 60 తాకాయి.
డాలరుతో పోలిస్తే రూపాయి 13 పైసలు బలహీనపడి 85.94 వద్ద స్థిరపడింది. రైట్స్ ఇష్యూ ద్వారా ఈఐఎల్ హోటల్స్‌లో ఇండియన్ హోటల్స్ రూ.165 కోట్ల విలువైన 3.30 లక్షల షేర్లను కైవసం చేసుకుంది. రామిన్ఫో కంపెనీకి సుమారు రూ. 14.14 కోట్ల విలువైన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ లభించింది. ట్రెంట్ స్టాక్‌కు మోతీలాల్ ఓస్వాల్ బ్రోకరేజ్ బయ్ రేటింగ్‌ను కొనసాగించింది. టార్గెట్ ధరను రూ. 6,650గా నిర్ణయించింది. ఈ ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర లాభం రూ. 568 కోట్లుగా నమోదైంది. నిరుడు ఇదే సమయంతో పోలిస్తే ఇది 2.4% తగ్గుదల. బజాజ్ ఫైనాన్స్ నికర లాభం 10% పెరిగి రూ. 4,614 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ. 4,196 కోట్లుగా ఉంది. FY26లో బాసెల్ III కంప్లైంట్ అడిషనల్ టైర్ 1, టైర్ 2 బాండ్ల ద్వారా రూ. 20,000 కోట్ల నిధుల సమీకరణకు ఎస్బీఐ బోర్డు ఆమోదం తెలిపింది. మూవీ టికెట్ ధరలను రూ. 200కి పరిమితం చేయాలన్న కర్ణాటక ప్రభుత్వ ప్రతిపాదనతో PVR ఐనాక్స్ షేర్లు 1% కంటే ఎక్కువ పడిపోయాయి.
మూర్తి నాయుడు పాదం



**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**



## 24 గంటల్లో ఐటీఆర్ రీఫండ్

**టీపీఎన్, న్యూఢిల్లీ :**
202425 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు ప్రారంభమైంది. అదే సమయంలో ఆదాయపు పన్ను వెబ్‌సైట్‌లో ITR2, ITR3 ఫారమ్‌లు కూడా యాక్టివేట్ చేయబడ్డాయి. దీని కారణంగా ITR దాఖలు చేసేవారి సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఆదాయపు పన్ను దాఖలు చేసేవారి సంఖ్య పెరుగుతున్న వేగంతో రీఫండ్ కూడా జారీ చేయబడుతోంది. ఈసారి ఆదాయపు పన్ను శాఖ ప్రజలకు వేగంగా రీఫండ్‌లను పంపుతోంది. జీతం పొందే ఉద్యోగులు, వ్యాపారవేత్తల రీఫండ్‌లు వారి ఖాతాలకు వేగంగా జమ అవుతున్నాయి. గతంలో రీఫండ్ రావడానికి 20 రోజుల నుంచి 1 నెల లేదా కొన్నిసార్లు 3 నుండి 4 నెలల సమయం పట్టేది. కానీ ఇప్పుడు రీఫండ్‌లు 24 గంటల్లోపు లేదా గరిష్టంగా 5 నుండి 10 రోజులలోపు వస్తున్నాయి. ఈసారి ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి చివరి తేదీ సెప్టెంబర్ 15. మీరు దీనికి ముందు మీ ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది.

## వేగంగా విస్తరిస్తున్న ఈవీ కార్ల మార్కెట్

**టీపీఎన్, ముంబై :**



భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (EV) మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నది. సరఫరా గొలుసులోని, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌కు సంబంధించిన సమస్యలు సకాలంలో పరిష్కరించగలిగితే 2028 ఆర్థిక సంవత్సరానికి భారత్‌లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 7శాతాన్ని దాటుతుందని ఓ నివేదిక పేర్కొంది. అమెరికన్ ఈవీ కంపెనీ టెస్లా భారత్లోకి ప్రవేశించినట్లు అధికారికంగా ప్రకటించిన కేర్ ఏజ్ అడ్వైజరీ ఈ నివేదికను విడుదల చేసింది. గత కొద్దిరోజులుగా భారత్‌లోని ఎలక్ట్రికల్ కార్ల అమ్మకాల్లో విపరీతంగా పెరుగుతున్నది. 2021 ఆర్థిక సంవత్సరంలో 5వేల యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సంఖ్య 1.07లక్షలు దాటింది.

## ఇన్వెస్టర్స్ అలర్ట్: డిఫెన్స్ షేర్లలో పెట్టుబళ్లు ఉపసంహరించిన MFs




టీపీఎన్, ముంబై : కొన్ని నెలలపాటు దూకుడు కనబర్చిన డిఫెన్స్ కంపెనీల షేర్లు ప్రస్తుతం డీలాపడ్డాయి. గరిష్ఠ స్థాయుల నుంచి పతనమవుతున్నాయి. దిద్దుబాటుకు లోనవుతున్నాయి. జూన్‌లో మ్యూచువల్ ఫండ్స్ తొమ్మిది డిఫెన్స్ స్టాక్స్‌లో మొత్తం రూ. 1,713 కోట్ల విలువైన షేర్లను విక్రయించడం ఇందుకు దోహదం చేసింది. ఇందులో సోలార్ ఇండస్ట్రీస్, జెన్ టెక్నాలజీస్, భారత్ ఫోర్జ్ కంపెనీల షేర్ల అమ్మకాలే ఎక్కువ. ఆపరేషన్ సిందూర్ తర్వాత డిఫెన్స్ రంగంపై ఆశావాదం, నాటో దేశాల డిఫెన్స్ ఖర్చుల పెరుగుదల వల్ల ఈ స్టాక్స్ ఇంతకు ముందే గరిష్ఠాలకు చేరాయి. అధిక వాల్యుయేషన్లు, నష్టభయం కారణంగా సంస్థాగత పెట్టుబడిదారులు వీటి నిష్క్రమిస్తున్నారని తెలిసింది.

**తగ్గిన దూకుడు**
కొన్ని నెలలుగా డిఫెన్స్ స్టాక్స్ బాగా పెరిగాయి. ఇందుకు ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత ప్రభుత్వం డిఫెన్స్ ఖర్చులను పెంచడం, అలాగే నాటో దేశాల డిఫెన్స్ బడ్జెట్‌లు పెరగడం ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఈ రెండు అంశాలు దేశీయ, విదేశీ మార్కెట్‌లలో అవకాశాలను సృష్టించాయి. అయితే ఈ ర్యాలీ వల్ల స్టాక్స్ వాల్యుయేషన్లు చారిత్రక సగటు కన్నా ఎక్కువగా ఉన్నాయని, ఇది పెట్టుబడిదారులకు రిస్క్‌ను సూచిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ అధిక విలువల కారణంగా మ్యూచువల్ ఫండ్‌లు తమ హోల్డింగ్‌లను తగ్గించి, లాభాలను సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయని అంటున్నారు.

**అమ్మిన స్టాక్స్ షేర్ల తగ్గుదల**

**సోలార్ ఇండస్ట్రీస్:**
ఈ కంపెనీ షేర్లు 3.3% తగ్గాయి.
**జెన్ టెక్నాలజీస్:**
షేర్లు 2.9% పడిపోయాయి.
**భారత్ ఫోర్జ్:**
ఈ స్టాక్ కూడా గణనీయమైన విక్రయాలను చూసింది.
**భారత్ డైనమిక్స్:**
మోతీలాల్ ఓస్వాల్ ఈ స్టాక్‌పై 'న్యూట్రల్' రేటింగ్ ఇచ్చింది. దీని ధర రూ.1,893కి పడిపోయింది.
**డేటా ప్యాటర్న్స్, ఆస్ట్రా మైక్రోవేవ్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్:**
ఈ స్టాక్స్ 2.5% కంటే ఎక్కువ తగ్గాయి.
**హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ :**
ఈ షేర్లు 1.9% పడిపోయాయి.
**BEML, పరాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్:**
ఈ రెండు స్టాక్స్ 1.4% చొప్పున తగ్గాయి.
కొంతమంది నిపుణులు డిఫెన్స్ రంగం దీర్ఘకాలంలో ఆకర్షణీయంగా ఉంటుందని, ప్రస్తుత ధరల వద్ద కొత్తగా పెట్టుబడులు పెట్టడంపై జాగ్రత్తగా ఉండాలని సలహా ఇస్తున్నారు. ఏకమొత్తంలో పెట్టుబడుల కంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (SIP) ద్వారా క్రమంగా పెట్టుబడి పెట్టడం మంచిదని సూచిస్తున్నారు. భారత ప్రభుత్వం డిఫెన్స్ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహిస్తూ రూ. 1.05 లక్షల కోట్ల విలువైన ఆర్డర్‌లను ఆమోదించడం ఈ రంగానికి దీర్ఘకాలంలో ఊతమిస్తుందని అంటున్నారు.

## విమానయాన రంగంలోకి జొమాటో సీఈవో

**టీపీఎన్, న్యూఢిల్లీ :**
ఫుడ్ డెలివరీ రంగంలో దూసుకెళ్తున్న జొమాటో సీఈఓ డీపిందర్ గోయల్ ఇప్పుడు పౌర విమానయాన రంగంలోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటికే 'ఎల్ఏటీ ఏరోస్పేస్ పేరుతో ఏవియేషన్ వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన, తాజాగా బాంబర్డియర్ గ్లోబల్ సిరీస్‌కు చెందిన లగ్జరీ ప్రైవేట్ జెట్‌ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ జెట్ జూన్ నెల నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని




వీఐపీ బే వద్ద కనిపిస్తోంది. జులై 16 నుంచి దీని కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు సమాచారం.

## జియో బ్లాక్‌రాక్ పాసివ్ ఫండ్స్‌కు సెబీ ఆమోదం

**టీపీఎన్, ముంబై :**
పాసివ్ ఫండ్లను ఆవిష్కరించేందుకు జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్‌కు సెబీ అనుమతినిచ్చింది. నాలుగు కొత్త పాసివ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌లను ప్రవేశపెట్టడానికి జియో సిద్ధమవుతోంది. ఇప్పటికే కంపెనీ ఈక్విటీ ఫండ్ల ద్వారా భారీగా నిధులు సమీకరించిన సంగతి తెలిసిందే.

**జియో బ్లాక్‌రాక్ పాసివ్ ఫండ్స్**
1.జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్: ఈ ఫండ్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తుంది. ఇది మిడ్‌క్యాప్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టనుంది.
2.జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్: ఈ ఫండ్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్‌ను అనుసరిస్తుంది. ఎన్ఎస్ఈలో టాప్ 50 కంపెనీ తర్వాత ఉన్న 50 కంపెనీల్లో పెట్టుబడికి వీలు కల్పిస్తుంది.
3. జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్: ఈ ఫండ్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తుంది. ఇది చిన్న కంపెనీలలో పెట్టుబడులను లక్ష్యంగా చేసుకుంటుంది.
4. జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ 813 ఇయర్ జిసెక్ ఇండెక్స్ ఫండ్: ఈ ఫండ్ భారత ప్రభుత్వ బాండ్లను ట్రాక్ చేస్తుంది. ఇవి 8 నుంచి 13 సంవత్సరాల మెచ్యూరిటీ కలిగి ఉంటాయి. ఇది డెట్ విభాగంలో స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుంది.

**జియో బ్లాక్‌రాక్ వ్యూహం**
భారత్‌లోని రూ.72.2 లక్షల మ్యూచువల్ ఫండ్ మార్కెట్లో గణనీయమైన వాటా చేజిక్కించుకోవాలని జియో బ్లాక్‌రాక్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఒక ప్రత్యేకమైన వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఈ సంస్థ తమ డిజిటల్‌ఫస్ట్ విధానంతో, జియో భారీ డిజిటల్ నెట్‌వర్క్, బ్లాక్‌రాక్ అలాడిన్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి తక్కువ ఖర్చుతో కూడిన పెట్టుబడి ఎంపికలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
జియో బ్లాక్‌రాక్ ఫండ్‌ల ఎక్స్‌పెన్స్ రేషియో ఇండస్ట్రీ సగటు కన్నా తక్కువగా ఉంటుందని, కొన్ని సందర్భాల్లో 0.05% వరకు తగ్గవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇది సంప్రదాయ మ్యూచువల్ ఫండ్‌లతో పోలిస్తే చాలా తక్కువ. రిటైల్ ఇన్వెస్టర్లను ఇది ఆకర్షించే అవకాశాలు ఉన్నాయి
జియో బ్లాక్‌రాక్ ఇప్పటికే జూన్ 30 నుంచి జులై 2, 2025 వరకు ఓపెన్ చేసిన మూడు డెట్ ఆధారిత న్యూ ఫండ్ ఆఫర్‌ల (NFOs) ద్వారా 17,800 కోట్ల రూపాయలను సేకరించింది. ఇవి జియో బ్లాక్‌రాక్ లిక్విడ్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ మనీ మార్కెట్ ఫండ్, మరియు జియో



## ఈ స్టాక్స్ కొంటే సేఫ్ జోన్!

**టీపీఎన్, ముంబై :**
భారత స్టాక్ మార్కెట్లు బుధవారం మోస్తరుగా లాభపడ్డాయి. నిఫ్టీ 16, సెన్సెక్స్ 63 పాయింట్ల మేర ఎగిశాయి. పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగ షేర్లు అదరగొట్టాయి. మార్కెట్ పరిస్థితులను అనుసరించి ఈ స్టాక్స్‌ను ఇన్వెస్టర్లు పరిశీలించొచ్చు.

**స్టాక్ రికమెండేషన్స్**

LIC HFL
LIC HOUSING FINANCE LTD

**ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్:**
ఈ స్టాక్ హౌసింగ్ ఫైనాన్స్ రంగంలో బలమైన పనితీరును కనబరుస్తోంది. ఇటీవలి కన్సాలిడేషన్ ఫేజ్ తర్వాత బలమైన బ్రేకౌట్ సంకేతాలను చూపుతోంది. బుధవారం 2.9% లాభంతో రూ.637 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు రూ.655 ₹665 టార్గెట్ ధరతో రూ. 630 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. రూ.610 వద్ద స్టాప్‌లాస్ ఉంచుకోవాలి.

STAR Personal & Caring | Health Insurance

**స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్:**
హెల్త్‌కేర్ రంగంలో డిమాండ్ పెరుగుదల, కంపెనీ బలమైన పోర్ట్‌ఫోలియో ఈ స్టాక్‌ను ఆకర్షణీయంగా మారుస్తోంది. బుధవారం రూ.439 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.440 శ్రేణిలో అక్యూములేట్ చేసుకోవాలి. రూ.475500 వరకు టార్గెట్ పెట్టుకోవచ్చు. మీ నష్టభయానికి అనుగుణంగా స్టాప్‌లాస్ ఎంచుకోవచ్చు.

UB
UNITED BREWERIES LIMITED

**యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్:**
మున్ముందు ఫెస్టివ్ సీజన్ మొదలవుతుండటం, మెరుగైన ఫలితాలు ఉంటాయన్న ఉద్దేశంతో ఇన్వెస్టర్లు దీనిపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ షేర్లు బుధవారం రూ.2009 వద్ద ముగిశాయి. ఈ కౌంటర్లో రూ.2250 టార్గెట్ ధరతో రూ.2000 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. కొన్ని రోజుల వరకు హోల్డ్ చేయాలి. రూ.1920 వద్ద దీనికి కీలక మద్దతు ఉంది.

INDIA
CREATING WEALTH FOR WELLBEING

**ఎన్ఎల్‌సీ ఇండియా:**
బుధవారం రూ.238 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో రూ.230 శ్రేణిలో ప్రవేశించాలి. బయ్ ఆన్ డిప్స్ మెథడ్ అనుసరించాలి. ఎనర్జీ రంగంలో బలమైన డిమాండ్, కొత్త బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులు (250 MW/500 MWh) ఈ స్టాక్‌ను ఆసక్తికరంగా మార్చాయి. టార్గెట్ ధర ₹265 ₹270. స్టాప్‌లాస్: ₹220.

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా:**




ఇందులో వీసీపీ ప్యాటర్న్ కనిపిస్తోంది. రూ.20వేల కోట్లు సమీకరించాలన్న నిర్ణయం, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్ పెరుగుతుండటం సానుకూల అంశాలు. బుధవారం రూ.831 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.880 టార్గెట్ ధరతో రూ.800/820 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి.



**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**


# ఇలాంటి మెసేజ్, కాల్స్ వస్తున్నాయా?



ప్రజంట్ ఉన్న పరిస్థితుల్లో టెక్నాలజీ ఎంతగా పెరిగిందో.. దానికి తగ్గట్లుగా డిజిటల్ క్రైమ్స్ కూడా పెరిగాయి. ఈ క్రమంలో ఎంతోమంది అమాయకులు సైబర్ క్రైమ్స్ చేసే వ్యక్తుల వలలో చిక్కుకుని బాధపడుతున్నారు. ఈ డిజిటల్ రంగం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరాలూ అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త మోసంతో లూటీకి తెగబడుతున్నారు. ఆఫర్ల పేరుతో ఆశచూపించో, డిజిటల్ అరెస్టుల పేరుతో కాల్స్ అండ్ మెసేజ్‌లతో బెదిరించో రూ.కోట్ల రూపాయల్లో కొల్లగొడుతున్నారు. ఈ మధ్యన కేవైసీ ఎక్స్ పైర్, గ్యాస్, విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి అనుమానాస్పద కాల్ గానీ మెసేజ్ గానీ వస్తే గనక వెంటనే చక్షు పోర్టల్ లో కంప్లైంట్ చేయాలి. ఎందుకంటే మీకొచ్చిన మోసపూరిత కాల్, మెసేజ్ లేదా వాట్సప్ మెసేజ్ లు ఇందులో కంప్లైంట్ చేయడం ద్వారా ఈ తరహా నేరాలను అడ్డుకోవచ్చు. కాబట్టి KYC గడువు ముగిసింది.. అప్‌డేట్ చేసుకోవాలనో, బ్యాంకు ఖాతా, సిమ్ అప్‌డేట్ పేరుతోనో, గ్యాస్ లేదా విద్యుత్తు కనెక్షన్ల పేరుతోనో, ప్రభుత్వ అధికారుల్లా నటించో, లైంగిక వేధింపుల పేరుతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ కేటుగాళ్లపై ఈ పోర్టల్ లో ఫిర్యాదు చేయవచ్చని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టింది. సంబంధిత వెబ్‌సైట్ లో మూడు అంచెల్లో ఈ తరహా మోసాలపై ఫిర్యాదు చేయొచ్చని సూచించింది. కాగా ఈ క్రమంలో మీరు చేయాల్సి మొట్టమొదటి పని సంచార్ సాథీ పోర్టల్ https://sancharsaathi.gov.in/sfc/ ను విజిట్ చేయాలి. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై కాల్, ఎస్సెమ్మెస్, వాట్సప్ ద్వారా అనుమానిత మోసపూరిత మెసేజ్ లపై ఇక్కడ రివ్యూ చేయొచ్చు. ఒకవేళ ఇప్పటికే సైబర్ మాయగాళ్ల వలకు చిక్కి డబ్బు కోల్పోయినట్లయితే.. హెల్ప్‌లైన్ నంబర్ 1930 లేదా వెబ్‌సైట్ https://www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలి. ఆర్థిక మోసాలు, సైబర్ క్రైమ్ కేసులు చక్షు పరిధిలోకి రావు. ఇక మరోక ముఖ్యమైన స్టెప్ ఏంటంటే.. మీకు వచ్చిన మోసపూరిత ఫోన్‌కాల్, వాట్సప్ మెసేజ్ వంటి వివరాలు, వచ్చిన తేదీ, సమయాన్ని పోర్టల్‌లో నమోదు చేయాలి. వాటిని స్క్రీన్‌షాట్ తీసి ఆ ఫైల్‌ని అప్‌లోడ్ చేయాలి. ఇక చివరగా మీ పేరు, ఫేక్ మెసేజ్ వచ్చిన ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే మీకు ఒక ఓటీపీ వస్తుంది. చివరగా క్యాప్చా కోడ్ ని ఎంటర్ చేస్తే కంప్లైంట్ ఫైల్ అవుతుంది. ఈ విధంగా సైబర్ నేరాలను అరికట్టవచ్చు. అయితే మీరు ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా కూడా సైబర్ నేరగాళ్లు మిమ్మల్ని బెదరించి డబ్బును మాయం చేసే విధంగా ప్రవర్తిస్తారు. కాబట్టి అలాంటి వారికి మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడకుండా ధైర్యంగా ఈ విధంగా కంప్లైంట్ చేయండి. అంతేకాకుండా ఇంకా ఎక్కువగా బెదిరింపు కాల్స్, మెసేజ్ లు వస్తే కనుక వెంటనే మీ దగ్గర్లోని పోలీస్ స్టేషన్ లో సైబర్ డిపార్ట్ మెంట్ లో కంప్లైంట్ చేయండి.

# అమ్మాయితో పాటు ఆనందం వచ్చింది: కియారా






అమ్మవడం ప్రతి అమ్మాయి జీవితంలో ఓ మధురమైన ఘట్టం. తమకు బిడ్డ పుట్టిన ఆ క్షణం ప్రపంచాన్నే జయించినంతగా ఆనందపడిపోతారు తల్లిదండ్రులు. ఈ లిస్ట్ లోకి బాలీవుడ్ క్యూట్ కపుల్ కియారా అద్వాణీసిద్ధార్థ్ మల్హోత్రా కపుల్స్ కూడా యాడ్ అయ్యారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ఈ జంటకు ఆడపిల్ల పుట్టింది. ఇలా తమ లిటిల్ ఏంజెల్ రాకను ఓ ప్రత్యేక పోస్ట్ రూపంలో సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది వైరలవుతోంది. బాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ కపుల్‌గా పిలుచుకునే కియారాసిద్ధార్థ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో తమ ప్రెగ్నెన్సీ విషయాన్ని బయటపెట్టారు. అప్పట్నుంచి వీలైనంత వరకు కెమెరా కంటికి దూరంగా ఉంటూ ప్రైవసీని కొనసాగిస్తోన్న ఈ జంట.. రీసెంట్ గా పేరెంట్స్ అయ్యారు. కియారాకు పండంటి ఆడపిల్ల పుట్టింది. అంతేకాదు నార్మల్ డెలివరీ ద్వారా బిడ్డను ప్రసవించిందట. ఈ పోస్ట్ లో మా హృదయాలు సంతోషంతో నిండిపోయాయి.. మా ప్రపంచం మారిపోయింది.. మాకు ఆడపిల్ల పుట్టింది.. మా ఇంట్లో ఆనందం తెచ్చింది.. అంటూ పింక్ థీమ్‌తో కూడిన గ్రీటింగ్ కార్డుపై రాసి.. ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇటు సెలబ్రిటీలు, అటు నెటిజన్లు ఈ న్యూ పేరెంట్స్‌కు విషెస్ చెబుతున్నారు. ఇక కియారా తనకు కవలలు పుట్టాలనుంది అంటూ ఓ సందర్భంలో తన మనసులోని ఇష్టాన్ని బయటపెట్టింది. నాకు కవల పిల్లలంటే చాలా ఇష్టం. ఒకే కాన్పులో ఓ పాప, బాబు ఇద్దరూ పుట్టాలనుంది. ఇలా ఇద్దరు పిల్లలతో మా కుటుంబం పరిపూర్ణమవుతుంది. అలాగని మనం అనుకున్నది జరగాలనీ లేదు. కాబట్టి ఎవరు పుట్టినా సరే.. ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నా.. అందీ కియారా. అయితే సిద్ధార్థ్ తల్లి రిమ్మా మల్హోత్రా మాత్రం తమ కొడుకు, కోడలికి ఆడపిల్లే పుట్టాలని బలంగా అనుకుందట. అమ్మను కదా.. కుటుంబంలో ఓ ఆడపిల్ల ఉంటే ఆ కళే వేరు. అందుకే నా కొడుకుకోడలికి అమ్మాయే పుట్టాలని ఉంది.. అంటూ తన మనసులోని మాటను రీసెంట్ గా ఓ సందర్భంలో బయటపెట్టారామె. అనుకున్నట్లుగానే తమ ఇంటికి మహాలక్ష్మి రావడంతో పట్టలేనంత సంతోషంలో మునిగిపోయారు రిమ్మా. బంధువులు, స్నేహితులను పిలిచి పార్టీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారామె. ఇక ప్రెగ్నెన్సీ డైట్, మెటర్నిటీ ఫొటోషూట్.. విషయంలో కూడా కియారా చాలా క్లియర్ గా ఉన్నారు. తాను గర్భం ధరించానని, త్వరలోనే అమ్మను కాబోతున్నానని ప్రకటించిన మరుక్షణం నుంచే ఈ విషయంలో ఎంతో ప్రైవసీని మెయింటెయిన్ చేసింది. అయితే ఈ ఏడాది మెట్ గాలా ఈవెంట్‌లో తొలిసారి పాల్గొన్న కియారా.. ఆ వేదికపై అమ్మతనాన్ని ప్రతిబింబించే అవుట్‌ఫిట్ లో మెరిసిపోయింది. గర్భంలో ఎలాగైతే తల్లీబిడ్డలు బొడ్డుతాడుతో అనుసంధానమై ఉంటారో.. అదే థీమ్‌ను కియారా తన డ్రస్ తో ప్రజంట్ చేసింది. ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన ఈ మోడ్రన్ డ్రస్.. మెట్ గాలాలోనే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది.



# వైరల్.. రోడ్డు మధ్య కరెంట్ పోల్స్


మీరెప్పుడైనా రోడ్డు మధ్యలో కరెంట్ పోల్స్ ని చూశారా.. సాధారణంగా ఎక్కడైనా సరే రోడ్డుకు ఇరువైపులా కరెంట్ పోల్స్ ఉండటం చూస్తాం. కానీ ఈ వీడియోలో మాత్రం కరెంట్ పోల్స్ సరిగ్గా రోడ్డు మధ్యలో ఉన్నాయి. మరెందుకు ఇలా ఉన్నాయి అంటారు ఇప్పుడు తెలుసుకుందాం.. సరైన రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అక్కడి ప్రభుత్వం రోడ్డు మంజూరు చేసింది. అధికారులు పనులు చేపట్టారు. కొన్ని రోజులకు రోడ్డు పూర్తి అయ్యింది. అయితే నిర్మాణాన్ని చూసిన వారంతా షాకయ్యారు. ఇదేంటి రోడ్డు ఇలా కూడా వేస్తారా అని ముక్కున వేలేసుకున్నారు. ఎందుకంటే కరెంట్ పోల్స్ మధ్యలో రోడ్డు వేసినట్లుగా ఉంది అది. రోడ్డు మధ్యలో కరెంట్ పోల్స్ ఉంటే ఎలా వెళ్తారని స్థానికులు ప్రశ్నించినా స్పందించేవారే లేరు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లో జరిగింది. సిర్మౌర్ జిల్లాలోని బద్రీపూర్, కిషన్‌పురా, సంతోఖ్‌గఢ్ పురువాలాల గ్రామాలను కలుపుతూ ఈ రోడ్డు వేశారు. రోడ్డు వేసేటప్పుడు కరెంట్ పోల్స్ తియ్యకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా నిలుస్తుంది. ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ దీన్ని వీడియో తీసి పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో వారెవ్వా.. ఏం తెలివి.. రోడ్డు సూపర్ వేశారు. మందు తాగిన వ్యక్తులు రోడ్డును చూడకపోయిన కరెంట్ పోల్స్‌ను చూస్తారు. నిజంగా అద్భుతం. ఈ రోడ్డు హిమాచల్ టూరిజాన్ని పెంచుతుంది అంటూ సెటైర్లు వేశాడు. ఈ అంశంపై మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే సుఖ్ రామ్ చౌదరి స్పందించారు. విద్యుత్ లైన్ కనీసం 25 ఏళ్ల పాతదని.. రోడ్డు విస్తరణ ప్రాజెక్టు ప్లాన్ చేసినప్పుడు.. అధికారులు విద్యుత్ లైన్‌ను కూల్చివేయాలని ఆలోచించలేదని తెలిపారు. అధికారులు పోల్స్ మధ్య నుంచే రోడ్డు వేసుకుంటూ వెళ్లారు. ఈ స్తంభాలను మార్చమని నేను సంబంధిత శాఖను అభ్యర్థించాను. అయితే దీన్ని తీయడానికి నిధులు లేవని అధికారులు చెప్పినట్లు వివరించారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. ఇంజినీర్ల అద్భుతం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం, ఇండియన్ ఇంజినీర్లు అంటేనే ఇలా ఉంటారు, శిమ్లా తర్వాత ఈ రోడ్డు టూరిస్ట్ స్పాట్‌గా మారుతుంది అంటూ నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు. గతంలో బీహార్‌లోనూ ఇటువంటి ఘటనే జరిగింది. పాట్నా నుండి 50 కి.మీ దూరంలో ఉన్న జెహనాబాద్ లో జిల్లా యంత్రాంగం రూ. 100కోట్ల రోడ్డు విస్తరణ ప్రాజెక్టును చేపట్టింది. చెట్లను తొలగించడానికి అటవీ శాఖను సంప్రదించగా.. వాళ్లు ఒప్పుకోలేదు. చెట్లను కొట్టేసే భూమికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. దీంతో అధికారులు చెట్ల మధ్య నుంచే రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. అప్పట్లో ఇది దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడు హిమాచల్‌లోనూ అటువంటి ఘటనే చోటుచేసుకోవడం గమనార్హం.

# ఐఫోన్ పై 16 పై బిగ్గెస్ట్ డిస్కౌంట్



యాపిల్ ఐఫోన్ 16 స్మార్ట్ ఫోన్ కొనాలని వెయిట్ చేస్తున్న వారికి ఫ్లిప్ కార్ట్ గోట్ సేల్ సూపర్ గుడ్ న్యూస్ చెబుతుంది. యాపిల్ లేటెస్ట్ ఫోన్ సిరీస్ ఐఫోన్ 16 సిరీస్ సెండ్ బేసిక్ ఫోన్ ఐఫోన్ 16 ఫోన్ గొప్ప కెమెరా అండ్ లేటెస్ట్ A18 బయోనిక్ చిప్ వంటి ప్రీమియం ఫీచర్స్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ ను ఫ్లిప్ కార్ట్ నుంచి డిస్కౌంట్ ధరకే అందుకోవచ్చు. యాపిల్ ఐఫోన్ 16 ఫోన్ యొక్క మూడు వేరియంట్స్ పై కూడా ఈ బిగ్ డిస్కౌంట్ ఆఫర్ అందించింది. ఐఫోన్ 16 ఫోన్ కంపెనీ వెబ్సైట్ నుంచి రూ. 79,990 ధరతో సేల్ అవుతుంటే, ఫ్లిప్ కార్ట్ నుంచి రూ. 10,000 రూపాయల భారీ డిస్కౌంట్ తో కేవలం రూ. 69,990 ధరతో సేల్ అవుతోంది. ఈ ఫోన్ యొక్క 256 జీబీ వేరియంట్ రూ. 79,999 ధరతో అండ్ హై ఎండ్ 512 జీబీ వేరియంట్ రూ. 99,999 ధరలో లభిస్తుంది. అంటే, అన్ని వేరియంట్స్ పైన కూడా 10 వేల రూపాయల తగ్గింపు అందించింది. ఇది కాకుండా ఈ ఫోన్ పై రూ. 2,000 అదనపు డిస్కౌంట్ కూపన్ లేదా క్యాష్ బ్యాక్ డిస్కౌంట్ కూడా ఫ్లిప్ కార్ట్ ఆఫర్ చేస్తోంది. అదనంగా, ఈ ఫోన్ స్టార్టింగ్ 128 జీబీ వేరియంట్ పై రూ. 3000 రూపాయల అదనపు బ్యాంక్ డిస్కౌంట్ ఆఫర్ కూడా అందించింది. ఈ ఫోన్ ను యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ నాన్ ఈఎంఐ ఆప్షన్ తో తీసుకునే వారికి ఈ అదనపు డిస్కౌంట్ లభిస్తుంది. అంటే, ఈ ఫోన్ పై టోటల్ 15,000 రూపాయల తగ్గింపు లభిస్తుంది. ఈ ఆఫర్ తో ఈ ఫోన్ ను కేవలం రూ. 64,990 రూపాయల అతి తక్కువ ధరకు అందుకోవచ్చు. యాపిల్ ఈ ఫోన్ ను A18 చిప్ తో అందించింది అండ్ ఈ ఫోన్ 128 జీబీ, 256 జీబీ మరియు 512 జీబీ స్టోరేజ్ తో లభిస్తుంది. ఈ ఫోన్ iOS 18 తో నడుస్తుంది అండ్ యాపిల్ ఇంటెలిజెన్స్ తో వస్తుంది. ఈ ఫోన్ 6.1 ఇంచ్ సూపర్ రెటినా XDR డిస్ప్లే కలిగి ఉంటుంది. ఈ డిస్ప్లే డైనమిక్ ఐల్యాండ్, హ్యాప్టిక్ టచ్, 2000 నిట్స్ పీక్ బ్రైట్నెస్ తో పాటు రిజల్యూషన్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ లో గొప్ప కెమెరా సిస్టం మరియు ప్రత్యేకమైన యాక్షన్ బటన్ కూడా కలిగి ఉంటుంది. ఈ ఫోన్ లో 48MP ఫ్యూజన్ మరియు 12MP అల్ట్రా వైడ్ కెమెరాలు కలిగిన డ్యూయల్ రియర్ మరియు ముందు 12MP ట్రూ డెప్త్ సెల్ఫీ కెమెరా కలిగి ఉంటుంది. ఈ ఫోన్ 4x ఆప్టికల్ జూమ్ రేంజ్, స్మార్ట్ HDR 5 మరియు 60 FPS వద్ద 4K Dolby Vision వీడియో రికార్డ్ సపోర్ట్ కలిగి ఉంటుంది. యాపిల్ ఐఫోన్ 16 లో 27 వీడియో ప్లే బ్యాక్ అందించే పవర్ ఫుల్ బ్యాటరీ ఉంటుంది. ఈ ఫోన్ ఎమర్జెన్సీ SOS మరియు క్రాష్ డిటెక్షన్ వంటి స్పెషల్ ఫీచర్ కూడా కలిగి ఉంటుంది.

# రోబోలకు ఫిజికల్ టచ్?



రోబోలకు కూడా మనుషుల్లాగే స్పర్శ అనుభూతి వస్తే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి. ఊహించడం ఎందుకు రోబో సినిమాలో చిట్టి రోబో విషయంలో డైరెక్టర్ శంకర్ కళ్లకు కట్టినట్లు చూపించారు. అది సినిమా కాబట్టి సరిపోయింది. మరి రియల్ లైఫ్ లో నిజంగానే రోబోస్ కి ఫిజికల్ టచ్ అండ్ ఎమోషన్స్ వస్తే ఇంకేమైనా ఉందా.. అది ఈరోజు కాకున్నా.. రేపైనా ఖచ్చితంగా మానవ జాతికి ప్రమాదమే కదా. అయితే ఇప్పుడు టెక్నాలజీ విపరీతంగా పెరుగుతున్న క్రమంలో సైంటిస్టులు మరిన్ని టెక్నాలజీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్స్ ను చేపడుతున్నారు. ఈ క్రమంలోనే యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి అండ్ యూనివర్సిటీ కాలేజ్ లండన్ శాస్త్రవేత్తలు కలిసి రూపొందించిన కొత్త ఎలక్ట్రానిక్ చర్మం రోబోలకు ఫిజికల్ టచ్ కలను సాకారం చేస్తోంది. జెలటిన్ ఆధారిత పదార్థంతో తయారైన ఈ చర్మం చాలా మృదువుగా ఉంటుంది. ఇది విద్యుత్ ను వాహకంగా ఉపయోగించుకుంటూ బయటి ప్రేరేపకాలను గుర్తించగలదు. దీనిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎలక్ట్రోడ్లు అనుసంధాన మార్గాల ద్వారా స్పర్శల్ని, ఉష్ణోగ్రత మార్పులను, తట్టడాన్ని, మరియు చివరికి నొప్పిని కూడా గుర్తించగలవు. ఈ ఎలక్ట్రానిక్ చర్మంలో అమర్చిన గ్రాహకాలు భౌతిక సంకేతాలను సేకరించి, వాటిని విద్యుత్ సంకేతాలుగా మార్చుతాయి. ప్రయోగాల్లో ఇది 8.6 లక్షల విద్యుత్ మార్గాల ద్వారా వచ్చిన 17 లక్షల సమాచార భాగాలను సరిగ్గా గుర్తించి ప్రాసెస్ చేసింది. ఈ ఆధారంగా శాస్త్రవేత్తలు ఒక ప్రత్యేకమైన మెషిన్ లెర్నింగ్ మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఈ మోడల్ సహాయంతో రోబోలు తమపై జరిగిన స్పర్శలను అర్థం చేసుకుని, తగిన చర్యలు తీసుకునే సామర్థ్యాన్ని పొందాయి. ఇది కేవలం రోబోలకు అనుభూతిని ఇచ్చే పరిధిలో మాత్రమే కాకుండా, ఆర్టిఫియల్ అవయవాల అభివృద్ధిలోనూ కీలకపాత్ర పోషించనుంది. ఈ చర్మాన్ని కృత్రిమ చేతులపై అమర్చడం ద్వారా అవయవాలు పొందిన వ్యక్తులు తిరిగి స్పర్శను అనుభవించే అవకాశముంది. ఇది నూతన ఆశలకూ, జీవన నాణ్యత పెంపుకూ దారితీసే పరిణామం. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ మానవ యాంత్రిక సంబంధాలలో కొత్త పరిణామాన్ని అందించనుంది.




# మాంచెస్టర్ టెస్టు ముందు టీమిండియా ఛాలెంజెస్

ఇంగ్లాండ్ పర్యటనలో థర్డ్ టెస్టుకి అసలైన ట్విస్టులు ఏంటో అభిమానులు రుచి చూశారు. ఇంగ్లాండ్, భారత్ టీమ్ ప్లేయర్స్ ఎమోషన్స్ తీవ్రస్థాయికి చేరాయి. ఇదే సీరియస్ నెస్ సిరీస్ ఆసాంతం కంటిన్యూ అవుతుందని అనడంలో సందేహం లేదు. సరిగ్గా వారం రోజుల తర్వాత మాంచెస్టర్ వేదికగా నాలుగో టెస్టు జరగనుంది. టీమిండియా సిరీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిందే. మరి మన జట్టు ముందున్న ఛాలెంజెస్ ఏంటో చూద్దాం. ఫైనల్ టీమ్ వషయంలో భారత్ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరీ ముఖ్యంగా కరుణ్ నాయర్‌ను కంటిన్యూ చేయడంపై మళ్లీ ఆలోచించాల్సిందే. క్రికెట్ లో అదరగొట్టాడని తీసుకొచ్చి మరీ అవకాశాలు ఇచ్చినా.. అతడు మాత్రం వాటిని నిలబెట్టుకోవడంలో తడబాటుకు గురవుతున్నాడు. స్టార్టింగ్ లో కాన్ఫిడెంట్ గానే ఇన్నింగ్స్ ను ప్రారంభిస్తున్నప్పటికీ దానిని కొనసాగించలేక పెవిలియన్ కు చేరిన సందర్భాలను చూశాం. సాయి సుదర్శన్ విషయంలో ఒక్క మ్యాచ్‌తోనే పక్కనపెట్టిన మేనేజ్‌మెంట్.. మూడు మ్యాచుల్లోనూ కనీసం హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయిన కరుణ్ పై వేటు వేయడం ఖాయమనే వాదనా ఉంది. మూడో టెస్టులో టీమిండియా ఓటమికి మెయిన్ రీజన్.. ఇంగ్లాండ్ బ్యాటర్లు ఎనిమిదో వికెట్ కు ఏకంగా 84 పరుగులను యాడ్ చేయడమే. టాప్, మిడిలార్డర్‌ను త్వరగానే పెవిలియన్ కు చేరుస్తున్నప్పటికీ లోయర్ ఆర్డర్ పై ఇండియన్ బౌలర్లు కాస్త కనికరం చూపిస్తున్నట్లుంది. మాంచెస్టర్ లో ఇంగ్లాండ్ లోయర్ ఆర్డర్ పని పడితేనే విజయం టీమిండియా సొంతమవుతుంది. ఆ బాధ్యతను స్పిన్ ఆల్ రౌండర్లు తీసుకోవడం బెటర్. స్పిన్ బౌలింగ్ లో షాట్లు కొట్టేందుకు ప్రయత్నించి వికెట్లు సమర్పించే అవకాశం లేకపోలేదు. భారత జట్టు బ్యాటర్లు మొదటి ఇన్నింగ్స్ లో బాగా ఆడతారు. అదేంటో రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి మాత్రం ఒత్తిడికి గురికావడం తరచూ చూస్తున్నాం. ఫస్ట్ టెస్టులో అలానే ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు మూడో టెస్టులోనూ సేమ్ రిజల్ట్. కానీ, టాప్ ఆర్డర్ లో మరొక బ్యాటర్ నిలిచినా ఫలితం మనకు అనుకూలంగా వచ్చేది. దారుణమైన షాట్ కు గిల్ ఔట్ కాగా.. మంచి బంతికే గిల్ పెవిలియన్‌కు చేరాడు. రిషభ్ పంత్ గాయపడటం నష్టం చేసింది. ఇక్కడే భారత మేనేజ్‌మెంట్ కాస్త తెలివిగా వ్యవహరించి ఉంటే బాగుండేది. లార్డ్స్ లో భారత్ లక్ష్య ఛేదనకు దిగినప్పటినుంచి ఇంగ్లాండ్ క్రికెటర్స్ బాడీ లాంగ్వేజ్ మారిపోయింది. నాలుగో రోజు ఆఖర్లో ఆకాశ్‌దీప్‌పై కార్స్ మాటల యుద్ధం.. దానికి ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వత్తాసు పలుకుతూ చప్పట్లు కొట్టడం ఇలాంటి ఘటనలు మొదలయ్యాయి. ఇక ఐదోరోజు భారత్ ముందు కేవలం 135 పరుగులు ఉండటంతో ఇంగ్లాండ్ ప్లేయర్లు మరింత చెలరేగిపోయారు. పంత్ విషయంలో ఆర్చర్, తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి విషయంలో హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ ఐపీఎల్ కామెంట్స్ తో రెచ్చగొట్టారు. రవీంద్ర జడేజాను ఇంగ్లాండ్ ఆటగాళ్లు నిన్ను భారత మేనేజ్‌మెంట్ సరిగ్గా చూసుకోవడం లేదు. నువ్వు ఎన్ని చేసినా వృథా. నీకు విలువ లేదు అని ఊరించారు. ఇలాంటప్పుడే భారత జట్టులో విరాట్ కోహ్లీ ఉండుంటే బాగుండని చాలామందికి అనిపించింది. ప్రత్యర్థిపై మాటల యుద్ధం చేయడంలో అతడెప్పుడూ ముందుంటాడు. ఈ విషయంలో ప్రస్తుతం గిల్ సేన కూడా మెరుగుకావాల్సిందే. మాటకు మాట సంధిస్తేనే ప్రత్యర్థి ఇంగ్లాండ్ ప్లేయర్లు వెనక్కి తగ్గుతారు. అదే సమయంలో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేయాలి. మూడో టెస్టులో భారత్ ఓటమి అంతరం 22 పరుగులు. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా, ఇంగ్లాండ్ సమంగా స్కోరు చేశాయి. కానీ, భారత్ ఇచ్చిన ఎక్స్‌ట్రాలు 31. అదే ఇంగ్లాండ్ కేవలం 12 మాత్రమే ఇచ్చింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 192 పరుగులు చేయగా.. ఇందులో 32 అదనపు పరుగుల రూపంలోనే వచ్చాయి. ఇక మాంచెస్టర్ టెస్టులో మరోసారి ఆ తప్పుల్ని రిపీట్ చేయకుండా ఉంటేనే సిరీస్ రేసులో టీమిండియా నిలిచేది.

# సీక్రెట్ గా గిల్ డ్రెస్సింగ్ రూమ్ లోకి సారా








టీమిండియా యంగ్ బ్యాటర్, నయా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రజంట్ ఇంగ్లాండ్ తో జరుగుతున్న సిరీస్ లో రన్స్ టాలెంట్ చూపిస్తున్నారు. మొదటి రెండు సిరీస్ లలో తన హవా చూపించాడు. ఇందులో రెండు సెంచరీలు, ఓ డబుల్ సెంచరీలు ఉన్నాయి. లీడ్స్ లో సెంచరీ, బర్మింగ్ హామ్ లో సెంచరీ, డబుల్ సెంచరీ బాదాడు. దీంతో రాహుల్ ద్రావిడ్ 23 ఏళ్ల రికార్డ్ బ్రేక్ అయ్యింది. ఇంగ్లాండ్ లో ఒక టెస్ట్ సిరీస్ లో అత్యధిక పరుగులు సాధించిన భారత ఆటగాడిగా గిల్ రికార్డులకెక్కాడు. కానీ లార్డ్స్ వేదికగా జరిగిన మూడవ టెస్ట్ లో మాత్రం డిజాస్టర్ ప్రజంటేషన్ చేశాడు. అయితే ఇంగ్లాండ్ సిరీస్ నేపథ్యంలో ప్రస్తుతం గిల్ లండన్ లో ఉన్నాడు. మూడవ టెస్ట్ కి ముందు మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ లండన్ లో ఓ పార్టీ ఇచ్చాడు. ఈ పార్టీకి టీమిండియా క్రికెటర్లతో పాటు మాజీలు కూడా హాజరయ్యారు. క్రికెట్ గాడ్ సచిన్ టెండుల్కర్ ఈ పార్టీకి ప్రత్యేకంగా హాజరయ్యాడు. సచిన్ తో పాటు ఆయన భార్య అంజలి, కూతురు సారా కూడా వచ్చారు. అదే పార్టీలో గిల్ కూడా ఉండడంతో ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే చాలాకాలంగా సచిన్ టెండూల్కర్ కూతురు సారా టెండూల్కర్ తో గిల్ లవ్ స్టోరీ నడిపిస్తున్నాడని రూమర్స్ స్ప్రెడ్ అవుతున్న విషయం తెలిసిందే. గిల్ ఆడే మ్యాచ్ లకు స్టేడియంలో సారా హాజరు కావడం, అతడి బ్యాటింగ్ టైంలో చెప్పట్లు కొడుతూ ఆమె ఎంకరేజ్ చేయడం అప్పట్లో వైరల్ గా మారింది. అలాగే ప్రైవేట్ ప్రోగ్రామ్స్ లో వీరిద్దరూ సీక్రెట్ గా కలుసుకోవడం, గిల్ సోదరితో సారా టెండూల్కర్ నైట్ పార్టీలకు వెళ్లిన వీడియోలు.. గిల్, సారా టెండూల్కర్ డేటింగ్ రూమర్స్ కి బలం చేకూర్చాయి. అయితే ఈ రూమర్స్ పై ఇప్పటివరకు అటు టెండూల్కర్ ఫ్యామిలీ కానీ.. గిల్ కుటుంబం కాని రెస్పాండ్ కాలేదు. రీసెంట్ గా యువరాజ్ సింగ్ ఇచ్చిన పార్టీకి హాజరైన టీమిండియా క్రికెటర్లు రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, గిల్, రిషబ్ పంత్.. పక్క పక్కనే కూర్చున్నారు. వీరు కూర్చున్న టేబుల్ కి కొంత దూరంలోనే సచిన్ టెండూల్కర్ ఆయన కుటుంబంతో కూర్చున్నాడు. అదే సమయంలో గిల్ అటువైపుగా చూసి నవ్వాడు. దీంతో రవీంద్ర జడేజా కళ్ళు ఎగరేస్తూ ఓ రకమైన ఎక్స్ప్రెషన్స్ ఇస్తూ ఏదో అనడంతో.. గిల్, అతడి పక్కనే ఉన్న కే.ఎల్ రాహుల్ కూడా నవ్వారు. దీంతో ఈ వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ నెటిజెన్లు రచ్చ రచ్చ చేశారు. తాజాగా సారా టెండూల్కర్ కి సంబంధించిన మరో వీడియోని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈ వీడియోలో ఓ క్రికెటర్ కి సంబంధించిన డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్ళింది సారా టెండూల్కర్. సీక్రెట్ గా డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లి హెల్మెట్, బ్యాట్ పక్కన కూర్చుని ఫోటో దిగింది. అయితే ఈ వీడియోని వైరల్ చేస్తూ.. సారా, గిల్ డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లిందని వైరల్ చేస్తున్నారు.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ రిలీజ్.. జస్‌ప్రీత్ బుమ్రా..




లేటెస్ట్ గా ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ ను రిలీజ్ చేసింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ జో రూట్ ఐసీసీ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్ గా నిలిచాడు. ఇక టాప్ టెన్ లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉన్నారు. లార్డ్స్ టెస్టులో పోరాటం చేసిన ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా 34వ ప్లేస్ కు చేరుకున్నాడు. లార్డ్స్ లో భారత్ తో జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లిష్ ప్లేయర్ జో రూట్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 104, రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులు చేయడంతో టెస్ట్ ర్యాంకింగ్స్ లో టాప్ ప్లేస్ కు చేరుకున్నాడు. ప్రజంట్ అతని ఖాతాలో 888 పాయింట్లు ఉన్నారు. ఇక మరో ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ రెండుస్థానాలు దిగజారి మూడోస్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ సీనియర్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ రెండోస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఇక టీమిండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ఒక స్థానం దిగజారి ఐదోస్థానానికి చేరుకున్నాడు. సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా ఆరు, శ్రీలంక ప్లేయర్ కమిందు మెండిస్ ఏడు, టీమిండియా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఎనిమిది, కెప్టెన్ శుభ్ మన్ గిల్ తొమ్మిదో స్థానాల్లో ఉన్నారు. పంత్ ఒక స్థానం, గిల్ మూడుస్థానాలు దిగజారాడు. ఇక పదో స్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ జేమీ స్మిత్ పదో స్థానంలో నిలిచాడు. అయితే, లార్డ్స్‌లో 72 పరుగులు, 61 నాటౌట్ గా నిలిచిన జడేజా ఐదు స్థానాలు ఎగబాకి 34వ స్థానానికి చేరుకున్నాడు. ఇదే మ్యాచ్ లో ఫస్ట్ ఇన్నింగ్స్ లో 100, సెకండ్ ఇన్నింగ్స్ లో 39 పరుగులు చేసిన కేఎల్ రాహుల్ కూడా ఐదు స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో ఉన్నాడు. లార్డ్స్ లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ 77 పరుగులకు ఐదు వికెట్లు సాధించి, బ్యాట్స్‌మెన్ లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలువడంతో రెండుస్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్ టీమిండియా మిస్టరీ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం బుమ్రా ఖాతాలో 901 పాయింట్లు ఉన్నాయి. ఇక దక్షిణాఫ్రికాకు చెందిన కగిసో రబాడా సెకండ్ ప్లేస్ కంటిన్యూ అవుతున్నాడు. ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ ఎగబాకి ఆరు స్థానాలు క్రాస్ చేసుకుని కెరీర్‌లో అత్యుత్తమంగా ఆరో స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో 62 వికెట్లు 16.53 సగటుతో వికెట్లు తీసిన బోలాండ్.. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్స్ జార్జ్ లోహ్మాన్, సిడ్నీ బార్న్స్ మాత్రమే మెరుగైన సగటుతో వికెట్లు పడగొట్టారు. ఇప్పటికే టాప్10లో ఆస్ట్రేలియా ప్లేయర్లు పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్‌లతో ఐసీసీ ర్యాంకింగ్స్ టాప్ టెన్‌లో ప్లేస్ సాధించుకున్నాడు. 1958లో ఇంగ్లండ్ జట్టు టాప్ 12లో ఆరుగురు బౌలర్లు ఉండగా.. తాజాగా ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు ఐసీసీ ర్యాంకింగ్స్ లో చోటు దక్కించుకున్నారు. ఇక టీమిండియా ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ 58వ స్థానం నుంచి 46వ స్థానానికి చేరుకున్నాడు.

# ధోని ఏం చేసినా ట్రెండ్ సెట్టరే..

టీమిండియా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ గురించి స్పెషల్ గా చెప్పాల్సిన అవసరం లేదు. ధోనీ క్రికెట్ ఆడితే అది ఒక ట్రెండే.. క్రికెట్ ఆడినన్ని రోజులు పలు రికార్డులు క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ధోనీ తన సొంత రాష్ట్రం జార్జండ్ కి సరికొత్త దిశా నిర్దేశం చేయడానికి రెడీ అయ్యారు. స్పోర్ట్స్, టూరిజం డిపార్ట్ మెంట్స్ ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధోనీ సలహాలు, సహకారం తీసుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ధోనీ ఓ ప్రోగ్రామ్ లో కనిపించాడు. ఇందులో ధోనీ ఎర్ర కండువా కప్పుకొని ఫొటోకి పోజులిచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటో వైరల్ అవుతోంది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఎర్ర కండువా కప్పుకొని ఇలాగే పలు సందర్భాల్లో కనిపించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో అందరూ ఎర్ర కండువా కప్పుకోండి అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ గవర్నెన్స్ వంటి ఆడ్వాన్స్ డ్ టెక్నాలజీ ఉపయోగిస్తూ.. రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. జార్ఖండ్ తీసుకుంటున్న ఈ కీలక నిర్ణయాలు.. రాష్ట్ర భవిష్యత్ ను పూర్తి గా మార్చబోతున్నాయి. ముఖ్యంగా జార్ఖండ్ క్రీడలు, పర్యాటక రంగాలను కొత్త శిఖరాలను తీసుకెళ్లడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం మాజీ భారత క్రికెట్ కెప్టెన్ ఎం.ఎస్. ధోనీ సహకారం కోరుతోంది. ఇందుకోసం ఆ రాష్ట్ర పర్యాటక, కళలు, సంస్కృతి క్రీడా శాఖ మంత్రి సుదివ్య కుమార్ తో మీటింగ్ లో పార్టిసిపేట్ చేశారు. స్పోర్ట్స్ రిలేటెడ్ మౌలిక సదుపాయలు, పర్యాటక సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ధోనీ అనుభవం.. నిబద్ధతతో రాష్ట్రాభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయం పై ధోనీ ఇంకా ఎలాంటి అఫిషియల్ అనౌన్స్ మెంట్ మాత్రం రిలీజ్ చేయలేదు. జార్ఖండ్ లోని దేవ్‌ఘర్ జిల్లా టీమ్ ఓ కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా మేళా ప్రాంతంలో రద్దీని నియంత్రించడానికి భద్రతను పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్, హెడ్ కౌంటర్ కెమెరాలను కూడా ఏర్పాటు చేసారు. ముఖ్యంగా జార్ఖండ్ ప్రభుత్వం తమ అన్ని కార్యాలయాలను 2026 నాటికి పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించింది. ఇక ప్రజంట్ ధోని స్టైల్ ను ఆయన ఫ్యాన్స్ కాపీ చేస్తూ వైరల్ చేస్తున్నారు.



# థర్డ్ టెస్ట్ ఓటమికి జడేజానే కారణం.. పుజారా స్ట్రాంగ్ రిప్లై

ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ లో టీమిండియా ఎంతో పోరాడి చాలా తక్కువ తేడాతో ఓటమి పాలైంది. 22 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోయింది. దీనికి గానూ ఫ్యాన్స్ తో పాటు టీమిండియా కూడా చాలా బాధపడింది. అయితే ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా అద్భుత పోరాడారు. 181 బంతులు ఆడి 61 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. టీమిండియాను గెలిపించేందుకు చివరి వరకు ప్రయత్నించాడు. అయితే దురదృష్టం వెంటాడడంతో టీమిండియా ఓటమి పాలైంది. ఈ క్రమంలో టీమిండియా ఓటమి పాలవడానికి జడేజానే కారణమని కొందరు మాజీలు విమర్శిస్తున్నారు. జడేజా మొదటి నుంచే కాస్త వేగంగా ఆడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని కొందరు కామెంట్ చేశారు. జడేజా డిఫెన్సివ్ మైండ్ సెట్ కారణంగానే టీమిండియా ఓడిపోయిందని విమర్శిస్తున్నారు. టీమిండియా మాజీ క్రికెటర్లు గంగూలీ, అనిల్ కుంబ్లే, సునీల్ గవాస్కర్, అశ్విన్ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వీరిపై మరో మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పూజారా ఆగ్రహం వ్యక్తం చేశాడు. వారి కామెంట్స్ కి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. చివరి రోజు లార్డ్స్ పిచ్ చాలా మందకొడిగా ఉంది. బంతి కూడా సాఫ్ట్ గా మారిపోయింది. అలాంటి పరిస్థితుల్లో వేగంగా ఆడడం కుదిరే పని కాదు. ఈ సిరీస్‌లో జడేజా బ్యాటింగ్ బాగుంది. నాలుగో ఇన్నింగ్స్‌లో అలా బ్యాటింగ్ చేయడం ఈజీ టాస్క్ అయితే కాదు. టెయిలెండర్ల అండతో మ్యాచ్ ను ముగించాలని జడేజా అనుకుని ఉండవచ్చు. అనవసరంగా వికెట్ పారేసుకోకూడదని జడేజా పట్టుదలగా ఆడాడు. అయితే అదృష్టం కలిసి రాలేదు అని ఛతేశ్వర్ పూజారా అభిప్రాయపడ్డాడు. కాగా ప్రస్తుతం టీమిండియా ఇంగ్లండ్ పర్యటనలో ఉండగా.. సరిగ్గా మరో వారం రోజుల్లో మాంచెస్టర్ లో 4 వ టెస్ట్ సిరీస్ కు సన్నద్ధం అవుతున్నారు.



# నాగార్జున జానర్ ఛేంజ్ తో ట్రెండ్ సెట్?





టాలీవుడ్‌లో కింగ్ నాగార్జున స్టైల్ స్పెషల్ గానే ఉంటుంది. న్యూ టాలెంట్ ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుండి ఎంతో మంది టాలెంటెడ్ డైరెక్టర్లని పరిచయం చేసిన రికార్డ్ ఆయనదే. కొత్త టాలెంట్ ని ఆయన ఎంకరేజ్ చేసి ఉండకపోతే ట్రెండ్ సెట్టర్ లాంటి శివ లాంటి ఓ యాక్షన్ సెట్టర్ వచ్చేదే కాదు. రామ్ గోపాల్ వర్మ లాంటి దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయమయ్యేవాడు కాదు. ఇలా ఎంతో మంది డైరెక్టర్లని, టెక్నీషియన్ లని నాగ్ ఇండస్ట్రీకి పరిచయం చేసి ఎన్నో కొత్త ప్రయోగాలు చేశారు. ఓ స్టేజ్ లో సెల్యూలాయిడ్ సైంటిస్ట్ అనిపించుకున్నారు. అయితే గత రెండు.. మూడేళ్లుగా నాగార్జున వరుస ఫ్లాపులతో ఏం చేయాలో తెలియని స్థితికి వెళ్లిపోయారు. ఇండస్ట్రీ స్టార్ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ హిట్ లు, బ్లాక్ బస్టర్లు ఇస్తుంటే నాగ్ మాత్రం ఫ్లాపులతో షాకులిచ్చారు. ఈ క్రమంలోనే ఆయన తన స్టైల్ మార్చుకుని కేవలం హీరో క్యారెక్టర్లు మాత్రమే చేస్తానని భీష్మించుకు కూర్చోకుండా కథకు కీలకంగా ఉండే పాత్రలకు సై అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. ఈ క్రమంలో ఆయన రీసెంట్ గా యాక్ట్ చేసిన కుబేర మంచి హిట్ అనిపించుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబట్టి ఔరా అనిపించింది. ఈ మూవీతో పాటు నాగార్జున మరో క్రేజీ సినిమాలోనూ కీ రోల్ ని ప్లే చేశారు. అదే సూపర్ స్టార్ రజనీకాంత్ కూలీ. లోకేష్ కనగరాజ్ డైరెక్ట్ చేసిన ఈ సినిమా ఆగస్టు 14న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ కాబోతోంది. ఇందులో కింగ్ సిమోన్ అనే పవర్ ఫుల్ డాన్ గా కనిపించి ఫ్యాన్స్‌తో పాటు సినీ లవర్స్ ని సర్ ప్రైజ్ చేయబోతున్నారు. ఇంత వరకు ఎన్నడూ చేయని క్యారెక్టర్‌లో కింగ్ నాగ్ కనిపించబోతున్నారు. ఇదే విషయాన్ని రీసెంట్ గా దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెలిపారు. ఎనిమిది సార్లు ఈ క్యారెక్టర్ కోసం నాగార్జునకు నరేషన్ ఇచ్చానని, ఆ తరువాతే ఆయన ఓకే చేశారని తెలిపాడు. నాగార్జున కోసం నాలుగు నెలలు ఎదురు చూశామని, తనతో పాటు రజనీకాంత్ కూడా ఆయన కోసం ఎదురు చూశారని చెప్పుకొచ్చాడు. ఇక ఈ క్యారెక్టర్ చేస్తున్నప్పుడు నాగార్జున తన 40ఏళ్ల కెరీర్‌లో వాడని పదాలని వాడారని, ఈ క్యారెక్టర్ లో ఆయనని ప్రేక్షకులు యాక్సెప్ట్ చేస్తారా లేదా అని నాగార్జునకు కొంత అనుమానంగా ఉందని చెప్పాడు. కింగ్ నాగ్ ని ఈ మూవీలో లోకేష్ కనగరాజ్ సరికొత్త తరహాలో స్టైలిష్‌గా ప్రజెంట్ చేసినట్టుగా తెలుస్తోంది. తనదైన మార్కు నటనతో నాగ్ ఖచ్చితంగా అందరిని డామినేట్ చేస్తాడని ఫ్యాన్స్‌తో పాటు టీమ్ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయితే నాగార్జున కూలీతో ట్రెండ్ సెట్ చేస్తాడనిడంలో ఎలాంటి సందేహం లేదని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది.



# ఈ క్షణం ఎంతో సంతోషం: కమల్, రజనీకాంత్

సూపర్ స్టార్ రజినీకాంత్, లోక నాయకుడు కమల్ హాసన్ ఇద్దరూ మంచి ఫ్రెండ్స్ అనే సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహం ఈనాటిది కాదు, గత 50 ఏళ్లుగా వీరిద్దరూ మంచి ఫ్రెండ్స్. ఆ అనుబంధంతోనే రాజ్యసభ సభ్యుడిగా సెలెక్ట్ అయిన సందర్భంగా తన చిరకాల మిత్రుడు రజినీకాంత్ ను కమల్ హాసన్ కలిశారు. ఈ సందర్భంగా రజినీ, కమల్ ను అభినందించగా, ప్రస్తుతం దానికి సంబంధించిన ఫోటోలను కమల్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టేముందు నాకెంతో ఇష్టమైన ఫ్రెండ్ తో నా ఆనందాన్ని పంచుకున్నా.. ఈ క్షణం నాకెంతో సంతోషంగా ఉందంటూ రాసుకొచ్చారు. రజినీ, కమల్ బాండింగ్ కు మెయిన్ రీజన్ వీరి గురువు కె. బాలచందర్. ఆయన దర్శకత్వంలో వచ్చిన అపూర్వ రాగంగళ్ తో రజినీకాంత్ హీరోగా పరిచయమవగా అదే సినిమా తెలుగులో తూర్పు పడమరగా రీమేకైంది. ఆ సినిమాతో మొదలైన వారి అనుబంధం 1985లో గిరఫ్తార్ వరకూ కంటిన్యూ అయింది. వారిద్దరూ కలిసి దాదాపు 20 సినిమాల్లో నటించారు. అందులో ఎత్తుకు పై ఎత్తు, అంతులేని కథ, వయసు పిలిచింది, అందమైన అనుభవం, అల్లావుద్దీన్ అద్భుతద్వీపం, పదనారు వయదినిలె, మూండ్రు ముడిచ్, అవర్ గళ్ లాంటివి ఉన్నాయి. వీరిద్దరూ కలిసి చేసిన ఓ సినిమా రిలీజైన సందర్భంగా ఫ్యాన్స్ మధ్య ఏర్పడిన గొడవ చాలా పెద్దదిగా మారి తమిళనాడులోని ఓ థియేటర్ కు భారీ నష్టం వాటిల్లగా ఆ తర్వాత వీరిద్దరూ కలిసి నటించడం మానేశారు. కలిసి సినిమాలు చేయడమైతే మానేశారు కానీ వారిద్దరి మధ్య స్నేహం మాత్రం అలానే చెక్కు చెదరకుండా ఉంది. ఒకరి సినిమాలను మరొకరు ప్రశంసించుకోవడం, ఒకరి పనుల్ని మరొకరు సమర్థించుకోవడం మాత్రం ఎప్పుడూ మానలేదు. కమల్ కంటే ముందు రజనినే పాలిటిక్స్ లోకి వస్తారని కూడా అంతా అనుకున్నారు. రజినీ కూడా ఆ దిశగా ప్రయత్నాలు చేశారు కానీ తర్వాత మనసు మార్చుకున్నారు. కానీ కమల్ మాత్రం మాటపై నిలబడి తమిళ ప్రజలకు, అభిమానులకు ఇచ్చిన మాట ప్రకారం మక్కల్ నీది మయ్యం అనే పార్టీ పెట్టారు. గత ఎన్నికల్లో డీఎంకేకు మద్దతు పలుకుతూ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోగా, పొత్తులో భాగంగా ఆ పార్టీ కమల్ ను రాజ్యసభకు నామినేట్ చేసింది. దీంతో మొదటిసారి చట్టసభల్లోకి వెళ్లబోతున్న కమల్, దానికంటే ముందు రజనీను కలిసి, ఆయన విషెస్ అందుకున్నారు. జులై 25న కమల్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయనుండగా, సీనియర్ హీరోలిద్దరూ ఇలా కలుసుకోవడం వారి ఫ్యాన్స్ లో ఆనందాన్ని నింపింది. ఇక అటు కమల్, ఇటు రజనీకాంత్ ఇద్దరూ ప్రజంట్ తమ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు.




# హరిహర వీరమల్లు సెన్సార్ కట్స్?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేసిన ఒక స్ట్రైట్ సినిమా చాలా కాలం తర్వాత రిలీజ్ కి వస్తుంది. పైగా ఈ మూవీ పవన్ కళ్యాణ్ కెరీర్ లో ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా రావడంతో ఆడియన్స్ కి మరిన్ని అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఆ సినిమానే హరిహర వీరమల్లు. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి నుంచి మొదలై ఇపుడు జ్యోతికృష్ణతో ముగిసిన ఈ సినిమా సెన్సార్ ని ముగించుకొని గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది. అయితే కొన్ని రోజులు కితమే సెన్సార్ పూర్తి చేసుకున్న వీరమల్లు జీరో కట్స్ తో యూ/ఏ సర్టిఫికెట్ ని అందుకున్నట్టు తెలిసింది. కానీ ఇప్పుడు సెన్సార్ సర్టిఫికెట్ బయటకి వచ్చింది. దీనితో వీరమల్లు సినిమా మొత్తం 162 నిమిషాలు రాబోతుండగా ఇందులో కొన్ని మైనర్ కట్స్ ని సెన్సార్ యూనిట్ చెప్పింది. మొత్తం 5 కట్స్, రీప్లేస్ మెంట్స్ హరిహర వీరమల్లుకి పడ్డాయి. స్టార్టింగ్ వాయిస్ ఓవర్ తో కూడిన నిరాకరణ నుంచి కుళి కుతుబ్ షాహ్, కొన్ని విగ్రహాల కరిగింపు అలాగే ఒక గర్భస్థ స్త్రీని హింసించే సీన్ అలాగే ఆలయ ద్వారాన్ని కాలితో తన్నే సీన్స్ వంటివి సెన్సార్ వారు ఆబ్జెక్ట్ చేశారట. వీటికి వేరే మార్గాలు సెట్ చేయాలని సూచించారు. సో వీటికి కొత్త మార్పులతో వీరమల్లు జూలై 24న థియేటర్స్ లో పడనుంది. ఇక ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ యాక్షన్ సీక్వెన్సులతో అదరగొట్టనున్నారు. అంతేకాకుండా బ్రో మూవీ తర్వాత పవన్ కళ్యాణ్ కంప్లీట్ గా రాజకీయాలకు పరిమితం కావడంతో ఆయన యాక్టింగ్ ను ఫ్యాన్స్ మిస్ అవుతున్నారు. అందుకే ఇన్ని రోజుల తర్వాత రానున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ కూడా వెయ్యి కళ్లతో వెయిట్ చేస్తున్నారు.

# రాజమౌళి సినిమా..మహేష్ రిస్క్ కు రెడీనా?

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో SSMB29 ప్లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ కమ్ హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా, మాలీవుడ్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆర్. మాధవన్ మహేష్ తండ్రిగా కనిపించనున్నట్లు టాక్. భారీ బడ్జెట్ తో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న సినిమా కోసం ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వని రాజమౌళి.. షూటింగ్ మాత్రం చాలా స్పీడ్ గా జరుపుతున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ ను పూర్తి చేసిన రాజమౌళి.. త్వరలో మూవీ టీమ్ కెన్యా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ కీలక సీన్స్ షూట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తర్వాత హైదరాబాద్ సిటీ అవుట్ స్కట్స్‌లో వేసిన వారణాసి సెట్ లో షూట్ చేయనున్నారని సమాచారం. అయితే ఫారెస్ట్ అడ్వెంచర్ జోనర్ లో రూపొందుతున్న సినిమాపై ఇప్పటికే ఆడియన్స్ లో వేరే లెవెల్ అంచనాలు నెలకొన్నాయి. బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని ప్రతీ ఒక్క సినీ ప్రియుడు, ఫ్యాన్ ఫిక్స్ అయిపోయారని చెప్పాలి. అయితే సినిమాలో యాక్షన్ సీన్స్ ఫుల్ గా ఉన్నట్లు ఇప్పటికే అందరికీ అర్థమైపోయింది. ఫారెస్ట్ అడ్వెంచర్ కాబట్టి అనేక స్టంట్స్ ఉంటాయి. నెవ్వర్ బిఫోర్ అనేలా మహేష్ బాబు.. యాక్షన్ సీక్వెన్స్ లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో అంతా వాటిని చూసేందుకు ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు మరో వార్త వైరల్ అవుతోంది. సాధారణంగా చాలా మంది హీరోలకు డూప్స్ ఉంటారు. కొన్ని యాక్షన్ సీన్స్ లో వారే నటిస్తారు. కానీ ఇప్పుడు డూప్స్ కు మహేష్ నో చెప్పేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తానే స్వయంగా యాక్షన్ మోడ్ లో దిగుతున్నారని టాక్. డూప్స్ బదులు హార్డ్ వర్క్ చేయాలని మహేష్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. అందుకు గాను ఇప్పటికే కసరత్తులు మొదలు పెట్టారని సమాచారం. ఇందులో నిజమెంతో తెలియదు. ఒకవేళ నిజమైతే మాత్రం.. ఇప్పటి వరకు మహేష్ కెరీర్ లో భారీ యాక్షన్ సీన్స్ లో నటించడం ఇదే ఫస్ట్ టైమ్. సో మహేష్ బాబు రిస్క్ కూడా సిద్ధమైనట్లే. మరి ఈ సినిమాతో మహేష్ బాబు రేంజ్ ఎక్కడి వరకు వెళ్తుందో అనేది చూడాలి.



# ఉపాసన: 150 అనాధ ఆశ్రమాల దత్తత



మెగా కోడలు ఉపాసన సోషల్ యాక్టివిటీస్ లో చాలా యాక్టివ్ గా ఉంటారని అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియా వేదికగా వీలైనంత వరకూ అవేర్ నేస్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంటారు. ఆరోగ్యానికి సంబంధించిన విషయాలతో పాటు పర్సనాలిటీ డెవెలప్ మెంట్ కు సంబంధించిన టాపిక్స్ గురించి మాట్లాడుతుంటారు. అలాగే అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి విషయాల పట్ల మరింత చురుకుగా పనిచేస్తున్నారు. లేటెస్ట్ గా ఉపాసన ఏకంగా 150 అనాధ ఆశ్రమాలను దత్తత తీసుకున్నారు. ఇక నుంచి వాటి బాధ్యత మొత్తం ఉపాసన చూసుకుంటారు. అనాధ బాలలు, వృద్ధులు పట్ల సహృదయంతో ఉపాసన ముందుకు కదలడం అన్నది ఎంతో గొప్ప విషయం. వాళ్లతో ఉపాసన కలిసి వర్క్ చేస్తున్న తీరు చూస్తుంటే? ఉపాసన మనసు ఎంత గొప్పదన్నది హైలైట్ అవుతుంది. 150 అనాధ శ్రమాల్లో వాళ్లకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అలాగే పండగలు, పబ్బాలు సమయంలో కూడా ఉపాసన స్పెషల్ గా ఇకపై పర్యటించే అవకాశం ఉంది. అనాధలంటే ఎవరూ లేని వారు కాబట్టి తమకు తోడుగా తాను ఉన్నానని భరోసా అన్ని రకాలుగా కల్పిస్తున్నారు. ఇప్పటికే అపోలా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాజాగా 150 ఆశ్రమాలు కూడా తోడవ్వడంతో ఉపాసన మరింత బిజీగా ఉండనున్నారు. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో యాక్టివిటీ కూడా తగ్గించారు. చరణ్ కుసంబంధించిన విషయమో.. అత్తమ్మకు సంబంధించిన విషయాలు అప్పుడప్పుడు పంచుకునేవారు. కానీ ఇప్పుడు అవి కూడా తగ్గాయి. అపోలా సహా సేవా కార్యక్రమాల్లో మరింత బిజీ అవ్వడంతోనే ఇంటి విషయాలకు ప్రాధాన్యత తగ్గించినట్లు కనిపిస్తుంది. ఉపాసన చేస్తోన్న ఈ సేవా కార్యక్రమాల విషయంలో రామ్ చరణ్ ఎంతో గర్విస్తున్నారు. ఇప్పటికే చిరంజీవి బ్లండ్ బ్యాక్ పేరిట పలు సేవా కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇక మరోపక్క రామ్ చరణ్ తన బ్యాక్ టు బ్యాక్ మూవీస్ తో ఫుల్ బిజీగా మారారు.